

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

వెల 4 అణాలు ANDHRAPATRIKA ILLUSTRATED WEEKLY 5-4-1950

విషయానుక్రమణిక

5 ఏప్రెల్ 1950

ముఖచిత్రం—దుర్గా గేటీ—కైలాసనాథ దేవాలయం కాంచీపురం: ఛాయాచిత్రకారుడు, టి. రంగనాథన్

సంపాదకీయం— 2

మన దేశం—సీతారాం 5

నేటి ప్రపంచం—సూర్యనారాయణ 6

కాంగ్రెసు-కమ్యూనిస్టులు—శ్రీ సహజానందం 8

రేడియో పోటీ (కథానిక)— శ్రీ గోళ్లమూడి లక్ష్మీనారాయణ 9

రుద్రమదేవి (నవల)—నోరి నరసింహశాస్త్రిగారు 11

బాలానందం— 13

సూపర్ కళాశాల—ఉచితసాంకేతిక విద్యాప్రదానసంస్థ 17

రోజులు కలిసివచ్చినా-(గల్పిక) శ్రీ కొడవటిగంటి కుటుంబరావు 19

కాంచీపుర పల్లవశిల్పాలు - కైలాసనాథ దేవాలయం చిత్రాలు 20-21

సినిమా—రాగిణీవారి తిరుగుబాటు 22

మేళకర్తలు: కర్ణాటక - ఔత్తరాహిక విధానములు— శ్రీమతి జె. కమలాదేవి 23

కామరూప్ కొండజాతులు—శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య 25

మట్లవారిమీది చాటువులు—శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య 27

లేఖలు—ఆంధ్రసారస్వతపరిషత్తు బొంబాయిశాఖ 40



మార్చి 25వ తేదీన 'కింగ్ ఎడ్వర్డురోడ్డు'లోని కాంచనిక కేంద్రంలో గృహపరిశ్రముల ప్రదర్శనం జరిగింది. ఆ ప్రదర్శన సందర్భంలో శిక్షణతరగతులలో కృతార్థతపొందినవారికి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యోగ్యతాపత్రాలు బహూకరించారు.

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్
(మహాభారతము)

Founder . K NAGESWARA RAO

సంపుటము **42**
సంచిక **31**

వికృతి సంవత్సర చైత్ర బహుళ తదియ బుధవారము



కంచి, కైలాసనాథాలయంలో నందీశ్వరుడు.



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ ఏప్రెల్ నెల 5-వ తేది బుధవారము

ప్రభుత్వవిధానం-శాసనసభ్యుల వైఖరి

రాష్ట్రశాసనసభలలో బడ్జెట్ పైనను, వివిధ శాఖల డిమాండ్లపైనను జరిగిన చర్చలను, చర్చలకు మంత్రు లిచ్చిన సమాధానములను పరిశీలించిన ప్రజల సమస్యల పరిష్కారమునకు ఈ ప్రజాస్వామిక ప్రభుత్వవిధానము ఉపకరింపగలదా యను సందేహము కలుగకతప్పదు. ఇప్పటికి నెలరోజులుగ రాష్ట్రశాసనసభల సమావేశములు జరుగుచున్నవి. సభ్యులు సమావేశములకు హాజరుగాకపోయినను, అవసరమునకు నగరమునందే యుంటుండిరి. మంత్రులు మధ్య మధ్య సంచారమునకు వెళ్ళివచ్చుచుండినను ఇంతకాలము ఇతరకార్యక్రమములను నిలిపి శాసనసభాకార్యక్రమమునకే తమ కాలమునంతను వినియోగము చేయుచుండిరి. అయినప్పటికిని మంత్రులు శాసనసభ సమావేశము జరుగుచున్నపుడు సభయం దుండుట లేదని సభ్యులు విమర్శించిరి. సభ్యులు చక్కని ప్రసంగములు చేసిన మంత్రులు హాజరుకాగలరని ఆర్థికమంత్రి సభానాయకుడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఆ విమర్శలకు సమాధాన మిచ్చిరి. ఆ సందర్భమున స్పీకరు స్థానములోనున్న డిప్యూటీస్పీకరు 'మంత్రులు సమావేశమునకు హాజరైనగదా సభ్యుల ప్రసంగము లెట్లున్నవో తెలుసుకొనవీలగును' అని తెలిపిరి.

ఈ సంఘటననుబట్టి ఒక్కవిషయము వెల్లడగుచున్నది. రాజ్యాంగశాసనము కొన్ని నిబంధనలను ఏర్పాటుచేసియున్నకారణమున ఈ శాసనసభల సమావేశములు, శాసనసభయందు ఆయవ్యయఅంచనాల ప్రతిపాదన, వాటిపై దీర్ఘచర్చలు, అందుకు మంత్రులు సమాధానము లిచ్చుట జరుగుచున్నది. 1950 జనవరి 26 న నూత్నరాజ్యాంగము అమలు జరిగి, దేశస్థాయిలో వచ్చిన బ్రహ్మాండమైన మార్పును మంత్రులుగాని, శాసనసభల సభ్యులుగాని గుర్తించినట్లు కన్పింపదు. తాము ప్రజాప్రతినిధుల మని, ప్రజలయెడ ప్రభుత్వముకంటె తమకు ప్రత్యేక బాధ్యత గలదని వీరు ఇంతవరకు గ్రహించలేదు. ఈ విషయము ఇతరుల విషయమున ఎట్లున్నను, ముస్లింలీగర్ల విషయమున యథార్థమైనది. వారిప్పటికీ ప్రత్యేకప్రాతినిధ్యమని, పాకిస్తాన్ మనస్తత్వముతోనే వ్యవహరించుచుండిరి. అందువలన వారి ఋజువర్తనమును, దేశభక్తిని శంకింపవలసివచ్చుచున్నది. అందువలననే వారి ప్రసంగములకు ప్రాధాన్యముగాని, వారి యభిప్రాయములకు విలువగాని లేకుండపోవుచున్నది.

మంత్రులు తమ విధానముపై ఎవరు విమర్శలు చేసినను ఒకరీతిగనే వాటిని పరిగణించుచున్నారు. వాటిని అలక్ష్యముచేయుటే వారికి అలవాటైనది. అందువలన నెలరోజులు ప్రభుత్వవిధానముపై అనుదినము జరుగుచున్న తీవ్రవిమర్శల అనంతరముకూడ ప్రభుత్వవిధానము యథాప్రకారముగనే యున్నది. కనుకనే ప్రజాస్వామికవిధానము ప్రజల సమస్యల పరిష్కారమునకు ఎంతవరకు తోడ్పడగలదను అనుమానము కల్గుచున్నది.

పబ్లిక్ వర్క్సుశాఖామంత్రి, ఆర్థికమంత్రి ఆంధ్రసభ్యుల విమర్శల కిచ్చిన సమాధానములను విచారించిన ఇకముందైనను నేడు ప్రభుత్వవిధానమునం దున్న లోపములు సరికాగలవను ఆశ కన్పించుటలేదు. ఉద్యోగములందు ప్రస్తుతము ఆంధ్రులకున్న ప్రాతినిధ్యము జనాభాసూత్రమునుబట్టి న్యాయముగ లేదుగనుక ఆ కొరతను భర్తీచేయుటకు, కొంతకాలమువరకు ఆంధ్రులకు ఎక్కువ ప్రాతినిధ్య మివ్వవలెనని సభ్యులు సూచింపగా, సభానాయకుడు ఆ సూచనను అవహేళన చేసి, ఉద్యోగములందు ప్రాతినిధ్యము భాషనుబట్టి ఇవ్వవలెనా? జిల్లాలవారీగా ఇవ్వవలెనా?, మతముల. కులములవారీగా ఇవ్వవలెనా? అని ఎగురుప్రశ్న వేసిరి,

ఆర్థికమంత్రి అసలు సమస్యను అర్థము చేసుకొనలేదనే వారి ప్రశ్నలు ప్రకటించుచున్నవి. ఆ ప్రశ్నలు వారి సమయస్ఫూర్తికిగాని, చాతుర్యమునకు గాని నిదర్శనములు కావు

భారతదేశమును ఏనాటికైన భారతీయులే పాలించుకొనవలసియుండును గనుక ఉద్యోగములందు భారతీయులకే ఎక్కువ ప్రాతినిధ్య మివ్వవలెనని కాంగ్రెసు అర్థశతాబ్దముగ జరిపిన ఆందోళనను ఆర్థిక మంత్రి మరిచియుండవచ్చును. ఆనాడు కాంగ్రెస్ ఏ సూత్రముపై "ఇండియనైజేషన్ ఆఫ్ సర్వీసెస్" అని ఆందోళన సాగించెనో నేడు ఆంధ్రులు అదేసూత్రముపై ఉద్యోగములందు ఆంధ్రులకు అదనపు ప్రాతినిధ్య మివ్వమని కోరుచున్నారు. ఆంధ్రరాష్ట్రము ఏర్పడకతప్పదు. ఆంధ్రరాష్ట్రము ఏర్పడినప్పటినుండియు, ప్రభుత్వవ్యవహారములు ఆంధ్రములోనే జరుగును. అప్పుడు 'రాష్ట్రభాష' రాని ఉద్యోగులకు ఆ రాష్ట్ర ప్రభుత్వమునందు స్థానము ఉండదు అప్పు డేర్పడనున్న ఈప్రమాదమును నివారించుటకే ఆంధ్రసభ్యులు ఇప్పటినుండి ఆంధ్రులకు అదనపు ప్రాతినిధ్య మివ్వమని కోరుచున్నారు.

ఇందుకు ఆర్థికమంత్రి ఇచ్చిన సమాధానమునందు మరొక లోపముకూడా గలదు. పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ పరీక్షలందు ఆంధ్రులు ఉత్తీర్ణు లగుటలేదని, అందువలన వారికి ఉద్యోగములందు ప్రాతినిధ్యము తక్కువగుచున్నదని చెప్పిరి. ఈ సందర్భమున ఆర్థిక మంత్రిమరొక విషయమును స్ఫురణకు తెచ్చుకొనవలసియున్నది. వెనుకబడినవారికి ఉద్యోగములందు విశేష ప్రాతినిధ్య మొసగవలెనని ప్రభుత్వము నిర్ణయించినపుడు ఆ ప్రకారము అభ్యర్థుల అర్హతలను వారి విషయమై కఠినముగా పాటింపలేదు. ప్రమాణమును తగ్గించిరి. ఆర్థికమంత్రి భావించినట్లు ఆంధ్రులు పబ్లిక్ కమిషన్‌పరీక్షలందు ఉత్తీర్ణులు గాకున్న వారికి అదనపుప్రాతినిధ్య మిచ్చుట న్యాయమని అంగీకరించిన సందర్భమున, పైవిధముగ చేయవచ్చును. ఇంతకు అసెంబ్లీచర్చలవల్ల స్పష్టమైనది రాష్ట్రప్రభుత్వము ఆంధ్రులకు ఇదివరలో జరిగిన అన్యాయమును సరి చేయుటకు సుముఖముగ లేదని. అలాంటప్పుడు ఈ విషయమై ఇంతచర్చ జరుపుట నిరర్థకము కాదా?

అట్లె పోలీసుశాఖయందు ప్రమోషను లిచ్చునపుడు, పోలీసులను, సబ్ ఇన్స్పెక్టరులను రిక్రూటు చేయునపుడు సమర్థతకే ప్రాధాన్య మిచ్చి అవసమైన, అవకాశ మున్న, 'కమ్యూనల్ జి. ఓ.'ను పాటింపకుండుట తమ యభిమతమని సభానాయకుడు సెలవిచ్చియుండెను. ఆచరణలో అట్టిది కన్పించుటలేదు. సమర్థులైనవారు, అనుభవముగలవారు ఉన్నను, కేవలము సిఫార్సులపై సమర్థులు కానివారిని, అనుభవము తక్కువ వున్నవారిని పై ఉద్యోగములకు నియమించుట జరుగుచున్నది. ఇందువలన అసంతృప్తి ప్రబలుట సహజము. శాంతి, భద్రతలను సంరక్షింపవలసినవారిలో ఇట్టి అసంతృప్తి ఏర్పడుట ప్రమాదకరమని ఆర్థికమంత్రి గ్రహింపవలసియున్నది. ఇట్టి లోపము లున్నవాటిని వెంటనే ప్రభుత్వము సవరించునను విశ్వాసము కలుగుటలేదు. ఇందుకు మంత్రి మాధవమీనన్‌గారు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి ఆరోపణల విషయములో వెల్లడించిన వైఖరే ఆధారము.

"ఒకజిల్లావారిని మరొక జిల్లాకు పబ్లిక్ ప్రాసిక్యూటరుగ నియమించుట న్యాయముగ లేదు. అట్టి ఉద్యోగములకు వ్యక్తులను నియమించునపుడు రాజకీయ ప్రయోజనముల ననుసరించి నియమించరాదు. ఒక జిల్లాలో ఒకే వ్యక్తిని మూడుపర్యాయములు నియమించి అదే పద్ధతి మరొకజిల్లాకు కూడ దనరాదు." అని విశ్వనాథముగారు ఆరోపించినపుడు లాశాఖామంత్రి మాధవమీనన్‌గారు "ఎవరి నట్లు నియమించితిమి ?" అని అడిగిరేగాని "అట్టిది జరగలేదనిగాని, జరిగిన తక్షణము ఆ లోపమును సవరింపగల"మని గాని చెప్పలేకపోయిరి.

ఈ ఒక్క ఉదంతమునుబట్టి ప్రభుత్వవ్యవహారము ఎట్లు నిర్వహింపబడుచున్నదో ఊహించుకొనవచ్చును. ఈ దుస్థితి, ఆశ్రితజనపక్షపాతము, కులమత విచక్షణ అంతరించిన గాని ప్రజాస్వామికప్రభుత్వ విధానము ఫలప్రదము కాజాలదు.

పరిశ్రమలపై ప్రభుత్వ ఆధ్వర్యం

పరిశ్రమల మంత్రి శ్యామప్రసాద్ ముఖర్జీ గారు పార్లమెంటులో ప్రకటించినట్లు షోలాపూరు బట్టలమిల్లువిషయములో ప్రభుత్వము అనుసరించిన విధానము ఇతర పారిశ్రామికసంస్థలు సక్రమముగ ప్రవర్తించుటకు తగిన హెచ్చరికగ నుండగలదు. ప్రభుత్వబిల్లుపై పార్లమెంటులోజరిగినచర్చ షోలాపూరు మిల్లును నిర్వహించిన మేనేజింగ్ ఏజెంట్లు వాటాదారుల ధనమును ఎట్లు దుర్వినియోగము చేసిరో స్పష్టముగ వెల్లడించినది. ఈ మిల్లు ఏవిధముగ నిర్వహింపబడినదో విచారించుటకు ప్రభుత్వము నియమించిన ఉపసంఘ నివేదికనుబట్టి మిల్లునిర్వాహకులు ఆరుకోట్ల రూపాయిలపైచిల్కు వాటాదారుల పెట్టుబడిని దుర్వినియోగము చేసినట్లు వెల్లడియగుచున్నది. ఈ దుర్వినియోగమైన 619 లక్షల రూపాయలలో ఒక లక్షరూపాయిలు మిల్లుడైరెక్టరులలో ఒక డైరెక్టరు సోదరుని వివాహమునకు ఖర్చు అయినదని ఆర్. కె. సిధ్వాగారు ప్రకటించిరి. వీటినిబట్టి మిల్లుడైరెక్టరులు, నిర్వాహకులు ఎంత బాధ్యతారహితముగ ప్రవర్తించిరో స్పష్టమగుచున్నది. ప్రభుత్వము గతజనవరిలో జోక్యము కల్గించుకొనకపోయిన తడవకు 30 వేల పౌనుల నూలును ఒక లక్షగజములబట్టను తయారుచేయగల మిల్లు నిరుపయోగమై యుండెడిది. డాక్టర్ ముఖర్జీ గారి అంచనాలు సరియైనవైన ఆరు మాసములలో మిల్లు స్వయంపోషకమై స్థిరపడిపోగలదు. ప్రభుత్వము తీసుకొనిన ఈచర్యకు ఇతర పారిశ్రామికులు హర్షించుట, ఈ మిల్లునిర్వహణలో ప్రభుత్వముతో సహకరించుట పరిశ్రమలమంత్రి తెల్పినట్లు దేశపారిశ్రామికాభివృద్ధికి శుభసూచకము.

ప్రభుత్వము షోలాపూరుమిల్లులను స్వాధీనము చేసుకొనలేదు. పరిశ్రమలమంత్రి వెల్లడించిన అభిప్రాయములనుబట్టి ప్రభుత్వమునకు అట్టి ఉద్దేశ్యము లేదని కూడ స్పష్టమగుచున్నది. ప్రస్తుతశాసనము ప్రకారము ప్రభుత్వము మిల్లునిర్వహణబాధ్యతను మాత్రమే స్వీకరించుచున్నది. ప్రభుత్వము అంచనా వేసినప్రకారము ఆరుమాసములలో మిల్లు స్వయంసమృద్ధమై, సక్రమముగ నిర్వహింపబడుచుండిన క్రొత్త డైరెక్టరులను నియమించి వారికి మిల్లును తిరిగి స్వాధీనము చేయుటకు తాము సిద్ధముగ నుంటిమని పరిశ్రమలమంత్రి డా॥ ముఖర్జీ గారు ప్రకటించిరి. కనుక పరిశ్రమలు జాతీయముచేయుటకు ప్రభుత్వము ఈ విధానమును అనుసరించుచున్నదని భావించుటకు ఎట్టి ఆధారములును లేవు. ఈ విధముగ ప్రజావసరములకు సంబంధించిన పారిశ్రామికసంస్థలను స్వాధీనము చేసుకొనుటకు ప్రభుత్వము ఎట్టి చర్యలను తీసుకొనునో కూడ పరిశ్రమలమంత్రి అసందిగ్ధముగ ప్రకటించియుండెను. "పరిశ్రమ జాతీయప్రాధాన్యము కలిగియుండవలెను. పరిశ్రమ స్వయంపోషకమైనది కావలెను. యంత్రసామగ్రి ఏ స్థితిలో నున్నదో, సాంకేతిక ప్రవీణులు నివేదింపవలెను. ఇది జరిగినతరువాత నిర్వహణ అసమర్థముగ జరుగుచున్నట్లు విచారణ వలన స్పష్టము కావలెను. అప్పుడే ప్రభుత్వము పరిశ్రమల నిర్వహణబాధ్యతను స్వీకరించువిషయమై ఒక నిర్ణయమునకు రాగలదు" అని డాక్టర్ ముఖర్జీ గారు తెలిపిరి.

ఏ పరిశ్రమవిషయమునను, అందును వ్యక్తుల నిర్వహణకు వదలివేయబడిన పరిశ్రమల విషయమున ముఖ్యముగ, ప్రభుత్వము తొందరపడి ఎట్టి చర్య తీసుకొనదు. సిధ్వాగారు సూచించినట్లు కొన్ని పారిశ్రామికసంస్థలను, రద్దుచేయవలసిన యవసరము కూడ ఉండవచ్చును. వాటి విషయమునకూడ ప్రభుత్వము ఎట్టి తొందరపాటుచర్య తీసుకొనదని ముఖర్జీ గారు స్పష్టము చేసిరి.

షోలాపూరుమిల్లునిర్వహణ విషయమున ప్రభుత్వము తీసుకొనిన చర్య పారిశ్రామికులకు వారి కర్తవ్యమును బోధించుచున్నది. మేనేజింగ్ ఏజెంట్లకది ఒక తీవ్రహెచ్చరిక కాగలదు. అట్లే ప్రభుత్వసామర్థ్యమునకు అది ఒక పరీక్ష కాగలదు. ప్రభుత్వనిర్వహణ, వ్యక్తుల నిర్వహణకంటె అసమర్థముగ నుండునను ఆరోపణ నిరాధారమని ఋజువుచేయుటకు ప్రభుత్వమునకిది ఒక అవకాశము కాగలదు. ఈ శాసన ఫలితముపైననే దేశపారిశ్రామికాభివృద్ధి విస్తరణ ఎక్కువగ ఆధారపడియున్నది.

మనదేశం

దేశైక్యత *

బ్రిటిష్ పరిపాలనకాలంలో స్వదేశ సంస్థానాలని చెప్పబడిన ప్రాంతాలన్నిటా అపూర్వమైన పరిణామం వచ్చింది. 1950 ఏప్రిల్ 1 వ తేదీనుంచి మిగతా రాష్ట్రాలలో వలెనే ఈ ప్రాంతాలలో కూడా సైన్యాల పైన అధికారం, రైల్వే రవానా, తంతి తపాలా రేడియో వసతులు, రాబడిపన్ను రవానా సుంకాలు, ఎక్సైజ్ పన్నులు వసూలుచేసే అధికారం నెహ్రూమంత్రి వర్గనిర్వహణక్రిందికి వస్తాయి పాకిస్తాన్ మినహా భరతఖండంలో ఆసేతుహిమాచల పర్యంతం ఒకేరీతి పరిపాలన స్థాపిత మౌతున్నది దేశంలో ఇప్పుడు పరిపాలనలో అనేక లోపాలున్నమాట నిజమే పూర్వ సంస్థానాలలో పరిపాలన మరీ హీనంగా ఉంది ప్రజలకి ప్రభుత్వం సంరక్షణ ఇవ్వడమంటే ఏమిటో తెలియని, జీవనానికి సౌకర్యాలు సమకూర్చడమంటే ఏమిటో తెలియని సంస్థానాలనేకం ఉన్నాయి ఆ ప్రాంతాల భూమిసాగు దుర్దశలో ఉంది. ఏ కొద్ది సంస్థానాల్లోనో తప్ప నీటివసతి లేనేలేదని చెప్పవచ్చును. రవానా సౌకర్యాలు బొత్తిగా మృగ్యం. క్రమంగా ఈ ప్రాంతాలలో ఆర్థికాభివృద్ధికి యత్నం జరగవచ్చును. అంటే పెద్దమార్పు ఉంటుందని చెప్పడం లేదు. హీనంగా ఉన్న సంస్థాన ప్రాంతాల ఆర్థికస్థితి రాష్ట్రాలలో పరిస్థితి వరకైనా వృద్ధికాగలదని ఆశించవచ్చును.

ఏప్రిల్ ఒకటి *

ఏప్రిల్ 1 వ తేదీని బొంబాయిరాష్ట్రం అంతటా మద్యనిషేధం ప్రవేశపెట్టబడింది భారతవిమానదళం పదిహేడవ వార్షికోత్సవం పరిశ్రమల్లూ, నౌకావిమానాది బలాలూ బొత్తిగా లేని ఆసియాలో రష్యా తరవాత భారతదేశానికి అధికబలం ఉందన్నారు. మన విమానబలంలో బాంబర్లు లేవు. ఫోర్ట్రెస్‌లు లేవు ఫైటర్లు స్పిట్ ఫైర్లు ఉన్నాయి. గంటకి అయిదువందల మైళ్లకంటె మించిన వేగంతో ఎగిరే జెట్ విమానం ఒకటుంది. కాని దాన్ని నడపగల భారతీయుడు లేడు. మన విమానదళాధిపతి (నౌకాదళాధిపతి మాదిరిగానే) బ్రిటిష్ దేశస్థుడు. విమాననిర్మాణం మనదేశంలో లేదు. విమానంలోని అంగాలన్నీ బ్రిటన్ అమెరికా మొదలైన దేశాలనుంచి కొనితెచ్చుకుని విమానాలుగా కూర్చే పరిశ్రమమాత్రం బెంగుళూరులో ఒకటుంది. వైమానిక శిక్షణకు ఇంకా కొత్తకేంద్రాలు కొన్ని స్థాపించబడుతున్నాయి.

యుద్ధానికవసరమైన విమానబలంకంటె ప్రయాణాలకి వినియోగపడుతున్న విమానయానసౌకర్యం మనదేశంలో అధికం విమానయానంలో ప్రమాదాలు అత్యల్పం క్రమక్రమంగా మన విమానబలం వృద్ధికావడానికి చాలా అవకాశాలున్నాయి.

హౌరాలో అశాంతి *

సురక్షితమైన ఆశ్రయంకోసం తూర్పుబెంగాల్‌నుంచి పశ్చిమబెంగాల్‌కి రోజూ వస్తున్న వేలాదిహిందువులకు ఆహారాదికాలేర్పాటు చెయ్యడంతోపాటు, పశ్చిమబెంగాల్లో ఉన్న మహమ్మదీయుల్ని కాపాడే బాధ్యతకూడా ప్రభుత్వంపైన పడింది. వందలాదిగా మహమ్మదీయుల్ని తూర్పుబెంగాల్ తీసుకుపోతున్న రైళ్ళపైన హిందువులు దాడి చెయ్యడానికి యత్నాలు చేశారు.

హౌరా ప్రాంతంలో ఈ అలజడి అధికమయింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పోలీసురక్షణ ఏర్పాటుచేశారు. చాలవరకు ప్రమాదం సంభవించకుండా ప్రయాణీకుల్ని కాపాడారు. బెంగాల్ వాణిజ్యసభాధ్యక్షుడు ఏ. యల్. కెమెరాన్ హత్యకు గురికావడంతో అల్పసంఖ్యాకవర్గాల రక్షణ బాధ్యతను భారతప్రభుత్వం సైనికదళాలకొప్పగించవలసివచ్చింది. హౌరా ప్రాంతంలో శాంతిభద్రతకు సైనికులు నియమితులైనారు. వెంటనే ఆ ప్రాంతంలో శాంతి ఏర్పడింది

పశ్చిమబెంగాల్లో పరిస్థితి తీవ్రతరం కాగానే, పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ అలీఖాన్ నెహ్రూతో సమాలోచనలకు సమ్మతించాడు అల్పసంఖ్యాకవర్గాల సమస్యను పరిష్కరించవలసిన అగత్యం పాకిస్తాన్ ప్రభుత్వానికి ఇప్పటికి తెలిసివచ్చింది ఈ సమస్యను శాశ్వతంగా ఎలా పరిష్కరించాలనే విషయంపైన భారతదేశంలో, ముఖ్యంగా పశ్చిమబెంగాల్లో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఇప్పుడీ సమస్య సంభవించడానికి మూలహేతువు తూర్పుపాకిస్తాన్ ఆర్థికదుస్థితే ననే విషయాన్ని అంగీకరించినట్లయితే, పాకిస్తాన్ భారతదేశాల మధ్య ఉత్పన్నమైన సమస్యలన్నిటినీ నెహ్రూ లియాఖత్ అలీఖాన్‌లు చర్చించక తప్పదని తెలుస్తుంది పాకిస్తాన్ ప్రధాని ప్రకటనలో ఇటువంటి సూచన కానరావడంలేదు. అల్పసంఖ్యాకవర్గాల సమస్య ఒక్కటే చర్చించదలిచినట్లు ఆ ప్రకటనలో స్పష్టమౌతున్నది.

బెంగాల్ రాష్ట్రాల్లో మతకలహాలకు మరొక ముఖ్యహేతువు తూర్పుబెంగాల్ అనుసరిస్తున్న మతప్రధానమైన పరిపాలనేనని బెంగాల్ హిందువుల అభిప్రాయం. కనీసం తూర్పుబెంగాల్లోనైనా మతంతో నిమిత్తం లేకుండా సర్వమతాలవారికీ సమానప్రతిపత్తి నిచ్చే ప్రజాస్వామ్యవిధానాన్ని అనుసరించగలరని పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించడం అవసరమని తూర్పుబెంగాల్ కాంగ్రెస్ నాయకులన్నారు కాని ఇస్లాంమత సిద్ధాంతాల ననుసరించే రాజకీయవ్యవస్థే నిర్మించబడగలదని పాకిస్తాన్ నాయకులు అంటున్నారు.

నేటి ప్రపంచం

నెహ్రూపై నింద *

ఒక అమెరికన్ విలేఖరి, రాబర్టు ఎలెన్, భారతదేశానికి మహోపకారం చేశాడు. అమెరికన్ ప్రభుత్వాధికారులు తమ ఆశయాల్ని విభ్యపుచ్చి తియ్యని మాటల్లో ఆసియాలోని దేశాల్ని ఉద్ధరించడానికే కృషిచేస్తున్నట్లు ఉపన్యాసాలిస్తున్నారు. వారి వాస్తవమనోగతిని రాబర్టు ఎలెన్ బయట పెట్టాడు. నెహ్రూపట్లనూ, భారతదేశం పట్లనూ అమెరికన్ల వాస్తవవైఖరి ఎలాఉందో తెలిపాడు ఆ విలేఖరి పండిట్ నెహ్రూని నిందించినమాట నిజమే కాని అమెరికన్ ప్రభుత్వనాయకులవలె అక్కసు లోలోన అణచుకుని, అన్యవిషయాల్లో అపకారం తలపెట్టడంకంటె ఇలా ప్రత్యక్షనిందే మేలు.

రాబర్టు ఎలెన్ చేసిన నింద ఏమిటంటే, ఆసియాదేశాల్ని ఆర్థికంగా ఉద్ధరించి కమ్యూనిజంబారినించి కాపాడాలని అమెరికా యత్నిస్తుండగా, నెహ్రూ నిరోధిస్తున్నారని తూర్పుఆసియాలో కూడా యూరప్‌లో మార్షల్ ప్రణాళికవంటిదే ఒక ప్రణాళికను అమలుజరపాలని అమెరికా చేస్తున్న యత్నాలు నెహ్రూతటస్థవిధానం వల్ల విఫలమైపోతున్నాయన్నాడు.

అటువంటిప్రణాళికను అమలుజరపాలని అమెరికన్ దేశరక్షణశాఖ, విదేశాంగశాఖ, విదేశాల ఆర్థికసహాయనిర్వాహకుడు పాల్ హాఫ్మన్ తొందరపడుతున్నారట. కాని భారతదేశం చేరకపోతే ఏ ప్రణాళికా ప్రయోజనం ఉండదు.

భారతదేశంపట్ల అమెరికాలో మైత్రి భావం సన్నగిల్లలేదని ఢిల్లీలోని అమెరికన్ రాయబారి లాయ్ హెండర్సన్ అన్నాడు. ఐక్యరాజ్యసమితిలో అన్నివిషయాల్నీ న్యాయాన్యాయాల్ని బట్టి అమెరికా నిర్ణయిస్తున్నదన్నాడు కాని కాశ్మీరసమస్య సందర్భంలో అమెరికా బ్రిటన్లు భారతదేశంపట్ల అన్యాయాన్ని కొనిగట్టాయి. చీనా, ఇండోచీనా, గ్రీస్‌దేశాలలోను, మొన్నమొన్నటివరకూ ఇండోనీషియాలోనూ తిరుగుబాటుదార్లు స్థాపించిన ప్రభుత్వాల్ని గుర్తించని అమెరికా, కాశ్మీరంలో "ఆజాద్ కాశ్మీర్ ప్రభుత్వాన్నీ," సైన్యాల్నీ షేక్ అబ్దుల్లా ప్రభుత్వంతోనూ, కాశ్మీర్ ప్రభుత్వసైన్యాలతోనూ సమానంగా పరిగణిస్తోంది ఈనాటికీ ఉభయప్రభుత్వాలమధ్యనూ సమాధానం కుదర్చడానికి బదులు, తమ రిపోర్టాన్ని రుద్దాలనే ప్రయత్నం మానలేదు. అమెరికా భారతదేశంపట్ల మైత్రీభావంతోనే ప్రవర్తిస్తున్నదని నమ్మాలని రాయబారి చెప్తున్నాడు

రాజనీతిజ్ఞులు *

ఇటువంటి మైత్రిపైన భారతదేశం ఎక్కువగా ఆధారపడలేదు తూర్పుబెంగాల్లో దురంతాల సందర్భంలో బ్రిటిష్‌ప్రభుత్వం సహాయం చెయ్యడానికి తయారయింది. తమ రాజనీతిజ్ఞుల్లో ఒక అనుభవజ్ఞుని పంపి భారతపాకిస్తాన్ ప్రభుత్వాలమధ్య సామరస్యం చేకూర్చడానికి సహాయపడ్డానికి సిద్ధమైనారు కాని ఈ రాజనీతిజ్ఞుల చేతుల్లో పడితే వ్యవహారాలు పరిష్కారం కాకపోగా, ఉభయుల్లో ఎవరికీ న్యాయం చేకూరదనేది తథ్యం. బ్రిటిష్‌వారి ఔదార్యానికి భారతప్రభుత్వం మెచ్చుకుని

మనదేశం

వారావాదాన్ని విడిచే సూచన కనిపించడం లేదు. ఇంతే కాదు. తూర్పుబెంగాల్ పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఆర్థికంగా పరస్పరం ఆధారపడి ఉండక తప్పదనే సత్యాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం గుర్తించ దలచలేదు బీహార్ పశ్చిమబెంగాల్ రాష్ట్రాలనుంచి గోధుమ, వరి, బొగ్గు, ఇనుము తూర్పుబెంగాల్‌కు అవసరం తూర్పుబెంగాల్ నుంచి నార పశ్చిమబెంగాల్‌కి అవసరం. ఆర్థికరంగంలో పాకిస్తాన్ భారతదేశంపట్ల వైరం పూని ఉన్నంతవరకూ ఉభయ బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఆర్థిక దుస్థితి అనివార్యం ఈ ఆర్థికదుస్థితికి హిందువులే కారకులైనట్లు భావించి, ఉభయత్రా వాణిజ్యం రవాణాలు స్తంభించిపోగానే కష్టాలు అనుభవించవలసివచ్చిన తూర్పుబెంగాల్ మహమ్మదీయులు అక్కడి హిందువులపైన పడి ఆస్తుల్ని దోచుకుని వారిని దారుణహింసలకు లోను చేశారు బెంగాల్లో మతసమస్య ఆర్థికసమస్యకి ఫలితమయింది. కాబట్టి ఈ విషయాన్ని చర్చిస్తేగాని బెంగాల్ రాష్ట్రాల్లో మతసమస్య పరిష్కారం కావడం అసంభవం

భారతరిపబ్లిక్‌పట్లనూ, హిందువులపట్లనూ అకారణవిరోధం వహించిన పాకిస్తాన్ ఏ ఒడంబడికల్నీ పాటించదనే అపనమ్మకం దేశంలో ప్రబలింది. అందువల్ల ఉభయప్రాంతాలనుంచీ అల్పసంఖ్యాక వర్గాలవారిని బదలాయించాలని చాలమంది కోరుతున్నారు. కాని ఇది అసంభవమని పండిట్ నెహ్రూ ప్రకటించారు అల్పసంఖ్యాకవర్గాలవారిని ఈరీతిగా బదలాయించడానికి ఉభయప్రభుత్వాలూ అంగీకరించి, పరస్పరసహకారంతో నిర్వర్తించినప్పటికీ, మార్పు పూర్తిగా జరగడానికి కనీసం అయిదేళ్లయినా పట్టుతుందన్నారు. బదలాయించడానికి మరొక పెద్ద చిక్కుంది, దేశవిభజనానంతరం కల్లోలంలో ఉభయత్రా పారిపోయిన శరణార్థుల ఆస్తిసంపదలను గురించి ఇంతవరకూ సమాధానం కుదరలేదు కుదిరే ఆశ లేదు అందువల్ల ఇప్పుడు మార్చడానికి యత్నిస్తే, శరణార్థుల ఆస్తిసంపదలసమస్యను కూడా చర్చించితీరాలి. దీనిపైన అంగీకారం కుదరడం అసంభవం కాగా, అసలు ఏవిషయంలోనూ సమాధానం కుదరకుండాపోతుంది.

అందువల్ల నెహ్రూ - లియాఖత్ ఆలీఖాన్ సమాలోచనల్లో, నారరవాణా, ప్రత్తిఅమ్మకం, పంజాబ్ కాలువనీటి వసతి పంపకం, శరణార్థుల ఆస్తిసంపదల సమస్య మొదలైన సమస్యలన్నిటిపైనా సౌమనస్యంతో రాయబారం జరపడానికి అంగీకారం కుదరకపోతే సమస్య శాశ్వతంగా పరిష్కారం కావడం అసాధ్యం

[సీతారామ్]

ఇప్పటికి "రాజనీతిజ్ఞుల" సహాయం అవసరం లేదన్నారు. అనేక వేలమంది ఇళ్లు, దేశం విడిచి పరారై భారతదేశం చేరినతరవాత, పరిస్థితులు మారి పాకిస్తాన్ మళ్ళీ దారికి రాక తప్పిందికాదు. ఉభయదేశాల్లోనూ అల్పసంఖ్యాకవర్గాలవారిని రక్షించడానికి షరతులపై అంగీకారం కుదిరి, నెహ్రూ - లియాఖత్ ఆలీఖాన్‌ల సమాలోచనలకి అవకాశం కలిగింది. బ్రిటిష్‌వారి ఔదార్యానికీ, మళ్ళా భద్రతామండలిలో తెరచాటు నాటకాలకీ అవకాశం చిక్కలేదు.

రాజ్యాధికారంకోసం పెనుగులాట *

అమెరికా ప్రదర్శించే మైత్రిని పోలిన మచ్చులు చరిత్రలో ప్రతిఘట్టంలోనూ కనిపిస్తాయి. మిత్రుల రాజనీతిజ్ఞతకు బలైన వారిలో బెల్జియంరాజు లియొపాల్డ్ ఒకడు

రెండో ప్రపంచయుద్ధంలో బెల్జియంరాజు లియొపాల్డ్ చేసిన ద్రోహంవల్ల బ్రిటిష్ సైన్యాలకు ముప్పువాటిల్లి డన్కర్క్ ద్వారా తప్పించుకుని పారిపోవలసి వచ్చిందనీ ఫ్రాన్సుపతనమయిందనీ, చర్చిల్ అన్నాడు. ఇది వాస్తవం కాదని కొందరి వాదన. బెల్జియంలో బెల్జియన్ సైన్యాలు, ఫ్రాన్సు సరిహద్దులో ఉత్తరాన సముద్రతీరంవరకూ బ్రిటిష్ సైన్యం దక్షిణంగా ఫ్రెంచి సైన్యం నిలిచి పోరాడుతున్న సమయంలో, బెల్జియం ప్రవేశించిన హిట్లర్ సైన్యాల్ని ఎలా ఎదిరించాలనే సమస్యపైన సైనికాధికారులమధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. బెల్జియంవద్ద ఉత్తరాన ఎదిర్చిపోరాడాలని సూచించిన జనరల్ గమెలిన్ సర్వసైన్యాధికారిపదవినుంచి తొలగించబడ్డాడు దక్షిణాన నిలిచి పశ్చిమంగా వెడుతున్న జర్మన్ సైన్యాల పైకి ప్రక్కనుంచిదాడిచెయ్యాలనీ, వీలైతే చుట్టుముట్టాలనీ సూచించిన జనరల్ వైగాండ్ సర్వసైన్యాధిపతిగా నియమితుడైనాడు. ఈ రీతిగా చేస్తే ఉత్తరాన జర్మన్ సైన్యాల్ని బెల్జియన్ సైన్యాలే ఎదిరించవలసి ఉంటుందనీ, దీనివల్ల ఆ సైన్యం నాశనమైపోతుందనీ లియొపాల్డురాజు అన్నాడు. అతని మాట నెవరూ పాటించలేదు. వైగాండ్ సైన్యం జర్మన్ సైన్యాల్ని ఎదిరించలేకపోయినాయి. బ్రిటిష్ సైన్యం అటు బెల్జియన్లకీ ఇటు ఫ్రెంచివారికి కూడా తెలియకుండా ఏరాస్‌నుంచి పారిపోయింది. తన సైన్యాలెలాగూ నాజీలధాటికి నిలవలేవని గ్రహించి వానిని నాశనం కాకుండా కాపాడుకోడానికిగాను లియొపాల్డ్ రాజు హిట్లర్‌తో సంధిచేసుకున్నాడు అలాకాక లియొపాల్డ్ రాజు అంతకుముందే రహస్యంగా హిట్లర్‌తో సమాలోచనలు జరుపుతున్నట్లు తెలిసి బ్రిటిష్ సైన్యం పారిపోయిందని చర్చిల్ అన్నాడు.

మొత్తానికి లియొపాల్డ్ రాజు ద్రోహం చేసి హిట్లర్‌తో చేరాడని లోకం అంతా నిందించింది బెల్జియంలో సోషలిస్టులు, లిబరల్ పార్టీవారు కూడా అదేరీతిగా భావిస్తున్నారు. దీనికి ముఖ్యకారణం బెల్జియంపతనం అనంతరం లియొపాల్డ్ హిట్లర్‌తో సఖ్యతగా ఉండడమే. ఆరోజుల్లో ఒక సామాన్యస్త్రీని లియొపాల్డ్ వివాహం చేసుకున్నాడు. వివాహం ఆస్ట్రియాలో జరిగింది

బెల్జియం తిరిగి నాజీల అధీనంనుంచి బయటపడగానే 1945 లో బెల్జియన్ పార్లమెంటు సమావేశమైనప్పుడు లియొపాల్డ్‌ను దేశానికి రాజుగా రానివ్వరాదని శాసనం చేసింది.

ఆ పైన 1949 లో తిరిగి ఎన్నికలు జరిగాయి లియోపాల్డురాజును తిరిగి తీసుకురావడానికి సుముఖంగా ఉన్న కాథలిక్ పార్టీకి మెజారిటీరాలేదు లిబరల్స్‌తో కలిసి వారు మిశ్రమప్రభుత్వం స్థాపించారు లియొపాల్డును రాజుగా రానివ్వాలా వద్దా అనే విషయమై ప్రజల అభిప్రాయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది

జనవాక్యనిర్ధారణ మార్చి 12 వ తేదీని జరిగింది ఫ్లెమిష్‌భాషా ప్రాంతమైన ఫాండర్స్‌లో నూరింట 72 వంతుల మంది లియొపాల్డు తిరిగిరావాలని వోటుచేశారు. ఫ్రెంచి భాషాప్రాంతమైన వెలోనియాలో నూరింట 58 వంతులు, ఉభయభాషాప్రాంతమైన బ్రసెల్స్‌లో నూరింట 52 వంతులు ప్రతికూలంగా వోటుచేశారు. మొత్తంలో నూరింట 57.6 వంతులు సుముఖంగా ఉన్నారని తేలింది. కాని దీనివల్ల ఎటువంటి నిర్ణయం చేసేదీ పార్లమెంటుపైన ఆధారపడివుంటుంది మొత్తంలో మెజారిటీవస్తే చాలని లియొపాల్డుకు సుముఖులైన కాథలిక్ పార్టీవారన్నారు. కాని విడివిడిగా మూడు ప్రాంతాల్లోనూ అధికసంఖ్యాకులు సుముఖులుగా లేరు కాబట్టి లియొపాల్డు రాకూడదని లిబరల్ పార్టీవారు, సోషలిస్టులు వాదిస్తున్నారు. యుద్ధసమయంలో బెల్జియంరాజు ఫ్రెంచివారికి అన్యాయం చేశాడనే అభిప్రాయంతో ఫ్రెంచి భాషాప్రాంతంలోనివారు లియొపాల్డుపట్ల విరోధం వహించారు. ఈ రాజకీయాల్లో ఫ్రెంచిప్రభుత్వం ప్రమేయం లేకపోలేదు.

ఈ విషయాన్ని నిర్ధారణచెయ్యడానికి పార్లమెంటులోని రెండు సభలూ సంయుక్త సమావేశం జరపాలని కాథలిక్కులంటున్నారు. సంయుక్తసమావేశం జరిపితే మొత్తంలో కాథలిక్ సభ్యుల సంఖ్య అధికం. కాని విడివిడిగా నిర్ణయం చెయ్యవలసివస్తే ఒక సభలో వారికి మెజారిటీ లేనందువల్ల రెండు విరుద్ధనిర్ణయాలు రాగలవు సంయుక్తసమావేశం జరపకూడదని లిబరల్స్ వాదం

ఈ విషయమై ఏకాభిప్రాయం కుదరనందువల్ల కాథలిక్ - లిబరల్ మిశ్రమ ప్రభుత్వం కూలిపోయింది. లిబరల్ మంత్రులు రాజీనామా నిచ్చారు సోషలిస్టులతో చేరడం లిబరల్స్‌కి ఇష్టంలేదు. అందువల్ల ఇంతవరకూ ఏ పార్టీ ప్రభుత్వాన్ని నిర్మించలేకపోయింది.

ఎలాగైనా సమాధానం కుదర్చాలని యత్నం జరుగుతోంది లియొపాల్డురాజు సింహాసనం అధిష్ఠించిన పదిహేనురోజుల్లో స్వయంగా రాజరికంనుంచి విరమించడానికి అంగీకరించినట్లయితే, ఆ షరతుపైన లియొపాల్డు తిరిగిరావడానికి అంగీకరించగలరని లిబరల్స్ చెప్తున్నారు. కాథలిక్ నాయకుడు ప్రభుత్వాన్ని నిర్మించలేకపోయినందువల్ల, లిబరల్ నాయకుని ఈపనికి రీజెంట్ ప్రిన్స్‌ఛార్లెస్ నియోగించాడు. కాని ఆపార్టీ నాయకుడు కూడా ఇంతవరకూ నిర్మించలేకపోయినాడు. పైషరతుకి లియొపాల్డు అంగీకరించలేదు. అంగీకారం కుదరని పక్షంలో పార్లమెంట్ రద్దవుతుందనీ, తిరిగి ఎన్నికలు జరపవలసివస్తుందని లిబరల్ నాయకుడన్నాడు

లియొపాల్డురాజు తిరిగిరాకూడదనే తుది నిర్ణయం జరిగితే, 19 ఏళ్ళ అతని కుమారుడు ప్రిన్స్ బోడాయిన్ రాజవుతాడు.

[సూర్యనారాయణ]

కాంగ్రెసు-కమ్యూనిస్టులు

శ్రీ సహజానందం

తెలుగుజిల్లాల్లో మళ్లీ కమ్యూనిస్టుల దౌర్జన్యం అక్కడక్కడ హెచ్చుస్థాయిలో తలెత్తుతోంది. ప్రకాశం ప్రభుత్వం రోజుల్లో ఆరంభమైన ఈ కమ్యూనిస్టుల హింసాకాండ, ఇంకా ఇప్పటికీ రెండు ప్రభుత్వాలు మారినా సాంతం నిర్మూలం కాలేదు. 'పోలీసు చర్య'కు మునుపు హైదరాబాదుసంస్థానంలో కమ్యూనిస్టులు బలపడ్డారు ముఖ్యంగా తెలంగాణా వారికి ముఖ్యస్థానమైంది. మనరాష్ట్రపు సరిహద్దులు తెలంగాణాకు అనుకొని ఉండటంతో, ఆ సరిహద్దుప్రాంతాల్లో వారు వ్యూహాలుపన్ని, విధ్వంసక, ఘాతుకచర్యలను చేయగలగటానికి వీలవుతోంది

బొంబాయి, బెంగాలు, మద్రాసు రాష్ట్రాల్లో కమ్యూనిస్టులకు బలగం హెచ్చు. బొంబాయినగరం పార్టీ కేంద్ర ఆఫీసు స్థానం అగ్రనాయకులంతా ఎక్కువగా ఆ ప్రాంతంలోనే ఉండేది. అయినా బొంబాయిప్రభుత్వం కమ్యూనిస్టుల దౌర్జన్య ఉద్యమాలను త్వరలోనే అరికట్ట గలిగారు. బొంబాయిరాష్ట్రం రణదీవు స్వస్థలం అయినా, అతని తీవ్రకార్యక్రమానికి బొంబాయిలో అవకాశాలు లేకపోయినయ్. ఇంక బెంగాలు, మద్రాసురాష్ట్రాల్లో పరిస్థితి బొంబాయికంటె భిన్నంగా ఉంది ఈ రెండు రాష్ట్రాల్లో ఇంకా కమ్యూనిస్టులు దాడులు, దోపిడీలు, హత్యలు చేస్తూనే ఉన్నారు. ఈ రెంటిలోనూ బెంగాలు కంటె మనరాష్ట్రం నాడెం

ఈ మూడురాష్ట్రాల్లోనూ ఉన్నవి కాంగ్రెసు ప్రభుత్వాలే. అయినప్పటికీ పరిస్థితిలో ఈ భేదాలకు కారణమేమిటి? బొంబాయిలోకంటె, బెంగాలు, మద్రాసు ప్రాంతాల్లో కమ్యూనిస్టులకు ఆయుధాలు ఎక్కువగా దొరకే సదుపాయాలు ఉన్నాయనేమాట నిజం. కాని ఇదే ముఖ్యకారణం కాదు. ప్రభుత్వస్థిరత్వంమీదకూడా ఆధారపడి ఉంటయ్. ఆ ఆ ప్రాంతాల్లో శాంతిభద్రతలు. ప్రభుత్వాలు స్థిరంగా ఉంటేనే పోలీసుశాఖ సుశిక్షితంగా, నిర్దుష్టంగా పని చేయగలుగుతుంది. ప్రభుత్వాల అస్థిరత్వం మూలంగా ప్రజల్లో ప్రభుత్వాలంటె క్రమేపి శ్రద్ధాభక్తులు తప్పకుండా క్షీణిస్తయ్. తత్ఫలితంగా పోలీసుల్లోనూ, ప్రభుత్వాలయెడ చూపించవలసిన విధేయత కుంటుపడుతుంది. ఉదాహరణకు ఫ్రాంసుదేశాన్ని తీసుకోవచ్చు ఏర్పడే ప్రభుత్వం ఎన్నాళ్లుంటుందో అక్కడ ఎవరూ చెప్పలేరు. అందువలనే ఆ దేశపరిస్థితులు ఏమీ బాగా లేవు. అంతకంటె అధ్వాన్నంగా ఉన్నయ్ బెంగాలు, మద్రాసురాష్ట్రాల పరిస్థితులు. ఫ్రాంసుకు, మన రాష్ట్రాలకు తేడా ఒకటి ఉంది. అక్కడ కొన్ని పార్టీలుకలసి ప్రభుత్వాన్ని స్థాపించటం, వాటిలో ఒకటి చీలిపోవటం, మళ్లీ కొత్త మిశ్రమప్రభుత్వం ఏర్పడటం జరుగుతూఉంటుంది. అంటే పార్టీలు మారుతూఉంటయ్. కాని మన రాష్ట్రాల్లో అలా కాదు ఒక పార్టీలోనే మార్పులు జరుగుతున్నయ్. ఒకే పార్టీకి చెందినవారే ఒకరిపై ఒకరు కత్తికట్టి, ఒకరు పార్టీనాయకుడుగా ఏర్పరచే మంత్రివర్గాన్ని మరొకరు కూలద్రోయటం మన కాంగ్రెసు పార్టీకి అనువాయితీగా ఉంటోంది. ప్రపంచంలో ఈ విషయంలో మన కాంగ్రెసుకు ఎవరూ సాటి లేరు.

ఇలా ఒకే పార్టీప్రభుత్వాలే ఏర్పడుతూ, పతన మవుతూఉండటంతో, శాసనసభా, సభ్యుల్లోని అంతఃకలహాలు, పరస్పర ద్వేషాలు దేశంలో ప్రజల్లోకి కూడా వ్యాపించి, ప్రజల్లో పార్టీనిర్మాణం ఐక్యత కోల్పోయి, విచ్ఛిన్నం అవుతోంది ప్రధానమైన కాంగ్రెసుపార్టీయే, ప్రభుత్వపార్టీయే ఇలా విచ్ఛిన్నమవటం, అరాచకశక్తులకు చాలా వీలు. చీలికలు లేకుండా ఉండే కాంగ్రెసును ప్రతిఘటించటం వేరు చీలికలైన కాంగ్రెసును ప్రతిఘటించటం వేరు. కాంగ్రెసువారు తమలో తామే కొట్టుకొని సతమత మవుతున్నప్పుడు, కమ్యూనిస్టుఅరాచకానికి ఇక అవరోధమేముంది? అడ్డుకొని, అరికట్టగలిగిన కాంగ్రెసుపార్టీ అంతఃకలహాలతో క్షీణిస్తుంటే, కమ్యూనిస్టులకు అడ్డెవరు? కాబట్టే వారి స్వైరవిహారానికి మంచి అదును లభించింది. పోలీసు లున్నారుగదా అనవచ్చు. ఇప్పటికంటే పోలీసులు ఇంకెక్కువ శ్రద్ధగా పనిచేసినా కాంగ్రెసుఅంతఃకలహాలమూలంగా ప్రజల్లో కలిగిన నిర్లిప్తత తొలగనంతవరకు అరాచకశక్తులను సక్రమకగా నిర్మూలించటం దుస్సాధ్యం.

కాంగ్రెసుతరఫున సేవాదళం ఉంది, కమ్యూనిస్టులను హతమార్చటానికి అని అంటే అనవచ్చు. కాని ఈ అద్భుతమైన సేవాదళం గురించి ఎంత తక్కువ తర్కిస్తే అంత మంచిది. అసలు ఈ సేవాధళంలోని కొంతమందిచర్యలబట్టి కూడా రాష్ట్రంలో హింసావాతావరణం మరింత ప్రబలుతోంది అనికూడా కొంతమంది విమర్శకుల అనుమానం. కాంగ్రెసువారిలా అనవచ్చు. 'మాది గృహకల్లోలం కాని ఇతరపార్టీలను, అరాచకశక్తులను ఎదుర్కోటంలో ఈ గృహకల్లోలం అడ్డురాదు. ఒకే తాటిమీద నడుస్తాం.' అని. కాని పల్లెల పరిస్థితులు తెలిసినవాడెవడూ ఈ కాంగ్రెసువారి వాదనకు ఒప్పుకోడు. ఎందుకంటే, కమ్యూనిస్టులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో కాంగ్రెసువారిఅంతఃకలహాలు గ్రామగ్రామాన సందుచేసుకొని, తలెత్తుతూనేఉన్నయ్.

పోలీసులకు, మలబారుస్పెషల్ పోలీసుకు ప్రతిగ్రామంలోనూ కమ్యూనిస్టు లెవరో తెలియటం కష్టం. ఈ సందర్భంలో ప్రభుత్వపు సి. ఐ. డి శాఖ తగినంత శ్రద్ధగా, చురుగ్గా పనిచేయట్లేదని చెప్పాలి. బ్రిటిషువారి హయాములో పనిచేసినట్టు, ఇప్పుడు పనిచేయట్లేదు. ఉదాహరణకు ఒక విషయం. గడచిన ఆగస్టు 15 తేదీన కమ్యూనిస్టులు

(38-వ పేజీ చూడుడు)

కథానిక:

రేడియో పోటీ

శ్రీ గొల్లమూడి లక్ష్మీనారాయణ

నాగలి వీరయ్య, చాలా సూరయ్యలలో ఒక్కయింటిపేరు, పేర్లల్లోనే కాదు; పోలికల్లోను, గుణాల్లోను ఎంతో సామ్యముంది. నలుపు ఆనటానికి వీల్లేని ఎఱుపు చాయ, పొట్టికాని పొడుగు, పంపరపనసకాయ అంత పొట్ట, కొసలు ఎంత మెలివేసినా నిమ్మకాయలు నిలపెట్టలేని బుఱ్ఱమీసాలు – ఇల్లాంటి పోలికల్లో, వాళ్లిద్దరిలో ఫలానా అని గుర్తించటానికి వీల్లేదు. ఇంకా వాళ్ళ జీవితానుభవాల్లో చాలా పోలికలున్నై. ఇద్దరూ నలభయోపడిలోపడి, ఏ బాదరబందీ లేకుండా సుఖంగా కాలం వెళ్లదోస్తున్నారు. ఇద్దరికీ భార్యలు చనిపోయి పుష్కరం కావస్తోంది. వీరయ్య కొడుకు తాలూకాఫీసులో గుమాస్తాగా చేరి, సంవత్సరం తిరిగేసరికల్లా, తాసీల్దారు కుర్చీలో కూర్చున్నాడు సూరయ్యకొడుకు పొగాకువ్యాపారంలో బస్తీలో భవనమొకటి కట్టించాడు తమకున్న దాదాపు వందయకరాల భూమిని, వీరయ్య సూరయ్యలు జీతగాళ్ళను పెట్టి సాగు చేయించుకుంటున్నారు. వాళ్లిద్దరి యిళ్లూ ఒక్కవీధిలోనే, కొద్దిమారంలో ఎదురెదురుగా వున్నై.



ఇద్దరికీ ఇంతగా అవినాభావసంబంధం వున్నప్పటికీ – అసలు ఇన్నిగుణగుణాలు ఇద్దరికీ సమానంగా వుండబట్టేనేమో; జన్మవిరోధ మనుకునేటంతగా వాళ్లు పోటీలు పెంచుకున్నారు.

వీరయ్య మట్టిఅరుగులు తీసివేసి, బండఅరుగులు కట్టించితే; సూరయ్య సిమెంటుతో నున్నగా అరుగులు కట్టించి, ఏనుగు తొండాలు పెట్టించాడు. వీరయ్య పెంకుటిల్లు ముందుభాగం వూడదీసి, డాబావేసి, పైన రెండుగది కట్టిస్తే; సూరయ్య 'అబ్బే, రెండుగదులు నా తాతలనాటి ఫ్యాషను కాదటయ్యా!' అని వూళ్ళో ప్రముఖులతో వ్యాఖ్యానించి త్రిభుజాకారంగా మేడమీద గది ఒకటి కట్టించాడు (అసలు సూరయ్యయింటిస్థలమే త్రిభుజా కారంగా వుంది, పాపం!) పందేలకని – సూరయ్య పుంజులని పెంచితే, వీరయ్య కోడెదూడలను పెంచుతుంటాడు.

ఊళ్ళో రిపబ్లిక్ వుత్సవాలకని హంగామా చేస్తున్నారు, వూరి పెద్దలు. మూడువందల గడపదాకా వుందా వూళ్లో. చుట్టుపక్కల పది వూళ్లకీ తలమానికంగా వుందని పోలీసు స్టేషనొకటిపెట్టారు. పెద్ద ఆసాములే పదిమందికిపైగా వున్నారు. వాళ్లల్లో సూరయ్య వీరయ్యలు చెప్పుకోదగ్గవారే.

ఉత్సవం హుందాగా జరిపే ప్రయ

తాన్లల్లో పెద్దల సమావేశ మొకటి జరిగింది. సూరయ్య వీరయ్యలు విడివిడిగా సమావేశానికి హాజరయ్యారు ఇల్లాంటి సమావేశాల్లో తల యిరికిస్తే, నెత్తిన కొంత బాధ్యత పడుతుందనీ, జేబుల్లోంచి కొంత డబ్బు జారుతుందనీ తెలియకపోదు. అయితే సంసారపు చిక్కులేమీ లేక, ఏ యేడుకాయేడు మూలిగే డబ్బుకు మరికొంత డబ్బు జేర్తుంటే, ఏం జేయాలో ఆలోచించటానికి కొంతకాలం ఉక్కిరి బిక్కిరిఅవుతుండే టటువంటివాళ్లు; వూళ్లో కొంత పలుకుబడి, అందుమూలంగా నాయకులయ్యే అవకాశాలు కళ్లకెదురుగా కనిపిస్తూంటే, ఒక్క డబ్బుమాటనే కావలించుకుకూర్చునేటంత మూర్ఖులు కారు వాళ్లు అదీగాక, వాళ్లిద్దరిలో ఎవళ్లకు వాళ్లు, తను ఒకవేళ్ల ఇల్లాంటివాటిలో జోక్యం పుచ్చుకోకపోయినా, రెండోవాడు కల్పించుకుని తనకన్నా ఎక్కువగా పలుకుబడి సంపాదిస్తే, చేతులు కాలాక ఆకులు పట్టుకోవాల్సి వస్తుందని ముందుగానే సంగ్రత్తపడేవారు

ఉత్సవం వైభవంగా జరిగేందుకు రేడియో ఒకటి కావల్సివచ్చింది 'ఆ రోజుకుగాను ఎవరైనా తమ రేడియో సెట్‌గు ఇస్తారా?' అని ఒక ప్రముఖసభ్యుడు హెచ్చరించాడు కొంతమంది ఇవ్వటానికిఅంగీకారం చూపుతూ చేతులెత్తారు. కాని మొట్టమొదటగా నోరు తెరచి మాట్లాడింది వీరయ్యే!

'యుద్ధం పూర్వంరోజుల్లోనే, అంటే చూశారూ, ఆ మంచి రోజుల్లోనే కొన్న రేడియో మా యింట్లో వుంది. అది అప్పట్నుంచీ ఏమాత్రం రిపేరు అంటూ లేకుండా పనిచేస్తున్నది! చూశారూ, —ఆ కాలం వేరు, ఆ వస్తువులు వేరు చాలా పెద్దగా వినిపిస్తుంది. ఈ వూరివారు చాలామంది వినే వుంటారు.' అని తన రేడియోను సభ్యులకు ఎఱుక చేశాడు

సూరయ్య రెండుఆకులు ఎక్కువేకాని, తక్కువ చదువలేదు. 'నేను కొత్తగా మొన్నీమధ్యే రేడియోఒకటి కొన్నాను. అయితే, మీలో ఎవ్వరున్నూ వినివుండకపోవచ్చు దాని దేముంది! - ఎంచేలంటే, చెవులు కోసిన నక్కలాగు దానిచేత రాత్రింబవళ్లు అరపించి, దానినోరు చెడగొట్టి, మీ చెవులు దిబ్బళ్లువేయించటం, నాకు బొత్తిగా యిష్టంలేదు సుమాండి! కాని, గమనించారూ, రిపబ్లిక్‌వుత్సవాలకని లిప్పకుండా ప్రత్యేకంగా అల్లాంటి చెప్పడూ వుపయోగించని రేడియోనే వుపయోగించటం సబబు ప్లాస్టిక్ కేస్‌మీద ఆపిల్‌పండు, నీలిమందురంగులు - చూడటానిక్కూడా చాలా ముచ్చటగా వుంటుందిలెండి!' అని తన రేడియోను సూరయ్య సభ్యులకు పరిచయం చేశాడు.

రేడియోవిషయం మొదట హెచ్చరించిన పెద్దమనిషికి గుండెమీది బరువు కాస్తా తగ్గిపోయింది - సూరయ్య వీరయ్యలు పోటీయుద్ధం వుపక్రమించేసరికి కాని కొత్త బెడద ఒకటి వచ్చిపడింది, ఈ పోటీయుద్ధం సద్దాలా అని. మిగతా సభ్యులంతా ఈ పోటీ ఎలా పరిణమిస్తుందో నని కౌతుకంతో ముఖావంగా గమనిస్తున్నారు.

వీరయ్య మళ్లా చెప్పాడు. 'నా రేడియోను నేనే మెచ్చుకోవటం కొంతమందికిలాగా నాకు చేతకానూ కాదు, అసలు కిట్టనూ కిట్టదు నా రేడియోను రిపబ్లిక్‌వుత్సవానికి వుపయోగించినందువల్ల నా రేడియో ధన్యమూ అవుతుంది, వూరిప్రజలూ-ఇన్నాళ్ళూ వీనుల విందుగా విని సంతోషించినట్లే, ఆరోజూ విని సంతోషిస్తారు. ఇంతకుమించి నేను చెప్పేదేముంది, చెప్పండి?' అని కందగడ్డలా అయిన ముఖంతో మూతి ముడుచుకు కూర్చున్నాడు.

సూరయ్య అందుకున్నాడు 'నేను మళ్లా, మళ్లా చెప్పేదేమీ లేదు నా రేడియోకు వీరియల్' అంటూ వేరే హంగామా ఏదీ చేయనక్కర్లేదు. చూడటానికా ముద్దొస్తూంటుంది. చక్కగానూ వినపడ్తుంది అయినా గమనించారూ, మాటసందర్భం వచ్చింది కాబట్టి బాగుండదని నా రేడియో అంటూ వున్నదని, ఇవ్వటానిక్కి అభ్యంతరమేమీ లేదని చెప్పా కాని; ఇదేమీ ప్రాధేయపడవలసిన విషయం కాదు. పెద్దలంతా మీరే నిశ్చయించండి! మంచిచెడ్డలు మీకు తెలియకపోతాయా?' అని చేతులు వణుకుతూంటే, అరచేతుల్లకి పట్టినచెమట వుత్తరీయానికి తుడుస్తూ ముగించాడు

ఆకుల గలగలలా కాసేపటవరకూ గుసగుసలు సాగినై. ఏమి చెప్తే ఏమి మునుగుతుందో నని అందోళనచెందుతున్నారు. అంతలో మొదట రేడియోవిషయం హెచ్చరించినాయనే, 'దానిదేముందిలెండి, మీరిద్దరూ యివ్వండి! మీ వుత్సాహాం మే మెలా కాదంటాం? ఎటువంటి ఎధవ శబ్దం లేకుండా ఏది చక్కగా వినిపిస్తుందో, దాన్నే వాడుకుందాం. ఏమంటారు?' అని దోషిని నిర్దోషిగా భావించుతున్నట్లు నటించి తీర్పు చెప్పే న్యాయాధిపతిలా, చెప్పాడు.

సరే, మిగతా విషయాలన్నీ చర్చించుకున్నాక సమావేశం ముగిసింది.

పొగాకుకాడ కొనటానికని, వీరయ్య దోవలో బీడీదుకాణందగ్గిర ఆగాడు. నిజానికి ఇంట్లో కావల్సినంత పొగాకు వున్నా, సూరయ్యతోపాటు కలిసి నడవాల్సిన అవస్థ తప్పించుకునేందుకుగాను, ఈ ఖర్చుకి అంగీకరించాడు.

ఇంటికెళ్లినవెంటనే, వీరయ్య, స్నానం తిండీ, సంగతి అట్లా వుంచి, తన పాతరేడియోని తీసి ఇస్త్రీతువ్వాలుతో ఒకటేపనిగ తుడిచాడు.

ఆ మర్నాటి సాయంకాలం సూరయ్య తన అరుగుమీద కాసేపు కూర్చుని కాలక్షేపం చేసి, సంజచీకటి పడటంతో ఇంట్లోకి పోతూ, ఒకపాదం గడపఅవతల పెట్టి, అలవాటుప్రకారం వీరయ్యయింటివంక దృష్టి సారించాడు. ఆ వీధిలోనే అటునుంచి మలుపు తిరిగాక రెండోయిల్లే వీరయ్యది. మట్టూ ఎత్తులేని ప్రహరిగోడ, వాకిట అరు

(33-వ పేజీ చూడుడు)



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౨౫

అర్ధరాత్రము దాటి యైదు గడియ లైనది. మూడవయామము ప్రవేశించిన దని యామికులు డింకను నగరమున ప్రచురించుచు తిరుగ నారంభించుటకు లేక పున్నది. ఓరుగంటి పురజను లందరును గాఢనిద్రాముద్రలై యుండిరి.

ఆ సమయమున మున్నెన్నడును నా నగరవాసులు వినియెరుగని యొక శబ్ద మానాడు నగరమున వినవచ్చెను. ఆ నగరవాసులు శతాధికములగు వాదవిశేషముల నెరుగుదురు. కాని ఇది వారెరిగిన యే వాద్యశబ్దమును గాదు. ఇనుపకడియములు ఇనుపగంటలు తగిలించి యున్న యినుపబద్దలు కలిపి యూడించుటచే ఆ కడియములు గంటలు ఆ బద్దలకు తగిలి పుట్టెడు నొక వింత శబ్దము! ఆ శబ్దములో నాదము లేదు నిండుదనము లేదు అది కేవలము ఒక చప్పిడి చప్పుడు! చెవులలో కఠోరముగా ప్రవేశించి ఏవ కలిగించు ధ్వని! అట్టి చప్పుడు చేయగల సాధనమును ఎవరో గాయకమహాశత్రువు కనిపెట్టి యుండును. ఆ చప్పుడీనాడు నిశ్శబ్దముగా నున్న యానగరమున మొదటిసారి వినవచ్చినది ఆ ధ్వని చాలదో యన్నట్లు మధ్య మధ్య చెల్లుచున్న మరియొక సాధనమును గిరగిర త్రిప్పుచుండగా పుట్టెడి కరకరశబ్దము దానికి తోడగుచుండెను!

అది భయంకరమైన శబ్దము కాదు. గంభీరమైనది కాదు. శ్రావ్యమైనది కానే కాదు. అది యొక చవటశబ్దము. వట్టి చప్పిడి మోత! అర్థసౌష్ఠవము గాని శబ్దగాంభీర్యము గాని ఔచితి గాని లయగాని లేని వచనరచనవలెనే పేలవమైనది దాని పేలవగుణమే ఒక్కసారిగా నా నగరమున గల యశేషజనులను ఆ అపరరాత్రవేళ మేలుకొలిపినది. అది ఎంత పేలవమైనను చౌకకవుల కవిత్వమువలె నిరంతరముగా వచ్చుచున్న దా శబ్దము! ఆ శబ్దమట్లు ఎడతెగక చెవులలో చొచ్చుచుండుటచే ఊపిరి సలుపనిచ్చుట లేదు. అది వినవలెనని యెవ్వరికి నిచ్చ లేదు. కాని దాని నెవ్వరును వినకుండ నుండలేరు. వినకుండ నుండదలచినకొలదియు నది బలవంతముగా వీనుల జొచ్చుచుండెను. నిదురపోవలచినవారిని నిదురపోనీయ గద ఆ శబ్ద మట్టిది! నిదురించువారిని లేపును, లేచినవారిని మరి నిదురపోనీయదు. మరి యే యన్యశబ్దమును లేని సమయము నగుటచే ఏకశిలానగరప్రాకారమధ్యభాగమంతటిని ఆ శబ్దమే బలవంతముగా నాక్రమించుకొనెను. అందులో మధ్యమధ్య వచ్చు నా కిరకిరశబ్దము ప్రాణులను కొరుకుచున్న రాక్షసుని దంతములు చేయు శబ్దమునే తలపించుచుండెను. సర్వము నా యపశబ్దము! ఈ వేళ ఇనుపగజ్జెలతిల్లి ఎక్కడనుండి వచ్చెనో ఏకశిలానగరములోనికి!

ఆ శబ్దముతోపాటు ఆ శబ్దముకంటె కఠోరమైన కంఠ మొకటి మధ్య వినిపించును. ఆ యపశబ్దము ఒక్క శ్రుతిలో నైన ప్రయోగ. ఏ క్షణమున కా క్షణము శ్రుతి మారుచుండును. మరి యా కంఠమో! ఆ ఇనుపప్రమాణములోని యపశ్రుతిభేదములనైనను అనుగమింపజాలని కంఠము! కంఠమును ఆ వాదనమును పరస్పరశత్రువులగు సేనానులిద్దరు ఒకసేనలోని భటులను నడపుచున్నట్లే యుండెను.

ఆ రెండిటికి తోడుగా నా రెండిటితోగూడ కలియక తనతో తానుగూడ కలియక ఏ క్షణమున కా క్షణము స్వతంత్రమై విజృంభించు అతినూతనమగు పాటకూడ ఒకటి సాగెను.

“అల్లా చల్లా చూపు తల్లీ పిల్లలు మీరు పరిధిల్లావలె చల్లాగా ఇల్లలక్కల్లీ పిల్లా మీకు చల్లాగా గిరిల్లల్లా ఇల్లా అల్లా ఎల్లాకాలము మీకు కల్లీ పిల్లా పరిధిల్లీ అల్లా మళ్ళీ మళ్ళీ తల్లీ పిల్లా ఇల్లా—!”

ఈ సరిక్రొత్తపాట ఆ అపస్వరుని నోటికి వచ్చినట్లెల్ల వరిల్లిపోవుచుండెను. ఆ మాటల కూర్పునకు స్పష్టమైన యర్థము లేదు. ఆ పాటలోని మాటలుమాత్రము మంచి వనిపించును. కాని యా మాటల మంచితనమే పాట కొక దుష్టార్థము కల్పించుచుండెను. ఆ కంఠమును ఆ యపశబ్దమును నిశాచరులు తిరుగు నా యపరరాత్రసమయమును ఒకచో కూడకున్నచో నా పాటలోని మాటలకా విపరీతార్థము స్ఫురింపదేమో!

ఆ శబ్దమును పాటయు ముందు ఓరుగంటి పశ్చిమోత్తరదిశను పుట్టినవి. వాయవ్యమునుండి యవి అట్లట్లు తిరిగి ఉత్తరపు దిక్కునకు వచ్చినవి. మధ్యమధ్య నవి యాగును. మరల ప్రారంభించును. ఆ శబ్దము ఒక దిక్కుగా పోవుట లేదు. ముందు వెనుకలకు పోవును, వచ్చును ప్రక్కలకు జరుగును. ఇటు పోవును అటు వచ్చును. కాని మొత్తముమీద వాయవ్యమునుండి ఉత్తరమునకు, ఉత్తరమునుండి తూర్పునకు, తూర్పునుండి దక్షిణమునకు, అక్కడనుండి పశ్చిమమునకు —తుదకు అది పుట్టిన వాయవ్యమునకు పోయి యక్కడనే తెల్లవారకముందే అణగిపోయినది అది నిశాచరుడగు నొక వైరాగి భైక్షుకచాలనము!

ఆ శబ్దము వాయవ్యమున సముద్గత మైనవెంటనే తన యింటిలో నిదురపోవుచున్న గండనికి మెలకువ వచ్చినది పట్టణమున నెవ్వరికి నిద్దుర ట్టనిది అతని కసలు పట్టునా? అతడు త్రుళ్లిపడియే నిద్ర మేల్కాంచెను అది కొంగనే పాత డాలకించెన మధ్యమధ్య నాగుట ఇటునటు పోవుట అతనికి అనుమానము కలిగించెను క్షణ క్షణము నాతని యనుమానము పెరిగిపోసాగినది తుద కది యాతడు పట్టలేకపోయెన

గండడు శయ్యనండి లేచెను ధట్టి బిగించెను ఒరలో చుర కత్తి సరిచేసికొనెను చేతిలో చిక్కని దండ మొకటి ధరించెను రొమ్ముకు తగను శిరస్సుకు శిరస్త్రాణమును తగల్చుకొనెను తనపై నల్లని యంగీ యొకటి కప్పుకొని బయలుదేరెను

ఈ ప్రయత్నము లన్నియు జూచుచున్న యాతని భార్య ఏమియు మాటాడలేదు అతనికి పెద్ద యుద్యోగ మైనప్పటినుండియు నాతని చర్య లన్నియు దానికి వింతగానే ఉండుచున్నవి పూర్వము తన ప్రతాపము ప్రగల్భముగా చెప్పుకొనుచుండువాడు ఒక్కొక్కతరి దానికి వినుటకు వినుగుపుట్టినను తన మల్లయుద్ధ విశేషములు వర్ణించుచునేయుండెను అతని దేహమున గలిగిన దెబ్బలకు ఉపచారముచేయులే గాని మల్లక్రీడ దాని కేమి పట్టును? ఈ యుద్యోగ మైనప్పటినుండి యాతని వాక్కు కట్టవడినది వెనుకటి కంటె నిప్పు డెక్కువసేపు తన పనిపై సంచరించును ఇంటికి వచ్చినపిమ్మట ఇరటి విషయములే కాని బయటి విషయములు మాటాడడు పరిపరివిధముల నది భర్తనుగూర్చి సందేహించెను కాని ఏమియు నడుగ సాహసింపదు ఎదురు చెప్పదు ముగ్ధ మగు ముఖముతో ముగ్ధ మగు చూపులతో నాతని ప్రశ్నించును ఆతడు ప్రత్యుత్తర మీయడు ఈ యపరరాత్రి వేళ నాతడు చేయుచున్న సన్నాహము గమనించి యది యన్లే చూపులనోడనే ప్రశ్నించెను అందుకు గండడు తలుపు వేసికొను మని చెప్పుటే కాని మరుమాటాడక బయలుదేరెను

వీధిలోనికి వచ్చి ఆ శబ్దము వచ్చుచున్న దిక్కెదో ఆలకించెను అది నిరక్షించి వెంటనే అటువైపు కాతడు నిశ్శబ్దముగా కదలెను ఒకచోటికి చేరగా ఆ శబ్దము తనవైపుకే వచ్చుచున్నట్లాతనికి తోచెన గండడు చప్పున ప్రక్కనున్న సందులోనికి పోయి యందొక యింటిచాటున దాగుకొని యా శబ్దము దాటిపోవువరకు నచ్చటనే ఆగియుండెను

ఇనుపగడియము లున్న ఇనుపపళ్లె లాడించుచు మధ్యమధ్య నింకొకటి గిరగిర త్రిప్పుచు ఒక భిక్షుకు డా శబ్దములు చేయుచున్నా డని గండడు నిర్లక్షించెను ఆతని తలపై నొక యుష్ణీష మున్నది ఒంటిపై చింపిరియంగీ యున్నది వెంట నొక భిక్షాపాత్ర మున్నది అది మనుష్యకపాలమా? కాక సెంకాయచిప్పయా? అతడు నెమ్మదిగా నడుగులు వైచుచు నిశ్చయముగా సాగిపోవుచుండెను

ఆ భిక్షుకుని జూచినంతనే వ్యర్థముగా నింతదూర మేల వచ్చితి నని గండని కనిపించెను భిక్షచేయువారు అనేకవిధములుగా నుందురు ఎవరి వేళ వారిది, ఎవరి వేషము వారిది! అందులో నిదియు నొక విధము ఇక నింటికి పోవచ్చును పాప మింటికడ్డ తన భార్య తనకై దిగులుతో నెదురుచూచుచుండును అందును ఈనా డది ఎక్కువదీనముగా జూచిన ట్లాతని కిప్పుడు స్ఫురించినది అయినను ఇంతదూరము వచ్చి యాతని ననుగమింపక వెనుదిరిగి పోవు టేల? కొంతతడ వాతడు తటపటాయించెను ఎట్టకేల కాత డా భిక్షుకుని ననుగమించుటకే నిశ్చయించెను అట్లు నిశ్చయించినపిమ్మట జాగు రూకత వదలకయే వెంట నంటెను

ఆ నగరమునం దెందరు సంపన్నులు లేరు? కాని యా భిక్షుకు డట్టి సంపన్నులగువారి యిండ్లకడ నెక్కడను ఆగుటలేదు అత డాగునది పేదల కుటీరములవద్దనే ఆతడు వచ్చుచున్న శబ్దము దరిసినంతనే ఆ యింటివారు లేచి భిక్షము పెట్టుటకు సిద్ధముగా నుందురు శ్రద్ధగా వారు తాము తిను జొన్నలో, రాగులో, సజ్జలో ఆతనికి చెప్పి యర్పింతురు అవి యన్నియు నాత డొక్క పాత్రమునకే స్వీకరించి దీవించును దానికి తోడుగా దక్షిణగా వా రేదో నొక పణముగూడ నర్పింతురు

అత డట్లు చేరుచున్న కుటీరములు సామాన్యముగా చిరకాల మక్కడ నివాస మున్నవారివి కావు వారు చర్మములు ఇనుమువంటి పదార్థములతో వ్యాపారము చేయుటకు ఉత్తరభూములనుండి వచ్చిన చిల్లరవ్యాపారులును పనివారను ఐయుండిరి అట్టివారి గృహములు ఏకశిలానగరమున నెన్నియో లేవు ఉన్నవి కొంచెమును అక్కడక్కడ దూరదూరముల నున్నవి అత డా యిండ్లయొద్దకే పోవుచుండెన ఆ యిండ్లయొద్దగూడ నాత డెక్కడనో ఒకచోట తప్ప ఎక్కువసే పాగడు భిక్షగైకొని వారి నాశీర్వదించుటేతడవు సామాన్యముగా కొన్నియెడల మాత్రము ఇంటివా రేవో ప్రశ్నలడుగుచున్నట్లుందురు ఆ ప్రశ్నలుకూడ గండనికి వినబడ్డవరకు శాకునికులను జ్యోతిషికులను అడుగు ప్రశ్నలే కొందరుమాత్రము తమ పిల్లలకో, పెద్దకో జబ్బుగా నున్న గనియు దానికి ప్రతిక్రియ కావలె ననియు నర్థించుచున్న ట్లుండెను అతడు వారి కేదియో అభిమంత్రించి యిచ్చుచుండును అవి వేరలు కాబోలు!

ఈతని వెన్నంటుట యనవసర మని యుం దాలోచించిన గండనికి ఇక డిన్ని గృహములకును చిరపరిచితునివలె పోవుట చూడ నాశ్చర్య మయ్యెను దానితో సందేహమును బల మయ్యెన అతడు సంచరించు తావులును ముఖ్యముగా వెలిపాలెమునను దాని సమీప ప్రదేశములనే కలవు అతడు జూగమాడు ప్రదేశములను త్రాగుబోతుల కూటములును దొమ్మరిసానల యిండ్లను గూడ మధ్యమధ్య ప్రవేశించుచుండెను

ఇట్లా బైరాగి వెళ్లివెళ్లి బొల్లని యింటియొద్ద నాగెన అది చూడగానే గండనికి కాళ్లు స్తంభించినవి! ఏమిది?

నిశీథమున నగరమున నజ్ఞాతముగా సంచరించుట కథలలో సామాన్యముగా చదువునంత సులభము కాదు ఆ బైరాగి కేమి? అతడు రహస్యముగా సంచరించుట లేదు ఆ యినపకడియ యు చప్పుడుకు దారిలో నున్న పాములు జెర్రులు భయపడి పారిపోవును ఆ చప్పుడు దూరమున విన్నంతనే ఊరిలోని కుక్కలు మొరుగుచు లేచి యాతని వెన్నంటును గృహస్థులు తలుపులుతీసి ప్రశ్నింతురు అతడు ఉత్తరము పలుకకుండ వెడలిపోవును కాని యాతడు పెద్ద చప్పుడు చేయుచు అందరను ఆశీర్వదించుచు వెళ్లుచున్నాడు

(30 వ పేజీ చూడుడు)



భగీరథ ప్రయత్నం

బాలలూ! మీ రెప్పుడైనా భగీరథ ప్రయత్నం' అనే మాట విన్నారా? ఎవరేనా ఓ విషయంలో తీవ్రప్రయత్నం చేస్తోంటే అంతా వాణ్ణి "భగీరథప్రయత్నం చేస్తున్నాడురా!" అని అంటారు ఆ మాట రావడానికి ఓ చిన్న కథ ఉంది

పూర్వం సగరుడనే ఓ గొప్ప రాజుండేవాడు ఆయన నూరు అశ్వమేధయాగాలు చేసి దేవేంద్ర పదవి సంపాయించాలని పూనుకున్నాడు ఆ విషయం గ్రహించిన దేవేంద్రుడు, మారువేషంలో వచ్చి, ఆ యజ్ఞానికి ముఖ్యమైన అశ్వాన్ని తీసుకుపోయి పాతాళంలో కపిల మహాముని యెదుట కట్టేసి వెళ్ళిపోయాడు గుర్రం లేకపోవడంవల్ల యాగం ఆగిపోయింది దాన్ని తీసుకురావడానికి సగరుని అరవై వేల కొడుకులూ బయలుదేరి పద్నాలుగులోకాలూ వెదికేశారు ఆ సందర్భంలోనే, భూమిని త్రవ్వేశారు పాతాళంలోకి వెళ్ళడానికి అల్లాచేస్తే అది ఒక పెద్ద జుమయం అయిపోయింది అదే సగర పుత్రులచేత త్రవ్వబడింది కనక సాగరం (సముద్రం) అయింది

ఆ మార్గంగుండా పాతాళానికి పోయి, కపిలమహామునిదగ్గరున్న గుర్రాన్ని చూసి ఎగిరి గంతేశారు ఆ సంతోషంలో కళ్లు మూసుకు

శ్రీ ర్యాలి సూర్యనారాయణ.

పోయి, ఆ మహామునిని తిట్ట నానా కంగాళీ చేశారు దాంతో ఆయనకి చాలా కోపం వచ్చి, ఒక్కసారి కళ్లు తెరిచి, తీక్ష్ణంగా చూశాడు అంతే! అరవైవేలమందీ మాడి, బూడిదకుప్పలై పోయారు మహానుభావుల్ని హేళనచేస్తే యేమవుతుంది మరి?

పాపం! గుర్రం రాకపోవడంవల్ల యజ్ఞం ఆగిపోయింది దానికోసం వెళ్ళిన అరవైవేలమందీ భస్మమైపోయారు ఆ బెంగతో సగరుడు చనిపోయాడు తరువాత అంశుమంతుడు అనే ఆయన బయలుదేరి తన తండ్రితాతలకోసం పెద్ద ప్రయత్నం చేసి, దీర్ఘతపస్సు చేసి, యేమీ సాధించలేకుండానే గతించాడు

ఆయనకొడుకే మనం అనుకుంటున్న యీ భగీరథుడు అంటే ఈయన సగరుడికి మునిమనుమ డన్నమాట! ఆయనకూడ తండ్రిప్రయత్నం తెలుసుకుని, తను కూడా దాన్ని సాధించడానికిపూనుకున్నాడు ఎక్కడి ముత్తాత! ఎక్కడిమనవడు!! అయినాసరే ఆయనతాతల కార్యం సాధించాలని గట్టిప్రయత్నం చేశాడు కనకే అంతపేరు వచ్చింది



ఈ భగీరథుడు పాతాళానికివెళ్ళి, ఆ కపిలమహామునికి సపర్యలు చేస్తూ ఉండేవాడు కొంత

కాలానికి ఆయన జాలిదలచి, సగర పుత్రులు మోక్షం పొందాలంటే, ఆ బూడిదకుప్పలమీదుగా, గంగా నదిని ప్రవహింపచేస్తేనేగాని లాభంలేదన్నాడు. అబ్బా! గంగా నదిని ప్రవహింపజేయడమంటే అంత సులభమా? అప్పటికింకా గంగ భూలోకానికి రాలేదు. స్వర్గంలో ప్రవహిస్తున్న ఆ గంగా నదిని ప్రార్థించి, క్రిందికి దింపి, పాతాళలోకానికి తీసుకుపోయి, తాతల భస్మాన్ని పవిత్రం చెయ్యాలంటే సామాన్యమా మరి?

అయినాసరే పట్టు విడవకుండా భగీరథుడు హిమాలయాల్లోకి పోయి అన్నపానాలు మానేసి ఘోరంగా తపస్సుచేశాడు. అలా చెయ్యగా, చెయ్యగా గంగ ప్రత్యక్షమైతే, తన కోరిక చెప్పాడు. దానికి ఆమె జాలిపడి "నాయనా! నా అభ్యంతరం లేదు రావడానికి. కాని నేను ఇంత ఎత్తుమీదనుంచి క్రిందికి రావడంలో ఆ దూకుడుకి భూమి ఆగలేదు. అంచేత మధ్య నన్ను భరించేవాడెవరైనా ఒకరుండాలి. తన తలపై నన్ను దరించడానికి ఆ శివుణ్ణి ప్రార్థించు. అందుకు ఆయనొక్కడే తగినవాడు అని వెళ్ళిపోయింది. పాపం యింతా కష్టపడ గంగని ప్రత్యక్షం చేసుకుంటే, యింకా ఒకరిని ప్రార్థిస్తేనే గాని అది పూర్తి అయ్యేటట్టు లేదు. ఏం చేస్తాడు మరి భగీరథుడు. కాని ప్రయత్నంమాత్రం మానలేదు.

గంగచెప్పినప్రకారం శివుణ్ణి ప్రార్థించాడు భగీరథుడు అతి నిష్ఠతో. కొంతకాలానికి శివుడు ప్రత్యక్షమై, భగీరథుడి కోరికప్రకారం గంగని తన జటాజూటంలో శిరస్సుపై ధరించడానికి ఒప్పుకున్నాడు. అప్పటినుంచే శివుడి నెత్తిమీద గంగ నిలిచిందన్నమాట! ఆవిధంగా గంగని స్వర్గలోకంనుంచి శివుడి నెత్తిమీదికి అక్కడినుంచి భూలోకంమీదుగా పాతాళానికి తీసుకునివెళ్ళి భగీరథుడు తన తాతల భస్మరాసులమీదనుంచి ప్రవహింపజేసి వారికి పుణ్యలోకాలు సమకూర్చాడు. ఈరీతిగా ఎప్పుడో చచ్చిన తాతముత్తాతల కోసం అష్టకష్టాలు పడి తన ప్రయత్నం కొనసాగించాడు భగీరథుడు, అందుకే ఆయనప్రయత్నం 'భగీరథయత్నం' అని చిరస్థాయిగా ఉండిపోయింది. మనము కూడ ప్రయత్నం చెయ్యడంలో మనశక్తిని చూపి గట్టిప్రయత్నంచేయాలి.



ప్రధాని నెహ్రూ అమెరికా బాలబాలికలకు బహుమతిగా పంపుతున్న ఏనుగుగున్నలు —"శాంతి", "అశోక్"—

బాలానందం

తేనెటీగల రాజ్యం

మార్గరెట్ గాటీ

(గతసంచిక తరువాయి)

మళ్ళీ తెల్లవారేటప్పటికి, పడుచు ఈగలకు నిన్నటి అనుమానాలూ, ప్రశ్నలూ, ఊహాలూ మళ్ళీ తలలలో ఆడసాగాయి. చిన్నచిన్న ముఠాలుగా కూడుకొని ఈ రాజ్యాంగంవిషయం తేల్చుకోవాలని తీవ్రంగా చర్చిస్తున్నాయి. అన్నీ పడుచుఈగలే. ఆ మెను ఎవళ్ళ ఊహాలు వాళ్ళవే తప్ప, ఇంకొకళ్ళ మాట ఒకళ్ళకి చెవులు కెక్కేటట్టు లేదు. అందులో మంచి వయసులోనూ, మంచి పొగరులోనూ ఉన్నారేమో, ఇట్టే కోపతాపాలు ఎక్కువయ్యాయి. చివరికి "నీ మొహం నీకేం తెలియదు" అంటే "నీకు మహా తెలిసిపడుసుపో" మ్మని తిట్టుకోటాలు కూడా ప్రారంభమయాయి. ఇంకా కొట్లాటలకే సిద్ధంగా ఉన్నారు.

ఇంతలో మొదటి ఈ ఊహాలు పురికొల్పిన పడుచుఈగ మళ్ళీ వాళ్ళ దగ్గిర కొచ్చింది. అందరినీ సర్దబోయింది.

"అబ్బాయిలూ ఇప్పుడు మనం అంతా పెద్దవాళ్ళ మయిపోయాము. ఇప్పుడు మళ్ళీ పసిపాపలను పెంచి రాణులలాగా మనను పెంచడం కుదరదు. కాబట్టి రాణులు అంటూ లేకుండా, అంతా పనిచేసే ఈగలరాజ్యాంగం "రిపబ్లిక్" పేరట సృష్టించుకొందాం. ప్రజాస్వామ్యం ఉంటుంది. మనకు మనమే అధికారులమౌతాం" అంటూ చెప్పింది.

తక్కినఈగలకు కూడా ఈఊహ బాగా నచ్చింది. సరే "అందరం తేనెతుట్టె వదలి బైటికి ఎగిరి వెళ్ళిపోదాం, అంటూ ఆ ఈగమాట చొప్పున అంతా తోటల్లోకి గుంపుగా బయలుదేరి ఝుంకారం చేస్తూ ఎగిరిపోతున్నారు. కాని రాణి లని ఈగల గుంపు ఎవళ్ళ మాట వినాలో తెలియలేదు. అందుచేత ఎవరి మానాన వారు తొక్కిసలాడుకొంటూ పట్టిగొడ్లమందలాగ అడ్డదిడ్డంగా పోవటం తయారైంది గాని, మునుపటిలాగా రాణిమాట ప్రకారం క్రమంగా వెళ్ళే పద్ధతి కుదురలేదు.

ఇంతలో తేనెతుట్టె ఎక్కడ కట్టుకోవాలీ అనే ప్రశ్న వచ్చింది!

"అడిగే దేమిటి?—తోటలోనే" అంది ఒక ఈగ. "పొదల్లోఅయితే నయం" అంది మరొక ఈగ. "కాస్త పాడుపడ్డ ఇంటి చూరుకు కట్టుకొంటే ప్రశస్తం" అంది మరొకటి. "చెట్టుకొమ్మను కట్టుకొంటేనే మనకు స్వేచ్ఛ ఎక్కువ, ఇంకో పద్ధతికి నేను ఛస్తే ఒప్పుకోను" అంది ఐదో ఈగ—

ఇలా అయితే తెమిలి తెల్లారినట్లే! అంతే కదా?

"అబ్బాయిలూ మిమ్మల్ని చూస్తే నాకు ఒళ్ళు మండుకొస్తూంది. ఇప్పటికే ప్రొద్దున్నంతా గడిచిపోయింది. ఇంతవరకూ మనం ఏ విషయం తేల్చుకొన్నదే లేదు" అంది మొట్టమొదటిగా ఈ బోధ మొదలుపెట్టిన పడుచు ఈగ!

"ఓ యబ్బ! అప్పుడే నువ్వే రాణి వయినట్లు మాట్లాడుతున్నావే మా యిష్టంవచ్చినట్లు మేం వాదించుకొంటాం, తిట్టుకొంటాం, తిమ్ముకొంటాం. "పొద్దున్న గడిచిందట, పొద్దున్న గడిస్తే నీకెందుకూ, మధ్యాహ్నం గడిస్తే నీ కెందుకు మా యిష్టం మాది నీఇష్టం కావాలంటే, ఒంటరిగా పోయి, నీ క్కావాలిసింది నువ్వు చేసుకో, అంతేగాని మా జోలికి రాకు" అన్నాయి కొన్ని రోషంగల పడుచుఈగలు.

దాంతో ఆ ఈగకు చాలా సిగ్గుచాటు అయింది. అక్కడ ఉండటానికి చిరాకూ, అసహ్యమూ కూడా వేసుకొచ్చింది. అంతటితో వాళ్ళను విడిచి ఇవతలకు వచ్చి, పచ్చని పూలగుత్తి కనబడితే, తన చిరాకూ కోపమూ, మర్చిపోయేందుకు ఆ పూలగుత్తిమీద వ్రాలి, పుప్పొడి తేనే సేకరించుకొంటూ, కాస్సేపు హాయిగా గడపసాగింది.

ఇంతలో ముసలిఈగ అటు వస్తూ పడుచుఈగను చూసి ఆశ్చర్యపడింది. "ఇదేమిటి, ఇంత నాయకు

కాలివేను వ్విక్కడున్నావేమటి? మీ జట్టంతా ఏమయ్యారు?"

పడుచు-ఈగ చిరాకుతో, "ఏమో నాకు తెలియదు, తోట దగ్గిరే, వాళ్ళను వదిలేసి ఇలా వచ్చాను"

"ఏం చేస్తున్నారా ఏమిటి"

"ఏం చేస్తున్నారు, దెబ్బలాడుకొంటున్నారు"

'దేనివిషయం?"

"ఏం చెయ్యాలి" అనేవిషయం మీద

"ఆహా! నిజంగా తేనెటీగలకు ఎంతమంచి కాలక్షేపం" అంటూ నోరు నవ్వుతూ నొసలు వెక్కిరిస్తూ అంది ముసలి ఈగ

"నన్ను చూసి నవ్వకు లేవోయ్! అసలు ఏం చెయ్యాలో పోనీ నువ్వయినా చెప్పు దూ! నిన్న ఆ పిల్లలు చెప్పింది అంతా నిజంలాగే అనిపించింది నాకు మరి అల్లా చేస్తే, యిల్లా కొట్లాడుకోడం తప్ప, రవ్వంతైనా పని ఎందుకు జరగటం లేదో! అందరం సమానంగా ఉందామంటే, అందరం కొట్లాడుకోటమే మిగుల్తోంది"

"పోనీగాని, నీ యీడెంత?"

"నా యీడా! ఏడు రోజులు," అంది పడుచు-ఈగ పడుచుదనపు గర్వంతో రెక్కలు విరుచుకొంటూ జవాబు చెప్పింది (తేనెటీగలు, ఏడురోజులకే మాంచి పడుచుదనంలోకి యెదిగిపోతాయి)

"సరే! నా యీడెంత" అని అడిగింది ముసలిఈగ

"బహుశా నీకు చాలా నెలల ఈడే ఉంటుం దనుకొంటాను నాకంటే ఎన్నోరెట్లు పెద్దదానివలె వుంటావు"

"నిజం, నేను చాలా పెద్దదాన్నే



సరే, మిత్రమా, మనం ఇద్దరం కుస్తీపడదాం వస్తావా!"

పడుచు ఈగ తృణీకారంతో "ముసిలిదాన్తోటా! చాల్చాలు, ప్రమాదవశాన్నని కాలో చెయ్యో విరిచానంటే! ఆరునెలలు సాముచేసి మూలనున్న ముసిలిదాన్ని కొట్టటమా!"

"మరి నీకంటే, ఇంత దుర్బలమైనదాన్ని గదా! నా సలహా అడుగుతావెందుకు?" అంది ముసలి ఈగ

"అదేం మాట! నీకు ఒంట్లో బలం లేకపోటానికీ నీ తెలివితేటలకూ సంబంధమేమిటి? నువ్వు తెలివైనదానివిగదా అని నిన్నడుగుతాను నా తెలివితక్కువతనం నాకే తెలిసివచ్చింది ఇప్పుడు సిగ్గుపడుతున్నాను కూడా!" అంది పడుచు ఈగ "సరిసరి-ముసిలివాళ్లూ, పడుచువాళ్లూ, బలవంతులూ బలహీనులూ-తెలివిగలవాళ్ళూ-తెలివితక్కువవాళ్ళూ-ఇల్లా మొగలెట్టావేమిటి-అంతా సమానం అన్నావుకదా-పోనీలే అయిందేదో అయింది మనం ఇద్దరం జట్టుగా కలిసి బదుకుదామా?" అని అడిగింది ముసలిఈగ-

"ఓ! తప్పకుండా నీతో ఉండటానికి అతిసంతోషంతో ఒప్పుకొంటాను- అయితే ఎక్కడ ఉందాం?" అంది పడుచుఈగ

'ముందు ఒకమాట చెప్పు-ఏ విషయమయినా తేల్చవలసినప్పుడు-ఎవళ్ల మాటప్రకారం మనలో నడుచుకోవాలి?"

"నీ మాటప్రకారమే- నువ్వే తెలివైనదానివి కదా?"

"సరే! మరి తిండి తేనె తెచ్చి పెట్టాల్సినవాళ్ళెవరు?"

(29 వ పేజీ చూడుడు)

కూపర్ కళాశాల

ఉచితసాంకేతికవిద్యాప్రదానసంస్థ

వేసం ఎనభై నాలుగు పన్నాలూ దమ్మిడీ ఖర్చు లేకుండా చదువుకొన్నానన్నాడు అగ్నిహోత్రావధానులు కుమారుడు వేంకటేశం. పరీక్షలు తప్పుతూ, ట్యూషన్ల పేరిటా, టెక్స్టుపుస్తకాల పేరిటా తండ్రి దగ్గిర డబ్బు గుంజటానికి ప్రణాళికలు తయారుచేస్తూంటే ఈనాడు విద్యార్థులూ, విద్యాహీనులూ అయిన తండ్రులు కూడా, తమ కొడుకులకు చదువు చెప్పించాలంటే అగ్నిహోత్రావధానులు విధానంలో తమ కొడుకులు చదువుకోగల్గితే బాగుండునే అని మనస్సులో అపలాపించుకొంటున్నారు పిల్లడు చదువుకోవలననే ఉబలాటం ప్రతితండ్రికీ ఉంది దేశంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది అంటూ హంగామా చేసిన ప్రచారకులు, ప్రభుత్వంగానిలవాల్సి వచ్చేటప్పటికి, విద్యావ్యాప్తివిషయంలో సామాన్యకుటుంబీకులు పిల్లలను చదివించుకోగలిగేందుకు చేయగల సహాయం, పీసమెత్తు కూడా లేకుండా పోతోంది మనుపు పిల్లలను చదివించిన తండ్రుల మాత్రపు ఆర్థికపరిస్థితులలో ఉన్న ఈనాటివారెవ్వరూ తమ ఏకపుత్ర సంతానాలకు కూడా, అయ్యే ఈనాటి చదువువ్యయం భరించలేని స్థితిలో ఉన్నారు ప్రభుత్వం అటు గ్రాంటుల పేరిట కొన్ని కొన్ని స్వల్పసహాయాలు చేస్తూన్నట్లు నటించగల్గుతూందే గాని, ఉచితవిద్యను పిల్లలకు సమకూర్చి, తండ్రులను సంతృప్తిపరచగల స్థాయికి రాలేదు పైపెచ్చు స్కూలు, కాలేజీ, విశ్వవిద్యాలయపు చదువుల జీతాలు, తదితర ఖర్చులు, మొత్తాలన్నీ పెంచితేనేగాని ఈమాత్రపు చదువుకూడా దేశంలో నిలబెట్టలేని స్థితిలో ఉంది

నేషనల్ కాలేజీలలాంటి సంస్థలు సహాయనిరాకరణోద్యమప్రారంభదినాలలో ఉచితవిద్యాప్రదానానికి కొంచెం నడుంకట్టి కృషి చేశాయి కాని ఈ విద్యాలయాల్లోనే సాంకేతికవిద్యలలో నిపుణులయినవాళ్ళనుకూడా, ఆంగ్లేయసంస్థల ఇంజనీర్లన్నా కొంత గుర్తిస్తూ ఉద్యోగాలిస్తూ వచ్చారుతప్ప, మన కాంగ్రెస్ప్రభుత్వాలుగాని, నాయకులుగాని వాళ్లు తిట్టూవచ్చిన ప్రభుత్వపు కాలేజీల బి ఎ స్కూల్ ఫైనల్, సర్టిఫికేట్లకిచ్చినంతమాత్రపు మర్యాద చూపించిన పాపానగాని కర్మవశాత్తూ తమ అధీనంలో ఉన్న ఉద్యోగాల్లో వాళ్లను నియమించే పాపానగాని పోలేదు అందుచేత ఆ ఉచితవిద్యకు విలువే లేక ఆరంభపు పొంగు చల్లారగానే అల్లాగే అణగారిపోయింది

మనదేశంలో మారుతూవచ్చిన ప్రభుత్వాలు విద్యకు, అక్షరాస్యతకు ఇచ్చుకొంటూవచ్చిన నిర్వచనాలనుబట్టీ, విలువలనుబట్టీ, ఈ సంక్షోభం ఒక ప్రభుత్వం మార్పుమీద మరొకప్రభుత్వంమార్పుతో ఇల్లా పెరుగుతూవచ్చింది గతశతాబ్దంలో, ఇంగ్లీషులెక్కకు ఇల్లిటరేట్ అయిన, అగ్నిహోత్రావధానులు విద్యావంతుడు అంతకుముందు నేటి లెక్కను నిరక్షరాస్యులైన, అక్బరు, హైదర్ ఆలీ టిప్పుసుల్తాను సామ్రాట్టులు, మహావిద్వచ్ఛిఖామణులు కొన్ని ఏళ్లక్రింద ఆంగ్లప్రభువులు తీసుకొన్న విద్యావంతుల లెక్కలప్రకారం, ఆస్థానకవి చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిలవారివంటివారు కూడా, ఇంగ్లీషుఅక్షరాలు రానికారణంచేత, ఏ యూనివర్సిటీద్వారాను పేరురానికారణంచేతా, భారతదేశంలోని నూటికి తొంభైఐదుమంది "ఇల్లిటరేటుల" లెక్కలకు (విద్య రానివారి లెక్క) యూనివర్సిటీచిహ్నాలనుబట్టి లెక్కవయ్యసాగగా, ఈ సామీప్యంలోనే అంచనాకు వస్తారు

విద్య విద్యకోసం నేర్వాలి అనేది ఏకోటికొక్కడికోతప్ప సామాన్యసంసారిగా బ్రతకదలచుకొన్న మానవునికి వీలులేదు ఇక ప్రయోజనార్థమైనప్పుడు, దాని ఫలితంగా రగలవృత్తులకు ప్రభుత్వ ఆదరణ ఎల్లా ఉంటే అల్లా ఉంటుంది బ్రిటిషుప్రభుత్వము, తను పెట్టిన బడులలో అధికంగా ధనం ఖర్చుపెట్టి, చదువుకొని తను పట్టం ఇస్తేనే తప్ప వృత్తిలేని స్థితి విద్యకు కల్పించింది చివరి చివరికి ఆవిద్యకు కూడా వృత్తి కల్పించలేక ఉభయభ్రష్టత్వగూ చేసి విడిచిపెట్టింది యుద్ధాల పుణ్యమా అని ప్రభుత్వాలకు సాంకేతికవిద్యల అవసరం కల్గింది ఆ అవసరంలో, తాత్కాలికంగా విద్యాశిక్షణావృత్తీకూడా ఏకం చేసి ఆశ కల్పించి ప్రభుత్వాలు విద్యప్రమేయం లేకుండా సంఖ్యాబలం వృద్ధి చేసుకుని తమ పబ్బం గడుపుకొన్నాయి నేటికీ మనకు సాంకేతికవిద్య చాలా అవసరమే కాని సాంకేతికవిద్యలకు ప్రత్యేకంగా జిజ్ఞాస కల విద్యార్థులు దొరికితేనే తప్ప దేశానికి కావలసిన సాంకేతిక నైపుణ్యం లభించదు ప్రభుత్వ సాంకేతికవిద్యాలయాల కులవర్గతత్వపు పెద్దడులలో, భరింపరాని ఖర్చుల భారాలలో, నిజంగా జిజ్ఞాస కల్గి ఉండీ, ఆర్థికంగా స్థితిగతులు లేని అధికసంఖ్యాకులకు స్థానం లభించటం కష్టం దేశంలోని సరియైన ప్రతిభా, ఉత్సాహాలను ప్రభుత్వము వినియోగించుకోగల అవకాశంగూ దాదాపు శూన్యమే

ప్రజలలో సాంకేతికవిద్యాభ్యున్నతినే నేడు ప్రభుత్వం తీవ్రంగా కాంక్షించేదైతే, ఆద్యంతాలూ సాంకేతికవిద్య, తీవ్రంగా ఆ జిజ్ఞాస కల యువకులకు, ఉచితంగా లభించేటట్టూ, ఆ ఉచితవిద్యకు ఫలితమైన వృత్తిలో వారిని ఉపయోగించుకోగల్గేటట్లుగా, ప్రాథమికస్థితినుంచి పరిశోధకస్థితిదాకా ఉచితవిద్యాలయాలు, విరివిగా స్థాపించవలసిన అవసరము ఉంటుంది అథవా అల్లాంటివి స్థాపించగల సత్తాగలవారిని ప్రోత్సహించి, యూనివర్సిటీ అఫిలియేషనే ముఖ్యమైన తాహతు కాకుండా, తమఉద్యోగుల ఎన్నికలకు జరిపే పర్యవేక్షకమీమాంసా పరీక్షలు నిజాయితీతోనే, ప్రజ్ఞకు పోషణ చూపించి ఉచితవిద్యాలయాలకు ఆదరణ అభి

లాభ కల్పించి, ఆ సంస్థలు వృద్ధిలోకి వచ్చేటట్లు చేయవచ్చును

ఇల్లాంటి విద్యాలయాలు, ఆదర్శాలుగా పెట్టుకొని, కలలుకంటూ, ప్రత్యక్షంగా ప్రయత్నించబోతే అవి చితికిపోవటమేనా లేక వాస్తవికదృష్టితో నడిపించి అభ్యుదయం సమకూర్చిన ఇల్లాంటి విద్యాసంస్థలు ఏమైనా అమలులో ఉన్నాయా అని చూచుకొంటే, మనకు మార్గదర్శకంగా, ఇల్లాంటి విద్యాసంస్థ నడిపేటప్పుడు చూపవలసిన మెళుకువలు తెలుపుతూ, అమెరికాలో, కూపర్ కాలేజీ అనే ఇంజనీరింగ్ కళాశాల ఒకటికనబడుతుంది ఇక్కడ విద్యాభ్యాసము ఉచితము అయితే పేద అయి ఉండాలన్న నియమం లేదు ధనికు డయినంతమాత్రాన తలుపులు మూయటం లేదు ఇంజనీరింగ్ కళాశాలలో చదవటానికి కావలసిన ప్రజ్ఞ, ఔత్సుక్యము, తీవ్రమైన జిజ్ఞాస, ఇవి ముఖ్యము ఈ గీటురాతి మీదే ఇక్కడ విద్యార్థులకు ప్రవేశం దొరుకుతుంది ప్రజ్ఞ, గుణంగా ఎంచుకొన్న కళాశాల గాబట్టి, ఉచితవిద్య అందుకొంటున్నామే అని నేటి మానసికపరిణామాలను బట్టి ఏవిద్యార్థి కించపడవలసిన పరిస్థితిగాని, సంఘంలో అతనిపట్ల చిన్నచూపుగాని ఉండవు ఉచితవిద్యకు, ఆ సదవకాశం తోడైతే నేతప్ప, విద్యార్థి మనస్సు దృఢవికాస మందుకొనే ఆస్కారం తగ్గిపోతుంది

౨

న్యూయార్కు నగరంలో బవరీ అనే పేట ఉంది పట్టణనవీనత ఏమీ కనబడదు అతిపురాతనపు ఇళ్ళవరుసలూ, అతిపాత పేటానూ - ఇక్కడ నివసించేవాళ్లంతా అలగాజనమే ఈ పేటముఖాన్న, కూపర్ స్క్వేర్ అనే కూడలిలో ముక్కోణపు పార్కు ఒకటుంది మధ్యాహ్నపువేళ చెట్ల నీడల అన్నాలు తెచ్చుకొనితినే ఫ్యాక్టరీ కూలీజనంతోపాటు, మధ్యాహ్నపు భోజనాలు తెచ్చుకొని పాఠ్యపుస్తకాలుకూడా తిరిగేసుకొంటున్న విద్యార్థులు కనబడతారు వాళ్ళు కూపర్ కాలేజీవారు 90 ఏళ్లనుంచీ ఈ కాలేజీ ఈసమీపంలో స్థాపితంగా ఉంది కాలేజీముఖాన్న ఒక విగ్రహం ఉంది కాలేజీస్థాపకునిది పేరు పీటరుకూపర్ విగ్రహం చెక్కిన శిల్పి అగస్టస్ సెంటుగాడెన్స్ పీటరు కూపర్ 71 వ ఏట ఒక వర్కుషాపులో అంప్రెటిస్‌గా పనిచేస్తూండేవాడు అప్పటికి అతని జీతం ఏడాదికి 25 డాలర్లు (అంటే దాదాపు 80 రూపాయలు) ఒక ఏభై ఏళ్లనాటికి, అతను ఈ సంస్థకు ఒక మహానిధిని కూర్చి సంస్థ స్థాపించాడు ఆ ఏభైఏళ్ళల్లో, అతను కోట్లు సంపాదించాడు సంపాదన ఒక అంకెలో ఉన్నప్పటికీ, తర్వాతికీ, సున్నాలు పెరగటంతప్ప, సాంఘికంగా పెద్దమార్పు ఉన్నట్టు ఏమీ భావించలేదు 75 రూపాయలు సంపాదిస్తున్నా 75 లక్షలు సంపాదిస్తున్నా డబ్బుకు వినియోగం సంఘసేవాపరంగా ఒకమాదిరిగానే కనపడం దతనికి సెయింటుగాడెన్స్ అల్లాంటివాడే తండ్రి ఫ్రెంచిదేశంనుంచి వలసవచ్చేశాడు చెప్పులు కుట్టుకొని జీవించేవాడు కొడుకు పగలు తండ్రితో పనిచేస్తూ రాత్రిళ్లు కూపర్ కాలేజీలో డ్రాయింగ్ నేర్చుకొన్నాడు సంస్థ నిర్మించిన పీటర్‌కూపర్, అమెరికాలోని మొట్టమొదటి ప్రయోజనకరమైన రైలుయింజన్ తయారుచేసిన ఇంజనీయరు గాడెన్స్, అమెరికన్ శిల్పంలో నేటి నవీనదృక్పథం ప్రవేశపెట్టిన మహాశిల్పి

కూపర్ మంచివ్యవహర్త వాస్తవికభావుకుడు ప్రత్యక్షసమస్యలను ప్రతినిమిషం, నేలవిడిచిన సాము గాకుండా, యాథార్థ్యదృష్టితో పరిశీలించి, సాధించిన సమర్థుడు అందుచేత యింజనీరింగ్ కళాశాలను అతను స్థాపించటంలో వింతలేకపోవచ్చును కాని లలితకళలకు ఆ కళాశాలవిద్యలో అతను స్థాన మిచ్చి, వృద్ధిలోకి తేవటమే ఆశ్చర్యం కల్గిస్తూంది (బందరు నేషనల్ కాలేజీ స్థాపించిన శ్రీ కోపల్లి హనుమంతరావుగారు కూడా ఇంజనీరింగ్‌కు లలితకళలకూ విద్యాబోధనలో సమాన స్థానమియ్యటంకూడా గమనికలోకి తెచ్చుకోవలసిన విషయం) కూపర్ చిన్నతనం రోజులలో, ఇంజనీరింగ్‌కూడా, కంసాలి, కుమ్మరి, వడ్రం, సాలి, కలంకారి, తాపీ, దేవాలయశిల్పిరాతిపని-ఇత్యాది వృత్తులన్నిటితోపాటు, ఆర్ట్సుగానే పరిగణింపబడేవి (మనలోకూడా ఇవన్నీ చతుష్షష్టికళలుగానే భావించబడుతాయి తరువాత రోజుల్లో కూడా ఇంగ్లీషు యంత్రనిర్మాణంలో కళాదృష్టినికూడా మేళవించుకొనేవారు ఇప్పుడు కూపర్‌సంస్థడైరెక్టరు ఎడ్విన్ ఫార్వా బర్గెల్ - మసాచుసెట్స్, ఇంజనీరింగ్ యిన్స్టిట్యూట్‌లో పట్టం పొందినవారు, "శాస్త్రము, కళ, జీవితంలో ఒక సితికి రెండుముఖాలు వీటిని వేరుపరిచేందుకు వీలు లేదంటాడు ఈ యనకళాశాలా సంస్థకు డైరెక్టరు కాగానే, బోధన శాస్త్రాల్లో, వేదాంతం, కవిత్వం, సాహిత్యం, చరిత్రకూడా ప్రవేశపెట్టారు ముందు, కేవలం యాంత్రికవిద్య, శిల్పవిద్య నేర్చుకొందామని వచ్చిన విద్యార్థులు, ఈ అక్కరలేని విద్య లనవసరమని మొరాయించబోయారు కాని తర్వాత, తమ విద్యను సరిగ్గా నేర్చుకొనేందుకు తక్కిన విద్యల దోహదం ఎంత ఉంటుందో కనుక్కోగలిగారు

ఈ సంస్థలో విద్య ఉచితం చదువు చెప్పినందుకు ఫీజు లేదు కాని మామూలు ధర్మచదువుల్లాగ కేవలం దానపు చదువు అనేందుకు వీల్లేదు అసలు చదువుకొనేవాడు బీదవాడో ధనికుడో ఎక్కడినుంచి వచ్చాడో ఆ ప్రమేయము సంస్థఅధికారులకు అక్కరలేదు ఫోర్డుకొడుకే కావచ్చును లేదా తిండికి లేని అరిపేదవాడే కావచ్చును కాబట్టి కేవలం బీదవాళ్ళకే విద్యఅన్న నిర్బంధం లేదు సంఘంలో స్థితిగాని, ఎత్తుపల్లాలవేటివల్లా కూడా, విద్యకు నిరోధం తగలకూడదని సంస్థాపకుల అభిప్రాయం

(సంస్థ వ్యవహరించేవిధానం పైవారం వ్యాసంలో వివరించబడును—సం)

రోజులు కలిసివచ్చినా...

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

మా బావమరిదిమనస్తత్వం నాకేమీ అంతుబట్టలేదు ఎవడన్నా మనో వైజ్ఞానికుడు విడదీసి చెబితే బాగుండును

మా బావమరిది ఉన్న ఊరు కదలనని చేస్తున్న ఉద్యోగం మాననని భీష్మించుకూర్చుని నెలకు అరవై రూపాయలు తెస్తూ పెళ్ళాం పిల్లల్ని పస్తులు పడుకోబెడుతూ ఏళ్ళు నెట్టాడు వాడి దారిద్ర్యాన్ని ఎప్పుడైనా చూసేవాళ్ళకే ఎంతో బాధగా ఉండేది, వాడెల్లా భరించాడో

తన దారిద్ర్యంతో అందరిదృష్టినీ ఆకర్షించానన్న సంతృప్తి వాడికే ఉంటుంటాది

"ఈ దిక్కుమాలిన నౌకరీ మానేసి కాస్త పెద్ద బస్తీలకు పోయి నాలుగురాళ్ళు జాస్తి సంపాదించటానికి ఎందుకు ప్రయత్నించవురా?" అంటే, తనకు జీతం డబ్బులిచ్చే యజమాని అనవలసినమాటలు తానే అనేవాడు

"నేను నిజంగా ఇంతకంటే ఎక్కువ జీతానికి అర్హుణ్ణయితే ఆ విషయం యజమానికి తెలిసివచ్చేటట్టు చేసి ఆయనహృదయ పరివర్తన తెచ్చేభారం నామీద ఉన్నది నా యజమాని హృదయపరివర్తన తీసుకురాలేకపోతే నాకు ఏ అర్హతా లేదన్నమాటే, మనం నైతికంగా మానవప్రకృతిని జయించాలిగాని ఏవూరుపోతే ఏముంది?"

ఈ వేదాంతంతో మా బావమరిది ఎల్లకాలమూ ఆఉద్యోగంలోనే ఉండిఉండును కాని వాడి స్నేహితులు కొందరు చిన్న ఉద్యమం లేవదీసి వాడికి మూడు వందల రూపాయల ఉద్యోగం సంపాదించిపెట్టి, వాణ్ణి పట్నం ప్రయాణం కట్టించారు

ఎట్లాగయితేనేం, మా చెల్లెలికీ దాని పిల్లలకూ కాస్త మంచిరోజులు వచ్చాయిగదా అనుకున్నాను కిందటివారం పట్నం వెళ్ళి చూద్దానుగదు, ఏం చెప్పను? వాడి సంగతి నానాభీభత్సంగా ఉంది ఇల్లు అయ్యవారినట్టిల్లుగా ఉంది ఎవరికీ ఏపూటా తిండి లేదు మా చెల్లెలికీ పిల్లలకూ సరిగా బట్టలు లేవు

నేను వెళ్ళేసరికి మా బావమరది అప్పటికే ఆఫీసుకు వెళ్ళిపోయినాడు మా చెల్లెలు మాత్రమే ఇంట్లో ఉంది

"నీకు పుణ్యం ఉంటుంది, హోటల్లో భోంచేసిరా వచ్చేటప్పుడు ఏదన్నా టిఫిను తెచ్చిపెట్టు పొద్దున్నే లేచి పచ్చిమంచినీళ్ళు తప్ప తాగలేదు దగ్గిర డబ్బుంటే, నాలుగైదు రూపాయల్లో ఒల్లుచీర పట్రా ఈ కట్టుకున్న పాత తప్ప మరొకటి లేదు," అన్నాది మా చెల్లెలు

"ఇదేం, పాపకర్మ! వాడికి జీతం ఇవ్వరా?" అన్నాను

"ఇస్తారు ఏంలాభం? ఇరవైఅయిదు వేలకు ఇన్స్యూరెన్సు తీసుకున్నారు మా అందరి మరణానంతరం ఇరవైఅయిదువేలిస్తారట ప్రస్తుతంమటుకు నెలజీతంలో నూటఇరవైఅయిదురూపాయలు పోతున్నాయి కోఆపరేటివులో రెండువేలు అప్పు తీసుకుని ఒకటిన్నరగ్రౌండు నేల కొన్నారు ఇన్స్యూరెన్సువాళ్ళిచ్చే డబ్బుతో దానిమీద ఇల్లుకడితే అందులో మా మునిమనమలు గృహప్రవేశమాతారుట లేదా వాళ్ళు స్థలం అమ్ముకోదల్చుకుంటే అప్పటికి దాని ఖరీదు అయిదువేలో పదివేలో అవుతుందిట దానికింద నెలనెలా అరవయ్యో, డెబ్భయ్యో చెల్లూ! ఏ నెలా ఇంటిఅద్దె సరిగా ఇచ్చిన పాపానపోరు ఇంటాయన వెళ్ళగొడతానని బెదిరిస్తున్నాడు ఎవరో మొహమోటపెడితే లంచం లేకుండా ఇల్లిచ్చాడు దానికి తగ్గట్టుగా అద్దెకూడా సరిగా ఇవ్వకపోతే ఆయనకెట్లా ఉంటుంది?" అన్నది మా చెల్లెలు

నేనిదంతా నమ్మలేకపోయినాను నలుగురు పిల్లల తల్లి మొగుడిమీద ఆపాటి ఒంటికాలితో పోకపోతుందా అనుకున్నాను

సాయంకాలం మా బావమరిది ఆఫీసునుంచి తిరిగివస్తూ దాదాపు ఒకతాను పచ్చగుడ్డ తెచ్చాడు


"నాకు చీర ఏమిటండీ?" అన్నది మా చెల్లెలు

"చీర కొక్కడిదే డబ్బా! ఇది కర్టెన్లకోసం తెచ్చాను ఏంరా, కాస్తఉద్యోగం చేస్తున్నామంటే జీవనప్రమాణం కాస్త పెంచుకోవాలా వద్దా? నువే చెప్పు," అన్నాడు


మా చెల్లెలు చెప్పిన సంగతులన్నీ నిజమేనా అని అడిగాను నిజమేనని ఒప్పుకున్నాడు

"మనకిప్పుడు కొంత స్థాయిచిక్కింది కనక దీర్ఘకాలప్రణాళికలూ, నలుగురిలో కాస్త మర్యాదా సాధించాలి ఏమంటావు? తిండికీ బట్టకూ లేకపోవటమనేది మనకు మొదటినుంచీ ఉండనే ఉన్నది అట్లాగే నాలుగురోజులు గడుపుకుంటే ఆ తరవాత జంయిమని ఒక్క వెలుగు వెలగొచ్చు ఈ కర్టెన్లు తగిలించినతరవాత చూసుకో, ఇల్లు ఎంత అందంగా ఉంటుందో! ఇదేం చూశావు, ఇన్‌స్టాల్మెంట్సుమీద మాంచి రేడియోసెట్టొకటి మాట్లాడాను రేపు తీసుకొస్తున్నాను," అన్నాడు మా బావమరిది

నాకు నెత్తురుచూస్తే కళ్ళు తిరగలు కమ్ముతాయిగాని లేకపోతే ఆ క్షణానే వాణ్ణి పిస్తోలుపెట్టి కాల్చిపారేసిఉండేవాణ్ణనుకోండి!



కైలాసనాథదేవాలయప్రాకారం లోపలినించి



కైలాసనాథదేవాలయం


కాంచీపుర పల్లవ శిల్పాలు

[కాంచీపురంలోని కైలాసనాథదేవాలయం పల్లవరాజు నాటి శిల్పవైభవాన్ని చాటుతుంది ఇక్కడి ఛాయాచిత్రాలుతీసి శిల్పకళను స్థిరీకరమొనర్ప ప్రయత్నిస్తున్నారు ఛాయాచిత్రకార ఛాయాచిత్రణ మొనర్చారు ఈ చిత్రాలలో ఇంకా కొన్ని


గంగాధరేశ్వర



శివతాండవము








- కంచి

కైలాసనాథ దేవాలయ ప్రాకారం - బైటినుంచి

- కైలాసనాథ దేవాలయం


ాలు చాలా చెక్కు-చెదిరిపోయిఉన్నాయి. ప్రభుత్వంవారు కూడా, ఇప్పుడిప్పుడే ఈ శిథిలాలకు
బి. రంగనాథంగారు ఈ దేవాలయంలోని విగ్రహశిల్పాలను చాలా జాగ్రతతో
ఎపోయినవి. వాటిని పై వారం ప్రకటించగలము—సం]

ఊర్ధ్వతాండవము



★

నృత్యభంగిమము



సినిమా

రాగిణీవారి

తిరుగుబాటు

★



'తిరుగుబాటు'లో నాయకభూమికను నిపుణంగా నిర్వహించిన సి. హెచ్. నారాయణరావు.

రాగిణీఫిలింస్‌వారిచే శోభనాచలస్టూడియోస్‌లో తయారుకాబడిన తెలుగు చిత్రం. దర్శకులు శ్రీ పి. పుల్లయ్య. కథకులు శ్రీ పి. చెంగయ్య. మాటలు పాటలు శ్రీ సముద్రాల. ఛాయాచిత్రణం శ్రీ బి. యస్. రంగా. సంగీతం శ్రీ భీమవరపు నరసింహారావు. శబ్దగ్రహణ శ్రీ సూర్యనారాయణ. డిస్ట్రిబ్యూటర్లు చమ్రియా.

నటీనటకులు : శాంతకుమారి, కృష్ణవేణి, కనకం, లలిత, పద్మిని, నారాయణరావు, ముక్కామల, పంతులు, భీమవరపు నరసింహారావు వగైరా.

ఈచిత్రం ప్రివ్యూ ఆదివారంఉదయం అశోక్‌టాకీస్‌లో చూపబడింది.

కథ సర్వసామాన్యమైనదే. మధ్యతరగతికి చెందిన ప్రసాద్ (నారాయణరావు) మైకాగనులు త్రవ్వించడానికి తన యావత్తు సంపదను వెచ్చించినా మైకా దొరకలేదు. త్వరలోనే గృహాన్నికూడా కోలుపోయి భార్య ఆనందమయి (శాంతకుమారి), ఇద్దరు బిడ్డలతో (చిరంజీవులు మల్లిక ; సుమిత్ర) చిన్నతనంనుంచీ తనను తనకుని పెంచిన వెంకన్న (శాస్త్రి) ఇంటికి వెళ్లి అక్కడ ఆశ్రయం పొందుతాడు. పలుగు తీసుకుని స్వయంగా గనిలో ప్రవేశించి త్రవ్వనారంభిస్తాడు. కాని శ్రమ వ్యర్థమౌతుంది. నిద్రాహారాలను మాని వేసిన భర్తవ్యథ చూసి భరించలేక ఆనందమయి వెంకన్నసహాయంతో గనిలో ప్రవేశించి త్రవ్వనారంభిస్తుంది. శీలవతి అని పేరు తెచ్చుకుని ఊళ్ళోని అందరి ఆదరణకూ పాత్రురాలైన ఆనందమయి చెయ్యి పడగానే మైకా లభిస్తుంది. దానితో ప్రసాద్ కోటీశ్వరు డౌతాడు. భాగ్యలాభంతోపాటు దుర్వ్యసనాలు అలవడతాయి. మగవారి అడుగులో ఉండకూడదనీ నాట్యకళకే జీవితాన్నంతనీ వినియోగించాలనీ నిర్ణయించుకుని భాగ్యవంతుని అండకోసం వెదుకుతున్న అనూరాధ (కృష్ణవేణి) వలలో ప్రసాద్ చిక్కుకుంటాడు. ఆమెను వివాహం చేసుకుంటాడు. అనూరాధ ఇంటికి చేరగానే ఆనందమయిజీవితం దుఃఖమయమవుతుంది అవమానాలను సహించలేక, భర్త హెచ్చరిస్తున్నా వినక అతనిపై తిరుగుబాటు చేసి బిడ్డలతోసహా ఆనందమయి ఇల్లు విడిచి మద్రాసు చేరుతుంది. అక్కడ ఒక న్యాయాధికారిఅనుగ్రహంవల్ల అనాథ శిశుశరణాలయంలో సంరక్షకురాలుగా చేరుతుంది. తిరుగుబాటు చేసిన భార్యను సాధించడానికి గుమాస్తా శంకరం (ముక్కామల కృష్ణమూర్తి) సలహాప్రకారం బిడ్డల్ని స్వాధీనపర్చాలని ప్రసాద్ కోర్టులో దావా తెస్తాడు. ఇంట తిరుగుబాటు చేసినా ఇంటి వ్యవహారాలను చక్క దిద్దడం చేతగాలేక ఆనందమయి బిడ్డల్ని తండ్రి కొప్పగిస్తుంది. తల్లికోసం బెంగపెట్టుకున్న బిడ్డల్ని సముదాయించలేక వారిని హింసించీ, అనూరాధ స్వతంత్రప్రవృత్తికి సహించలేకనూ దుర్వ్యసనాలకు లొంగిపోయి ప్రసాద్ రోగపీడితు డౌతాడు. అది క్షయరోగమని తెలుసుకున్న అనూరాధ ఇంట్లో నిలవదు. వాస్తవంగా వారిద్దరూ ఎన్నడూ ప్రేమించుకోలేదనీ, తన యౌవనాని కాశించి అతడూ, అతని ధనానికి ఆశించి తానూ వివాహంచేసుకున్నారనీ ప్రసాద్‌కు అనూరాధ నిష్కర్షగా చెప్పి చేజిక్కిన ధనాన్ని నగలరూపంలో తీసుకుని వెళ్లిపోతుంది. చివరికి అతని సంరక్షణకోసం అతనికి తన రక్తా

(39 వ పేజీ చూడుడు)

మేళకర్తలు: కర్ణాటక-ఔత్తరాహికవిధానములు

శ్రీమతి జె. కమలాదేవి

హిందూదేశపు సంగీతము శాస్త్రము, కళయు, రెండును కూడ నగును ఈ విధానమును చక్కగా గమనించి పరిశీలించినచో నందలి క్రమబద్ధతయును, గణితవిధానమును తెలియగలవు. హిందూసంగీతవిధానమంతయును అందలి రాగముల విధానముపై నాధారపడియున్నది. మనము "రాగము" అనుదానిని క్రమబద్ధమగు నొక మధురతరమగు నతిరంజనాస్పదమగునది యని చెప్పదగును అది క్రమబద్ధమగు ఒకానొక మేళము (లేక) ధట్ యొక్క శృతుల ననుసరించి నియమబద్ధమగు మూర్ఛనాస్వరముల యొక్క విస్తరణ ఇదియే రాగము అనబడును.

"మేళకర్తలు" లేక "ధట్సు" అనునవి వాడుకలో గల యనేక రాగములను ఉత్పత్తిచేయగల "జనకరాగములు" అనగా (*Parent or Root Ragas*) అని చెప్పబడును. హిందూస్థానీగాన పద్ధతిలో నీ మేళకర్త అనుదానికి "ధట్" అని చెప్పుదురు. కర్ణాటకగానవిధానమందు "మేళకర్త" లేక "మేళము" అని చెప్పుదురు "ధట" అనునది సంస్కృతపదము కాదు. ఇది యొక ప్రాకృతభాషాపదము. (*Mould* అచ్చు అని యర్థము నిచ్చును.) ఒక (మేళకర్త) లేక జనకరాగము (ధట్) క్రమబద్ధమగు ఆరోహణ. అవరోహణక్రమముగల నియమబద్ధములగు సప్తశృతులు (స్వరములు) కలిగియుండును. పాశ్చాత్యగానపద్ధతిలోని "*Mode*" అను నొక విధానమువలెనుండి యొక స్థాయియందలి వివిధస్వరముల యంతరములను (*Intervals* భేదములను) పరస్పరము తెలియజేయుచు నుండును.

జనకరాగములు (లేక ధట్సు *Thats*) అనువాటియొక్క సంఖ్యాపరిమితి బహువిధములుగా పూర్వప్రసిద్ధ గ్రంథకర్తల యొక్క అభిప్రాయానుసారము వేరువేరుగా చెప్పబడియున్నది. "చతుర్దండిప్రకాశిక" అను సంస్కృతగ్రంథకర్తయగు "వెంకటమఖి" యనువారు. 72 మేళకర్తలు మాత్రమే సంభవములగునని చెప్పియుండిరి. "సంగీతదర్పణము"నందు ఆరింటిని మాత్రమే చెప్పబడెను సోమనాథుని "రాగవిబోధ"మందు 23 మేళములే చెప్పబడెను. రామామాత్యుని "స్వరమేళకళానిధి"యందు 20 మేళములు చెప్పబడెను. తులజాజీమహారాజుని "సంగీతసారామృత"మను గ్రంథమున (వెంకటమఖి చెప్పినప్రకారమే) 72 మేళకర్తలను ("ధట్సు")ను చెప్పియున్నది.

ఒక మేళకర్త (ధట్)యందు ఈ క్రింద చెప్పబడిన నియమములు గమనింపబడవలయును (*Gamut*) అనగా "గ్రామము" (లేక "సప్తకము')నందలి సప్తస్వరములనన్నా కలిగియుండవలెను ఆ సప్తస్వరములున్నా క్రమబద్ధముగా ఆరోహణ, అవరోహణక్రమములో పాడదగియుండును. మరియును మేళకర్తయందు స్వరము వక్రగతిలోగాని, విరోధభావములతోగాని ఉండకూడదు. ఈ స్వరములు వరుసగా "స రి గ మ ప ధ ని స̇" అని ఆరోహణమందును, "స̇ ని ధ ప మ గ రి స" అని యవరోహణమునందును క్రమబద్ధముగా రావలయును "మేళకర్త" అనుదానికి ప్రత్యేకముగ నెట్టి రంజనాయుతమగు అలంకార విశేషములు (*Beauties*) గాని అవసరము లేదు. అనగా "మేళకర్త" యనునది ప్రత్యేకముగా నా మేళమందలి విధాయకస్వరములను నిశ్చయించుటకొఱకై ఉద్దేశింపబడియున్నది. హిందూస్థానీగానవిధానములో "ధట్" అను నామాంతరమును ముందు ముఖ్యరాగముయొక్క పేరును చెప్పి దాని వెంటను "ధట్" (లేక మేళము) అని కలిపి చెప్పుదురు. ఉదాహరణముగా యమన్ (కల్యాణి) అనుదానికి "యమన్ ధట్" అనియు, *బిలావీల్ రాగమునకు "బిలావల్ ధట్" అనియును; ఇట్లే కర్ణాటకగానవిధానమందు "కల్యాణిమేళము"; "శంకరాభరణమేళము" మొదలుగా నన్నిటికిని చెప్పబడును. ఈ మేళకర్త (ధట్) యను ప్రతిదానియందును ఆయానియమితస్వరక్రమ మూర్ఛనావిధానముగ కొన్ని జన్యరాగములు (*Secondary Ragas*) పుట్టుచున్నవి. మరియును స్వరములను వక్రగతుల ననుసరించి ప్రస్తార మొనర్పగా ననేకవక్రరాగములు జనించుచున్నవి

పూర్వము కనుగొనబడిన స్వరమూర్ఛనావిధానమును "గ్రామములు" అని యందురు. అవి వరుసగా షడ్జ; మధ్యమ ; గాంధార ; గ్రామములని చెప్పబడియుండెను. ఈ మూడుగ్రామములును స్థాయియందలి స్వరముల భేదక్రమము ననుసరించి స్వరమూర్ఛనావిధానమువల్ల ఏర్పాటు కాబడినవి. ఈ స్థాయియందలి స్వరముల భేదక్రమము ననుసరించిన విరామములే (*Interval s* "శృతులు" అని చెప్పబడినవి వరుసవెంబడి వచ్చెడు రెండుస్వరములమధ్యగల విరామమే "శృతి" యనబడును. పూర్వాచార్యులు ఎట్టి ఉపకరణవిధానముగాని లేక నితరసహాయముగాని లేకుండగనే కేవలము వారి జ్ఞానము ననుసరించియే ఒక స్థాయియందు 22 ద్వావింశతి శృతులు (*Intervale:* విరామములు) కలవని నిర్ణయించియుండిరి.

(స్వరాష్టకము) 8 స్వరములుగల యొక స్థాయిని హిందూసంగీతమందు "సప్తకము" అని యందురు. (మొదటిది గాక తిరిగి చివరను వచ్చు పై స్థాయి (తారి) షడ్జమును విడిచి లెక్కించుచుండవలెను) అనగా నొక స్థాయిలోని స్వరములను షడ్జము మొదలు ప్రారంభించి తిరిగి పై స్థాయిలోనికి చేరువరకు గల స్వరములను "స్వరసప్తక"మందురు. ఎనిమిదవదియగు పై షడ్జము మరల పై స్థాయికి ప్రారంభ (*Key - vote*) మగుచుండును. హైందవులు దీనిని "సప్తక" మందురు. సంగీతకళావేత్తలగు పూర్వులు తమ విజ్ఞానమువలన నీస్థాయి యందుగల శృతులు (*Intervals*) అన్నిటిని ధ్వని ప్రామాణ్యమునుబట్టి 7 భాగములుగా నొనర్చి వాటికి స్వరసప్తకము" అని పేరిడి యుండిరి.

ముందు చెప్పబడిన 22 ద్వావింశతి శృతులు (విరామములు)నన్నా షడ్జ; మధ్యమ ; గాంధార ; ములను మూడు గ్రామములయందును వరుసగా గల 7 భాగ

ములకునూ "స, రి, గ, మ, ప, ధ, ని," అను నామాంతరముగల సప్తస్వరములకునూ విభాగించియున్నారు. ఆ విధాన మీ క్రింద క్లుప్తముగా చూపబడును

గ్రామములు	స-రి-గ-మ-ప-ధ-ని (శృతులు)
షడ్జగ్రామం	4-3-2-4-4-3-2 = 22
మధ్యమగ్రామం	4-3-2-4-3-4-2 = 22
గాంధారగ్రామం	3-2-4-3-3-3-4 = 22

షడ్జగ్రామము, మధ్యమగ్రామములు రెండును (12వ శతాబ్దము) కాలమువరకు అనగా శార్ఙ్గదేవుని "సంగీత-రత్నాకర" గ్రంథకాలము వరకునూ ప్రచారములో నుండి యున్నవి గాంధారగ్రామము అనునది (అందరు గ్రంథకర్తల అభిప్రాయానుసారముగను) స్వర్గలోకమందు మాత్రమే కలదని చెప్పబడియుండెను మధ్యమగ్రామముకూడను అప్పటినుంచియు క్రమేణ వాడుకలోనుంచి తొలగియుండెను (కొందరి యభిప్రాయానుసారము ఈమధ్యమగ్రామము కూడ నిప్పుడు వాడుకలో గల దందురు).

ఇటుతరువాత అందరు గాయకులకునూ శుద్ధస్వరములతో కూడినట్టిదగు "షడ్జగ్రామ మొక్కటియే ఆచరణయోగ్యమై పరిణమిల్లెను. దీనినే "ధీరశంకరాభరణము" అని కర్ణాటకగానపద్ధతియందును, "బిలావల్" అని హిందూస్థానీగానవిధానమందును చెప్పుదురు పాశ్చాత్యగానవిధానమునకు కూడ నిదియే ప్రాతిపదిక యయ్యెను. (*The Dioctoiemaj or scale of the west*).

గ్రామముల నిర్ణయానంతరము వరుసగా స్వరసప్తకమును మూర్ఛనావిధానముగా ప్రస్తారమొనర్చి రాగముల నుత్పత్తిచేయుటయగును. ఇందుకొరకై, పూర్వాచార్యులు (*Arcievt an thous in Music*) ప్రతిగ్రామమునకును సప్తమూర్ఛనల నేర్పరచియుండిరి ఈ మూర్ఛనల మూలమున వివిధరాగముల నుత్పత్తిచేయుటకనకూలత కలిగెను. మూర్ఛన యనునది "సంగీతదర్పణ"మను గ్రంథమందు చెప్పుటలో స్వరసప్తకమును వరుసగా నారోహణక్రమముగా పెంచుటగాని, అవరోహణక్రమములో దిగివచ్చుట (తగ్గి)గాని, "మూర్ఛన" యని చెప్పియుండిరి. ఇట్టి మూర్ఛనలవలననే ప్రకృత, వికృత స్వర ప్రయోగములు కల్పింపబడి, అట్టి శుద్ధ (ప్రకృత) వికృతస్వరముల (*Couelewation* కలయిక) సంపుటీకరణమువల్ల అందరు గ్రంథకర్తలునూ మేళము లనబడు జనకరాగములను పేర్కొనియుండిరి

హిందూదేశసంగీతవిధానములో స్థాయి యందు (22) ద్వావింశతిశృతులు (*Intervals* విరామములు)గా విభాగ మొనర్పబడియుండినప్పటికినీ, వాటి నన్నిటిని కూడ ప్రస్తుతవిధానములో 12 ద్వాదశ శృతులలోనే ఇమిడ్చియున్నారు. స్వరము అనినను, శృతి యనినను (*Idevtical*) అవినాభావసంబంధముగలవి గాకపోయినను, "శృతి"యనగా "స్వరము"అను నర్థములోనే వ్యవహరించుచున్నారు. అందువలన పైన చెప్పబడిన 12 శృతులున్నూ, (వేర్వేరు నామములు గలిగిన్నీ 12 స్వరములు అని చెప్పదగును. ఈ ద్వాదశవిరామములు (12 *Intervals*) శృతిసంభవమగు (సంగీతధ్వని) నాదమే. అన్నివిధములగు సంగీతవిధానములకుగూడ నాధారము (పాక్‌పశ్చిమదేశ సంగీతవిధానములకుకూడ నిదియే మూలమగుచున్నది. ఈ ద్వాదశశృతులయొక్క ప్రస్తారక్రమవిధానమును హైందవసంగీత కళావేత్తలు బాగుగా గుర్తించిరి అందుపై వారు శాస్త్రబద్ధమగు నొకవిధానము నేర్పరచి సప్తస్వరములవలనను (72) డెబ్బది రెండు విధములగు మార్పులగు రాగవిధానమొకదానిని కనుగొని వాటిని జనకరాగములు లేక "మేళకర్తలు" అని పేర్కొనియుండిరి తరువాత మరల వీటిని అన్నిటికిని ఆయామార్పులనుబట్టియును, ఋతువుల ననుసరించియు, వాటివాటి క్రియల ననుసరించియును, కాలనియమములనుబట్టియును, వాట్లను విభజించి తగు నామములను నిర్దేశించియుండిరి మరియు నీ మేళకర్తల విధానమంతయును ఒక క్రమబద్ధముగ నొనర్చి ఆయా రాగములకు నియమప్రకారముగ చక్రములను, సంఖ్యలను అమర్చియుండిరి. దీనినే కటపయాది సూత్రమని యందురు. ఈ సూత్రము ప్రకారము ఆయా రాగముల (మేళముల) సంఖ్యలను కనుగొనవగును. హిందూదేశసంగీతవిధానమునందు ఇది గొప్పవిశేషమగు విజ్ఞానసూచకమగు విధానము. తరువాత నన్నిదేశ సంగీతవిధానములకుగూడ నిదియే దారి జూపియున్నది.

ఇట్లేర్పడిన 72 మేళములయందు న పాశ్చాత్యులు 3 మూడింటిని మాత్రమే అనసరింపగలిగియుండిరి. మిసెస్ కజిన్సు అనా మె ఇట్లు చెప్పెను. (*"All western Music is formed from Dhira Sankarabharanam; Keeravani; and Cowrimanohari ragams according to the South Indian Tecominology (ice) The major scala, The HormonicScals, and the melodi minor Scale"*) అనగా పాశ్చాత్య సంగీత విధానమంతయును దక్షిణభారతసంగీత పరిభాషావిధానము ననుసరించి ధీరశంకరాభరణము (29); కీరవాణి (21), గౌరీమనోహరి (23) అను రాగముల (మేళకర్తల) మీదనే ఆధారపడియున్నది. అనగా నివియే వరుసగా (*Major Scale, Hormonic Scale, minor Scale*) అని చెప్పబడుచున్నవి.

పైన చెప్పబడిన ద్వాదశ (12) (విరామములు (*Intervals*) శృతులను వివరింపగా నందు శుద్ధస్వరములు 7 న్నూ వికృతిస్వరములు 5 న్నూ ఉండును ఏడు శుద్ధస్వరములు- స - రి - గ - మ - ప - ద ని -లున్నూ, అయిదు వికృతస్వరములు కోమల రిషభ, గాంధార, దైవత, నిషాద, తీవ్ర (ప్రతి) మధ్యమములునూ - మొత్తముమీద అందరు సంగీతకళావేత్తలునూ రిషభ, గాంధార, దైవత, నిషాదములయొక్క మూడు భేదములనున్నూ, మధ్యమముయొక్క రెండు భేదములున్నూ; మొత్తము 16 టినీ కూడను ఒప్పుకొందురు కాని ఈ 16 న్నూ - రిషభ, గాంధారములలో నామాంతరములచే పిలువబడుటచేతను, దైవత, నిషాదములలో గల నామాంతరములచేతను 12 టిలోనే ఇమిడ్చియున్నారు. ఈ 12 స్వరములవలనను ప్రతిదానియందును, సప్తస్వరములు గల (22 శృతులతోకూడిన) 72 విధములగు భేదము లేర్పడియున్నవి. అన్నిటియందును స, ప లు రెండును సమముతే (భేదరహితములు). ఈ మేళకర్తలు రెండు విభాగములుగా విభజింపబడినవి. అందు శుద్ధ మధ్యమము ఒక భాగమందును (పూర్వమేళములయందు), తీవ్ర అను ప్రతిమధ్యమము రెండవభాగమందును (ఉత్తరమేళములయందును) వచ్చును

గ్రామమనబడుదానియందు గల 8 స్వరములునూ (స్వరాష్టకము) రెండుభాగములుగా నొనర్పబడియెను. "స, రి, గ, మ"

(39 వ-పేజీ చూడుడు)

కామరూప్ కొండజాతులు

(అస్సాం)

శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య

కామరూప్ నేటిఅస్సాముకు మొదటిపేరు. ఇదిమన సరిహద్దురాష్ట్రము. రాబోయే యుద్ధపు అగ్నిజ్వాలలు మొదట ఇచ్చటనే రగులుకొనగలవని సైనికకోవిదుల నిశ్చితమైన అభిప్రాయము. ఆయుద్ధం వచ్చినా రాకున్నా ఈనెలప్రారంభంనుండి ఈ పరిహద్దులో మండుచున్న మతదావానలానికి కాలుచున్న ఇండ్లకు వ్యవధీ విరామం లేకుండా ఉన్నది రైళ్లనిండా ఎదురెదురుగ ప్రయాణము చేయుచున్న హిందూ ముస్లిం కాందిశీకుల జీర్ణశరీరములే నిరంతరము కానుపించుచుండును

అసమంగా కొండలు లోయలు కలిగి ఉండబట్టి అస్సాం అనే పేరు వచ్చిందని కొందరి అభిప్రాయం. కామరూప్, ప్రాగ్జ్యోతిష. అసమ్‌తాత్, కామాఖ్య మొదలగునవి అస్సాముకు ఇతర పేర్లు. టిబెట్టు, భూటాన్, బర్మా, పాకిస్థాన్‌దేశాలు అస్సాముకు ఇరుగుపొరుగులు. ఎర్ర చీనా ఇక్కడికి నూటయేబదిమైళ్లే. సరిహద్దు ప్రాంతంలో ఎటు చూచినా మహోన్నతమైన పర్వతములు, వాటిపైనఆకాశాన్ని భేదించుచున్న పొడుగైన దేవదారుతోపులు వాటిపై 'కా' 'కా' అని కఠోరముగ రొదచేయుచు వలయములుగ తిరుగుచుండు కాకుల సంతానములు అచ్చటచ్చట శిఖరపార్శ్వముల నంటుకొని బారులు తీరియున్న ఘూర్కాపటాలముల సిరంగివరుసలు, చీమలబారులవలె కొండలపైకి ఎక్కుచు దిగుచుండు మిలిటరీ సివిలుమోటార్లు, లారీలు, చూపరులకు ఆనందానికన్నా భయాన్నే కలిగించగలవు.

రాళ్లతో కట్టని ఇండ్లు, నిరంతరం మూసియుండే వాకిళ్లు, పతులకన్న పదింతలువృద్ధులైన సతులు, మదమాంసాలను మక్కువతో ఆరగించే మఠాధిపతులు, మత్స్యములను కూరగాయలక్రింద జమకట్టుచుండు బ్రాహ్మణోత్తములు, మాంత్రికులు, ఒక విధముగ కనిపించు స్త్రీ పురుషులు శాతబోడులు, ఖడ్గమృగాలు, భయంకరమైన లోయలు నరబలులు, అస్సాములోని ముఖ్యవిశేషాలు. ఇచ్చట అడవిజాతులు నరకాసురుడు, బాణాసురుడు, ఘటోత్కచుడు, హిడింబి తమ ఆదిపితలని ఊహించుతుంటారు. శివుని మూడవ నేత్రానికి కామదేవుడు బలియైనది గౌహతికి అంటుకొని పారుచున్న బ్రహ్మపుత్రానదికి అవతలి ఒడ్డున్నే. నరకాసురుణ్ణి వధచేయుటకు వచ్చిన కృష్ణుని గుర్రాలు ముందురాత్రి అలుపుతీర్చుకున్నది ఇక్కడనే అని స్థలపురాణము.

అస్సాములోని ముఖ్యమైన అడివిజాతులు, తలలువరికే నాగాలు, కచారీలు ఆడంగులవలె అందమైన మాతులుగల ఖాసీలు, ఆడువెత్తనానికి మొదటినుండి అలవాటుపడ్డ మికీరు, పాట్లిగాను, తల్లిపాలుతప్ప మరేపాల రుచీ ఎరుగని గారోలు, మీజీలు, మిష్మీలు, మొంబాసులు. సాదియాప్రాంతంలో ఉండే మిష్మీ ప్రజలు తమరాజు భీష్మకుని కుమార్తె రుక్మిణిని తీసుకొనిపోయినపుడు తప్పించి రాజమర్యాదను కాపాడలేకపోతిమనే కించతో ఇప్పటికీ ముంగురులను అవమానచిహ్నముగ కత్తిరించుచుంటారు. పరశురాముడు తల్లిని చంపిన పాపాన్ని కడుగుకొన్నది ఇచ్చటి బ్రహ్మకుండంలోనే. నమస్కరించవలసినపుడు కుడిమోచేతిని ఎడమచేతితో లేవనెత్తి "కర్‌దోమ్" అంటారు.

అస్సాం జనసంఖ్య 70 లక్షలు విస్తీర్ణము 6600 వేల చదరపుమైళ్లు. అందులో మూడవవంతు అడివిజాతులు. మొత్తం రాష్ట్రంలో రెండుభాగాల దేశాన్ని వీరు ఆక్రమించుకున్నారు. చాలమంది వీరిలో క్రైస్తవులైనారు. మిషనరీల పలుకుబడి ఈప్రాంతాల్లో ప్రభుత్వం మారినప్పటికి కించిత్తైనా తగ్గలేదు అడివిజాతుల నివాసప్రదేశాలలో ఒక భాగము గవర్నరు స్వంత అధిపత్యంక్రింద ఉన్నది. శాసనసభకు మంత్రులకు వీరిపైన ఎట్టి అధికారము లేదు. ఢిల్లీప్రభుత్వమే ఇచ్చటి ఆయవ్యయాలను భరిస్తూఉంటుంది. ఇచ్చటికి ఎవరంటే వారు ఎప్పుడంటే అప్పుడు పోవీలులేదు. గవర్నర్లు అపుడపుడు పోయి వారిని ఆడించి పాడించి విందులు చేసి, బహుమతులు పంచి సంతోషపెట్టుతుంటారు. ఈప్రాంతప్రజాతుల పూర్వపు పౌరుషాలు, మొదటి మోటుతనము, వెళసరపుమాటలు, క్రూరచూపులు మునుపటివలెనే ఉన్నవి. అందుకనే పాలిని నాజాకుగా పట్టుకొనివస్తున్నామని ప్రభుత్వాలు పూర్వము ఇప్పుడుఅంటున్నాయి. ఎన్నాళ్లు ఇట్లు వారిని ఉంచదలగారనే ప్రశ్న ప్రజలు అడుగకపోలేరు.

నాగుల్గ్రామాలు చిన్న చిన్నవి ఇరవై ఇండ్లు ఉంటే ఎక్కువ. వెదురుగొంగు కూచాలమీద భూమికి నాలుగైదు అడుగుల ఎత్తులో కొయ్యలతో ఇండ్లు కడతారు. ఎటుచూచినా కొయ్యే. ఇటుక సున్నము కొండల్లో కనుపించవు. సముద్రప్రదేశాల్లో నివసించే ప్రజలందరు అడివిజాతులతో సహా వైవిధముగ భూమిలో కొయ్యలు నాటి వాటిపైన లేపైన కూచాలనాటి వెంకుకప్పుతో ఇండ్లు కట్టుతారు. గోడలకు బదులు వెదురు తడికలు కట్టి రెండుప్రక్కల సున్నంగాని మట్టిగాని అరచేతిమందంగా పూస్తారు. ఇందులోనే కిటికీలు, తలుపులు, స్నానపుగదులు వంటయిండ్లు. అస్సాంలో భూకంపాలు హెచ్చు అందువల్లనే ఇంత సుళువైన, చౌకయిన లేపైన ఇండ్లు. మికీర్లు, నాగాలు, ఖాసియాలు నెలకొకసారి స్నానంచేస్తే హెచ్చు. ఒకసారి కట్టిన గుడ్డ చినిగిపోయినప్పుమాట విడువవలసిందే. ఇండ్లక్రింద ఉన్న ఖాళీస్థలంలో పందులు పసువులు పొర్లాడుతుంటాయి. మన్నెప్రజ్వరాలు, కుష్టు, యాజ్‌వ్యాధులు పల్లెపల్లెనా తాండవమాడుతుంటాయి.

ఆసుపత్రులు ఎక్కడైనా నూటికి కోటికి ఉంటే ఎక్కువ. ఎవరికి కావలసిన వస్త్రాలను వారే చెట్ల బెరడు నానబెట్టి చేసిన నారతో చేసుకొని జాబురాయి మొదలగు అడివి విత్తనాల ఎరుపు నలుపు రంగులలో అద్ది ధరిస్తారు. ముఖాన్ని మాత్రం చూచి ఆడ మగ భేదాన్ని కనుక్కోవడం దుర్ఘటం. మీసాలు మొలవవు. మొలిచినా అంతబాగా కనపడవు. ముఖాలు గుండ్రముగా కుదించినట్లుంటాయి. వయస్సు కనిపెట్టడం మనతరం కాదు. చేతులు, పిక్కలు, కండలు తిరిగి తెల్లగా ఉంటాయి. ఎంత పెద్దకొండలైనా పాతాళాన్నుండి సునాయాసంగా ఒడుదుడుకుగా ఉన్న కొండ ఎక్కి బరువంతా నొసటికి బరువుకు బిగించుకున్న సన్నని గడ్డిపట్టా మోపుమీద తీసుకొనివస్తారు. కండ్లు చిమకండ్లైనప్పటికి ఎంతదూరమైనా చూచి విల్లంబును ప్రయోగించుతారు. పిల్లకాయలు కూడా కత్తులు విల్లంబులు బుజాలకు తగిలించుకొని తిరుగుతుంటారు. మిక్కిలి నృత్యంచేసేది యీ నాగుల వలె కర్మాంతరములలోనే.

అడివిజాతుల సేద్యం ఇతరఆదివాసుల వలెనే అనకోతగినంత కాదు. పశువులు మన దూడలంత ఉంటాయి. ఆవులు అట్టే పాలివ్వవు. ఇచ్చినా ఆదివాసులు త్రాగరు. నెయ్యి, వెన్న, మజ్జిగ ఇచ్చుట అపరూపము. కులపెద్దలు ఎన్నడో వీటిని దేవుడికి సమర్పించారట! అడివిలోకి వచ్చి దేవతలు త్రాగిపోతారట! ఆవులను మిథూనులని పిలుస్తారు. ఒకటిమొదలు పది మిథూన్లవరకు కన్యాశుల్కానికి చెల్లించి ఇంటిపనులు చక్కగా జరుగుటకై కొడుకులకన్న పెద్దవారైన కోడండ్లను కొంటుంటారు. ఆవునుబట్టే ఐశ్వర్యాన్ని నిర్ణయిస్తారు. రొక్కమార్పకం ఎటువంటిదో ఎరుగరు. మిక్కిలి తప్ప మిగతా వారంతా గోమాంసభక్షకులే. ఎద్దులు వంటయింటికే కాని వ్యవసాయానికి పనికిరావు. స్త్రీలు తాళికట్టరు. విశాలమైన నుదుట కుంకుమ పెట్టరు. చతికిలబడి కూర్చొరు. గవిరెలను ధరించరు. మొలకు ఒకేవార గుడ్డ చుట్టుతారు. మెడలో పూసలు, తలలో రెక్కలు గుచ్చుకుంటారు. కొందరు పయోధరముల చుట్టూ జానెడ గుడ్డ చుట్టుకుంటారు. వెంట్రుకలను తలపైకి తోసి ఋషులవలె నడినెత్తిమీద చుట్టలు చుట్టుతారు. స్త్రీలు ఇంటింట పట్టును, దూదిని కదుళ్లతో వడికి నూలు తీస్తారు. నీలిఆకు జాబురాయిరంగుల్లో ముంచి మూరెడు వెడల్పు మగ్గాలను నడుముకు గోడకు బిగించుకొని తీరిక కల్గినప్పుడల్లా నేస్తుంటారు. ఈ ఎండి పట్టుబట్టలను, శాలువలను అందంగా నేసి పట్టణాలకు పంపించి అమ్ముకుంటారు. నశిమిపాపట తీస్తారు. చెవులకు పెద్దపెద్ద తొర్రలు చేసి బీహారుదేశపు ఊరాన్నవలె ముండాలవలె, మలబారువారివలె బంగారైన గోపురాలవంటి వెండి గుబ్బలను తగిలించుకుంటారు. వెదురు బొంగులలో మంచినీరు తెచ్చుకుంటారు. కుండలు వాడరు. స్త్రీలు పురుషులు పంట్లకు దాచినపొడి పట్టించుకుంటారు. బిడ్డలను జోలెల్లో పెట్టుకొని చీనాస్త్రీలవలె ఎల్లప్పుడు వీపులకు కట్టుకొని అన్ని పనులు చేసుకుంటారు. నొసటినుండి గడ్డమువరకు నిలువున నల్లనిగీరను పచ్చబోసుకొంటారు.

ఇచ్చటి ఆదివాసులలో కష్టపడేది స్త్రీ; సుఖించేది పురుషుడు. ఇంటిచుట్టూ చెట్లకి పెరిగి కాచే అరటిపండ్లను, కమలాపండ్లను భార్య కోసి ఏరి బుట్టలకు పెట్టినపిమ్మట కొండదిని భర్త పట్టణానికి మోసి అమ్మకొన్ని ఇల్లాలికి అప్పచెప్పి వెనుకప్రక్క చుట్టత్రాగుతూ వచ్చే పొయ్యేవాండ్లను మౌనంగా చూస్తుంటాడు. వెంట్రుకలను కత్తిరించడు. నొసటిపైన గొరిగిస్తాడు. గోలాంగూలమువలె ముందు వెనక వ్రేలాడు గోచిమినహా వస్త్రములను ధరించడు. పొడుగైన వాడియైన మొరటుకత్తిని అరక్షణమైన విడిచిపెట్టడు. మిషనరీలిచ్చిన పాత బొంత చొక్కాలను గోచులపైన తొడుగుకొని నీటుగా నడుస్తారు.

ఒక్కొకప్పుడు చంటిబిడ్డలైన 'భర్త'లను ఎత్తుకొని తిరుగు ఎద్దులవంటి పెండ్లాలను చూడగలము. నిద్రమత్తులో మైమరచిన మొగుణ్ణి ఎంత ఎక్కినపిమ్మట భార్య లేపేది కాలితోనే. అరకపెట్టి గున్నెపని తాతలకాలంనుండి ఇచ్చట ఆదివాసి ఎరుగడు.

నాగాలలో పొలిమేరతగవులు తరుచు. ఒక్కొకసారి గ్రామాలుగ్రామాలే యుద్ధానికి సన్నద్ధులై తుపాకులను విల్లంబులను పట్టి వెలలు ఒకరిపైనొకరు ప్రయోగిస్తారు. ఎన్ని తలలు నరికితే అంత పౌరుషవంతుడని లెక్క. అటువంటివానినే ఏరికోరి వివాహమాడుతారు అందమైన నాగాయువతులు. కొండనాగాలలో స్త్రీలు పురుషులు ఇంకను దిగంబరులుగా తిరుగుతుంటారు. వారిని పలుకరించినా ప్రమాదమే. వీరిలో ఐదవ వంతు క్రైస్తవమతస్థులు. నాగాల నివాసస్థానము బర్మాసరిహద్దులోని నాగాకొండలు. బర్మాలోని వీరి యిరుగుపొరుగువారైన బర్మా ఆదివాసులతో అస్సాంపొలిమేరఆదివాసులకు సంబంధబాంధవ్యాలున్నవి. బ్రిటిషు ప్రభుత్వము గీచిన గిరికి ఇరువురు ఇంతవరకు లోబడియుండలేదు. బర్మాలో రేగిన తుపాను అస్సాముకు తగులకపోదు. అస్సాములో లేచినమంటలు ఇండియాను ఆక్రమించకుండ ఉండవు.

అస్సాముసరిహద్దులలో చీమలు దూరని చిట్టడవులు, కాకులు దూరని కారడవులు హెచ్చుగా నున్నవి. నిలువెత్తు గడ్డిపొదలలో దాగిన ఖడ్గమృగాల్ని దట్టమైన చెట్ల నీడల్లో నిశ్చయముగ నిద్రించు పెద్దపులిని కొండలవలె పెరిగిపోయిన పుట్టలలో పండుకున్న నాగేంద్రుని అరిపువల్ల కరుపువల్ల కనుగొనవలసినదే. ఇంతటి కీకారణ్యములు, ఎత్తైన మహావృక్షములు, భయంకరమైన అడివి జాతులు నవీనభారతములో మరెచ్చటను కనపించవు. ఇప్పటికీ గ్రామాలలో వ్యాపించే వ్యాధులు ఎవరో విరోధులు మంత్రించి పంపించారనే నమ్మకాలు పోలేదు. క్రొత్తవారెవరైన కంటబడ్డా లేక గ్రామతాంత్రికుడు ఎవరిపేరైన శకము పెరిగి చెప్పినా ఊరంతా అతన్ని వేటాడి పట్టుకొనివచ్చి గ్రామదేవతకు బలియిస్తారు.

అందరు అస్సాముఆదివాసులకు మంగోలియాచిహ్నములు ముద్రించినట్లు కనుపడుతాయి. సన్నని చికిలికండ్లు ఉబ్బిన కనురెప్పలు, చట్టిముక్కులు, గుండ్రని ముఖములు, ఉండి కనుపడని మీసములు, ఐదు అడుగులకు మించని శరీరములు, కురుచ తలవెంట్రుకలు, ఎత్తడిపళ్లెనుండు ఒంటిరంగు మనదేశములో ఏప్రాంతపు ప్రజలకూ లేవు

(35-వ పేజీ చూడుము)

మట్లవారిమీది చాటువులు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

మట్లవారి సంస్థానము తెలుగునాటి సంస్థానములలో పేరెన్నిక గన్నది. మండలేశ్వరులై మహా సైన్యముతో విజయనగరప్రభువులకు సంగ్రామరంగములయందు బాసటయై నిలుచుటచేతనే కాక, కృతులు చెప్పి చెప్పించుకొనుటచేతనే కాక మట్లవారు విజయనగర రాజకుటుంబముతో వివాహసంబంధ బాంధవ్యములు కలిగియుండుటచే గూడ మట్లవారి సంస్థానమునకు తెలుగునాటిసంస్థానములలో నొక ప్రత్యేకగౌరవము, నొక ప్రత్యేక స్థానము కలదు. కకుత్స్థవిజయ మనెడి ప్రబంధమును రచించిన మట్ల అనంతభూపాలునకు పినతండ్రి మట్ల వరదరాజు శ్రీకృష్ణదేవరాయలకు అల్లుడు. రాయలవారి కుటుంబముతో సంబంధము చేసిన యీ సంస్థానపరిపాలకుల చరిత్రము ప్రచురింపము కావలసియున్నది

మట్లవారు సూర్యవంశపురాజులు. దేవచోడవంశస్థులు. పొత్తపిచోళులకంటెను, బోయవారి చోళులకంటెను గూడ భిన్నులు. కాశ్యపగోత్రోద్భవులు. వంగలివారని వీరికి పూర్వనామము. వంగలి కోనమరాజు వీరికి మూలపురుషుడయినట్లు తెలియుచున్నది. వంగలి కోనమరాజుగారు తమ స్వస్థలము వదలి కడపమండలము రాయచోటితాలూకాలోని 'మట్లి' యను గ్రామమునకు వచ్చి యందు స్థిరనివాసము కల్పించుకొనిరి. నాటి నుండి వంగలివారను పూర్వనామము పోయి వీరి నివాసస్థలమగు మట్లిగ్రామముపేర వీరు 'మట్లవా'రయిరి. వీరి వంశీయులు నేటి కడపమండలములోని పూర్వభాగమునకు అంకువయగు బద్వేలు (పెద్దప్రోలు), సిద్ధవటము, కడప, పుల్లంపేట (పుల్లయ్యపేట) లేక రాజంపేట (రాజుపేట) తాలూకాలను తమ యేలుబడిక్రిందికి దెచ్చుకొని, రాజంపేటకు సమీపమున నుండు అనంతరాజుపేటను రాజధానిగా జేసికొని, విజయనగరపాలకులకు సామంతులై సీమాపరిపాలనము గావించిరి. వీరికి లోబడియుండిన మండలభాగము వీరి పేర "మట్లవారిసీమ" యయినది.

కడపమండలమునకు మండలకరగ్రాహులుగా నుండిన జె. డి. బి. గ్రిబిలు ఐ. సి. యస్. దొరగారు ఉపలబ్ధము లయిన శాసనములను, కవితలను నాధారముగ జేసికొని పరిశోధనలు సలిపి యొకవిధముగా కడపమండల చరిత్రమును రచించిరి. తరువాత సి. యఫ్. బ్రాకన్‌బర్ దొరగారు మండలజనాభానివేదికలో నొక యధ్యాయముగా కడపమండల చరిత్రమును రచించిరి. పయి యిరువురపరిశోధనాఫలితములగు నాచరిత్రల బరిశీలించి వాఙ్మయ జనవాక్యాదికరప్రమాణకలాపములతో శ్రీకళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగారు కడపమండలచరిత్రమును రచించిరి. అందు మట్లవారినిగూర్చి వారు కొంత పరిశోధించి కొన్ని యమూల్యవిషయముల వెల్లడించిరి. కాని సాధనసంపత్తి సంపూర్ణముగా వారికి లభింపకపోవుటచే వారి చరిత్రమందసమగ్రముగా నున్నది. మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములో మెకంజీదొరగారు సేకరించిన స్థానికచరిత్రసంపుటములలో నిరువదిరెండవసంపుటమునందు "మట్లవారిని" గూర్చి యొక పెద్ద కైఫీయతు కలదు. మఱియు నందు మట్లవారిపై నాడు వారి సంస్థానమునం దుండిన భట్రాజులు రచియించిన చాటువు లెన్నో పేర్కొనబడినవి. చాటూదాహరణపూర్వకముగా, శాసనాద్యాధారములతో నా కైఫీయతు మట్లవారిని గూర్చి ప్రామాణికముగా దెలుపుచున్నది. ఆ కైఫీయతులోని కొన్ని ముఖ్యభాగములు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పర్యవేక్షణమున సేకరింపబడి 1945వ సంవత్సరములో ఆంధ్రపత్రిక ఆదివారపు సంచికలయందు బ్రకటింపబడినవి. మట్లవారిమీది చాటుపద్యములు మూడింటిని వారే తొలుత చాటుపద్యమణిమంజరి ప్రథమభాగమునందు ప్రకటించిరి. స్థానికచరిత్రల సంపుటములో నుదాహృతము లయిన చాటువులను, మఱియు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములోని వ్రాతప్రతులలో నివానిని—మట్లవారిపై భట్రాజులు చెప్పిన చాటువులను మఱి కొన్నిటిని వంశానుక్రమమున గూర్చి సందర్భవిశేషపురస్సరముగా నిందు ప్రకటించుచున్నాడను. మట్లవారిమీది చాటువు లివి యనేకచరిత్రాంశముల వెల్లడించునవియై, హృదయంగమములై యున్నవి. మట్లవారి చరిత్రమును రచించుటలో నివి యత్యంతోపకారకము లగు ననుటలో సందేహము లేదు.

మఱియు తిరుమలతిరుపతిదేవస్థానము వారు ప్రకటించిన శాసనసంపుటని వేకములవలన గూడ తిరుమలకయినను, నింక నితరస్థలములను నీ మట్లవారు గావించిన దానాదికములు, వారి సాహసపరాక్రమాదులు మనకు దెలియుచున్నవి. మట్లఅనంతభూపాలుడు రచించిన కకుత్స్థవిజయమునందును, నడిమింటి వెంకటపతి రచించిన యభిషిక్తరాఘవ మనెడి ప్రబంధమునందును మట్లవారిచరిత్రము తెలియగలదు. అభిషిక్తరాఘవమును బట్టి రచియింపబడిన వీరి వంశావళి యొకటి మెకంజీ లోకలురికార్డు (15-6-22) లో నున్నది

మట్లకుమారఅనంతరాజుమీద భట్రాజులు రచించిన ఈ సీసమాలిక మట్లవారు చేసిన సాహసకార్యములను వంశానుక్రమమున పేర్కొనుచున్నది.

శ్రీమించు రవికుల సింహాసనాధీశ
దీనాళికవిపద్మదీప్తమిత్ర
మిత్రవిద్వజ్జనస్తోత్రసంతతదాన
దానవహరణ సత్యప్రభావ
భావజరిపుపార్థ పటుశౌర్యసంపన్న
పన్నగేశ మృగాంక భవ్యకీర్తి
కీర్తితమాధవక్షీరాబ్ధిసౌందర్య
ధైర్యనీస్తుత శత్రుధరనృపేంద్ర
యింద్రనందన విరోధీంద్రవిశ్రుతమాన
మానవాధీశ కుమారనంత!
రాజవిద్యభోజ రమ్యభోగ విరాజ
యవధారు! విన్నపం బఘుచరిత
మీ మట్లవంశంబు మేదిని వెలయంగ
యెల్లమరాజయ్య యెలమి మెఱసి
పలు వైరితతులను ఖండనంబున గెల్చి
సిద్ధవటంబు ప్రసిద్ధి కెక్క
బలిమి లగ్గలు గొని పరరాజధామములు

పౌరుషంబున గొట్టి ప్రబలి మెఱసె
దరువాత బలియుడై తిరుమలరాజయ్య
గడిమ న్యెపా శేమల్ జడియగొట్టి
వివిధసంఘటనల వేశ్వ్యోల సమయించి
యభిమన్యుకైవడి నాజి దెగియె
బూని యాపిమ్మట గోనరాజేంద్రుండు
పరులకు దోడుగా నరుగుదెంచి
నరపతిసముఖాన దొరమన్నె రాజులు
భటికవీంద్రులలీల బ్రణుతి సేయ
నాహవభూమిలో నహితుల బరిమార్చి
సురనాథవిభవంబు జూఱగొనియె
నంత మీతాత యనంతభూరమణుండు
కపటారినృపతుల గర్వ మణచె
బెనుగొండ చెంతను భైరైన మన్నీలు
రాయలు రాజులు ప్రస్తుతింప
బతికార్యహితుడైన పావనివిధమున
మల్కబలంబుల మద మణంచి
యలరంగ మీ తండ్రి యా తిరువెంగళ
నాథభూరమణుండు నయవిదురుడు
పరికింప హరిపదభక్తిప్రహ్లాదుండు
భువిని బొంకని నరపుంగవుండు
మానసంపన్నుండు దానకాశేయుండు
రీతి మించిన రాజఋషి యటంచు
బుధు లెంచ వెలసి యీ భూమి బాలించు
చు

వెంకటపతిరాయవిభుని కార్య
మీడేర్చి యతనిచే మెచ్చిన సొమ్ములు
మెచ్చిన మహాహరి మీనడాలు
ముత్యాలకుచ్చులు మొదలుగా గల మేటి
బిరుదులు చేకొని పరగువేళ
గడి దాటి యాదేఖాను . . . .
. . . . హితబలంబు సేబది
వేలహయంబులు ద్విరదంబు లిన్నూరు
గూడ బాబాశావు కోరి వచ్చి
కందనవోలి దుర్గంబును ముట్టడి
వేసిన వార్తను విన్నయపుడె
తన సేనలును తాను దండెత్తి యచ్చట
జేరి తురకలపైన బారు బెట్టి
పోట్లాడు సమయాన బోరి సహాయుడై
యేగి ధర్మారావు నీగిపోయె.
నారీతి నే పోయె నండె సరదాగావు
తక్కిన దొర లెల్ల దల్లడిలిరి
వారి నందఱి నవ్వి వాజిరత్నము నెక్కి
తిరువేంగళేంద్రుండు ధీరు డగుచు
భక్షణసద్గుణ లక్షణయనుజన్ము
డగు తిమ్మరాజును నతిబలయుత
బాంధవపరరాజభటులను బేర్పరు
లను బిల్చి వారితో నొనర బలికె

దను తాత తండ్రులు తరతరంబుల నరి
వరులపట్ల తిరిగి విఱిగెఱుగరు
ధనములు తనువులు ధర ననిత్యంబులు
సత్యప్రతాపయశంబు నిలుచు
బార్థివోత్తమునకు బరప్రౌతునకు సెల్ల
బగఱకు విఱుగుట పాడి గాదు
గోపాలరాజుతో గోరి పల్కిన పల్కు
సంఘటింపగ మంచి సమయ మబ్బె
నెఱి సాహసంబున బరమోపకారులై
యెన్నిక కెక్కి వెయ్యేండ్లు మనిరి
యరి దొల్లి శాతివాహనుచేత హతమైన
విక్రమార్కుం డన వినతి కెక్కె
భట్టిభద్రుం డయ్యు నట్టి నీతియు నెంచి
ముగురు దునేదార్లు మొనసినపుడ
వెన్నియ్యగాలేక మున్నని దెగి కాశి
లో రామరాజయ్య పూజ గొనడు
రాజశేఖరునకు రణము తథ్యము ధాత్రి
వెనకకు బోరాదు వీరవరుడు
రహుత్తునకు నెందు రాబోను జెల్లదు
మన్నెరాజుకు నింద వెన్ను జూప
బ్రాణాన కాశించి బ్రతుకంగ జూచుట
కడు. రాజధర్మంబు గా దటంచు

దనవెంట మొనకు రాదగినట్టి వారెల్ల
రమ్మని తద్భటప్రతతితోడ
భేరీపటహశంఖవారణఘంటికా
రవము చెలగ బవరమున నిలిచి
గోవిందనామంబు కొనియాడుకొనుచును
నడచెను నరులు కిన్నరులు పొగడ
నట్టి జన్యములోన నల తుపాకీగుండ్లు
నమ్ములు మైదాక నళుకు లేక
గజబృంహితములకు గంపంబు నొందక
యడిగంపు మెఱపుల కదరిపడక
కరులపై సింహంబు గమకించు తెఱగున
గ్రోల్పులి లేళ్ళను గూల్చుపగిది
వంక కెక్కినయట్టి మాంధాతకైవడి
దండివిద్వేషుల దఱిమి దఱిమి
మత్తగజంబుల మహిమీద బడగ్రుమ్మి
గుఱ్ఱాల నీటెలు గుదులు గ్రుచ్చి
కలుత్తైన రణికుల గొట్టి గుట్టల బెట్టి
కోట్ల వెల్ల జీకాకు చేసి
సురశత్రువులచే సమసి తమ్ముడు దాను
హరివాసరమున నాహరరి జేరె

(36 వ పేజీ చూడుడు)

బాలానందం

16-వ తరువాయి

నేను! నీకన్నా పనిపాటులకు శక్తికలదానిని కదా."

"సరి! అయితే నన్నొక రాణీని చేసి, నువ్వు పనిచేసే తేనెటీగ వయ్యావు! ఓరి అమాయకుడా! మరి మునుపటి ఇల్లూ మునుపటి రాణీ ఇంతమాత్రం పనికి రావూ! ఇద్దరం కలిసిఉండాలంటేనే, ఒకడు చెప్పే వాడూ ఒకడు వినేవాడూకావల్సి వస్తూందే- మరి ఇంతమంది కలిసి బతకాలంటే ఒక నాయకుడు ఎంత అవసరం?" అంటూ బోధ మొదలు పెట్టింది ముసలిఈగ.

పడుచు ఈగ ముసలిఈగమాట ఒప్పుకొని, సంతోషంతో మళ్ళీ తేనెవసూలు చేసుకొనేందుకు ఎగిరి పోయింది.

కాసేపటిలో ఈ ముసలిఈగ పడుచుఈగలతో కలిసికొని మరి కొన్ని తేనెటీగలు, దెబ్బలాటలు మానుకొని తేన పోగుచేసుకొంటూ సంతోషంగా గుంపుగా ఎగిరి తేనె తెట్టుదగ్గిరకు వచ్చాయి తేనెతెట్టు గుమ్మంలో రెండు కాపలా యీగలు పహరాకాస్తున్నాయి.

ఉండండి ఎవ్వరూ ఇప్పుడు ఇటు రాకూడదు. "రాణీశవం బైటికి తీసుకెళ్ళాలి" అని అందరిని అటకాయించింది. ఇంతలో లోపలినుంచి కూలియీగలు ఒక చచ్చిన రాణీ యీగను తేనెతెట్టు బైటి ప్రాకారం దాకా లాక్కొచ్చి, అక్కడినుంచి గభీలున క్రిందకు తోసేశాయి.

పడుచుఈగ ఆదుర్దాగా "ఎమిటీ మన రాణీఈగ చచ్చిపోయిందా" అని కాపలాఈగలను అడిగింది.

"అబ్బే రాణీగారు కాదు! పొద్దున రాణీశిబిరం కాపలావాళ్ళు పని మానేసి ఎక్కడికో పోయారు. ఇంతలో ఒక చిన్న రాణీ ఈగ బైటికి తప్పించుకొని వచ్చి మన రాణీఈగతో దెబ్బలాట మొదలు పెట్టింది. మన రాణీబలంముందు ఆగలేక దెబ్బ తిని ఛచ్చిపోయింది. మళ్ళీ ఇంకో చిన్న రాణీఈగ పెరిగేదాకా, మరోగుంపు ఈగలను ఈమాటు పంపటానికి అవకాశం ఉండదు" అని కాపలాఈగ చెప్పింది.

(ఒక్కొక్క తేనెటీగల గుంపుకు ఒక్కొక్క రాణీఈగనే తయారు చేస్తాయి దాదిఈగలు. అది సరిగ్గా బలం చేకూర్చుకొన్నాక, తన గుంపును వెంటబెట్టుకొని ఇంకో గుంపుతో దెబ్బలాడే తాహతు తెచ్చుకొన్నాక, ఆ రాణీయీగకు పోతుటీగలను, పనిఈగలగుంపునూ ఇచ్చి తేనెతెట్టుబైటికి పంపిస్తాయి దాదియీగలు)

పడుచుఈగకు పశ్చాత్తాపం కల్గింది. తన మాటమీద ఈగలన్నీ తమతమ పనులు మానేసి తిరగటం మూలానేకదా ఈ చిన్నరాణీఈగ వృధాగా చచ్చిపోవలసివచ్చింది అని విచారించింది.

ముసలిఈగ మళ్ళీ పడుచు ఈగతో అంది. "చూశావా! రాణులుకూడా అంతా సమానులు కారన్నమాట! ఏక కాలంలో, ఒక్క పరిపాలకుడు తప్ప ఇద్దరుంటానికి వీల్లేదు కదా!".

"ఔనని," తెలివినబడి తల ఊపింది పడుచుఈగ.



వివిధదేశాల బాలబాలికలకు తమ సౌహార్దాన్ని తెలిపే నిమిత్తం అమెరికన్ బాలబాలికలు బహుమతులు పంపుతున్నారు.

రుద్రమదేవి

(12-వ పేజీ తరువాయి)

గనక ఎవరో పిచ్చివాఁడో బిచ్చగాఁడో యనుకొని సరిపుచ్చుకొందురు.

కాని యాతని రహస్యముగా వెన్నంటిపోవు గండని దారి యంత తేలికయా? బైరాగివెంట బడి పడి మొరిగి మొరిగి విసివిన కుక్కలు వెనుకకు వచ్చును. ఇంతలో గండని నల్లని యంగీ కప్పుకొని చేత దండము ధరించిన యాకారము చూచినచో ఆ కుక్కలు నూతనావేశముతో నాతనిపై కవియవా? దానితో బైరాగికి తన్నెవరో అనుగమించుచున్నారని తెలిసిపోవదా? అట్లు తెలిసిపోయినచో తాను వెన్నంటి యేమి రహస్యము తెలిసికొనజాలును?

మరియు లేచిన గృహస్థులు బైరాగిని ప్రశ్నింతురుగదా! అతను ప్రత్యుత్తర మీయకపోగా వారిటు నటు చూచుచు కొలది [illegible]నములో నచ్చటికి వచ్చిన గండని వారు ప్రశ్నింపకుందురా? 'ఇ[illegible]ంగు పోయిన దెవరు?—అతని వెంటబడుచున్నటున్నావే—అతఁడేమైన దొంగకాఁడా?—అసలు నీ వెవరవు?' ఆ ప్రశ్నలకు తాను ప్రత్యుత్తర మీయనిచో ఆ గృహస్థుడు ఊరుకొనడు; ప్రక్కయిండ్ల వారిని లేపును. అందరు కలసి యాతని ముట్టుముట్టి తోచిన ప్రశ్నలెల్ల సాగింతురు అల్లరి యగును అది బైరాగికి వినబడకుండునా? అట్టిది వినబడకుండునంతదూరములో నుండి వెళ్లుదమన్న ఆబైరాగి యాగు ప్రదేశములు గుర్తించు టెట్లు? అతని మాటలు వినుటెట్లు? అదిగాక అతని నీ సందర్భమున సరిగా ననుగమించుటయే సాధ్యపడదు.

ఈ చిక్కులన్నియు ముందుగనే గండ డూహించియే తగు మెలకువతో సంచరించుచుండెను. రహస్యముగా నగరమున నిశాసంచార మొనర్పు నేర్పు మేచయనాయకుని వ్యవహారకాలలో తద్విదు లాతనికి కొంత ప్రస్తుతపరచియే యుండిరి. అది స్వానుభవముతో గట్టిచేసికొనవలెను. ఇప్పటికి పది పన్నెండుమారు లాతడా పనియందు నియుక్తుడగుటచే కొంతవర కారితేరినాడు.

ముందు బైరాగివెంట బడి మొరుగుచున్న కుక్కలను జాగరూకుడై కనిపెట్టి వాని రాకపోకలు పరీక్షించుచు గండడు వాని కళ్ల బడకుండ నెమ్మదిగా దాటిపోవుచుండెను.

గృహయజమానులు తలుపుతీయుచున్న చప్పుడు ముందుగానే గమనించి బయటికి వచ్చినవారి కెదురుపడకుండ తప్పుకొనుచుండెను. ఎంత జాగరూకుడై సంచరించినను ఏదో యొక కుక్కకంట బడకుండ నుండు సాధ్యమా? అది మొరుగకుండునా? ఒక యింట యజమాని బయటికి వచ్చుచున్నాడని మరియొకయెడ దాగి యున్న నచ్చట గల యింటి యజమాని యాకస్మికముగా తలుపుతీసి బయటికి వచ్చును ఈ గండవాని కాతడు కంటబడకుండ నుండు టెట్లు? అతను ప్రశ్నింపక యూరకుండునా? జవాబు చెప్పక పోవు టెట్లు? అట్టిచో మధ్యమధ్య తటస్థించెను 'యామికుడను! వీరభద్రుడను! వైద్యునికొఱకు పోవుచున్నాను. తెల్లవారిన దనుకొంటిని!' అని తడవ కొక కొత్తవిధముగా అనుమానమునకు తావీయకుండ నెమ్మదిగా చెప్పి యాతడు దాటిపోవుచుండెను. బైరాగిని గూర్చి యెవరైన నడిగిన 'ఎవరో తెలియదు మతిహీనుడుగా నున్నాడు' అనును. కొన్నిమారులు నగర రక్షకులను వీరభద్రులును కనబడిరి వారికి సంకేతశబ్దము పలికి తప్పించుకొనవలెను. లేకున్న నతని శిరస్త్రాణము చూచి నిలువవేయుదురు మేచయ నామము తలక్రిందులు చేసి 'యచమే' యని నెమ్మదిగా చెప్పిన వారు మాటాడక వెళ్లిపోవుదురు.

పలుమారు గండడు తాను వెంటాడుచున్నట్లు బైరాగికి తెలిసియుండునని భయపడెను కాని యా ముందుపోవువాడట్టి యనుమానము నొందుచున్నట్లే కనపడలేదు అతను వెనుదిరిగి చూచుట గాని దిక్కులు చూచుట గాని ఏమియు చేయుటలేదు అతనిని ఎవరైనను వెంటాడుచున్నట్లాతనికి తెలిసినను లక్ష్యము చేయువానివలె గూడ లేడాతడు! అన్నిటికంటె గండని కొకటే ధైర్యము అంతటి పిశాచశబ్దము చేసికొనుచు పోవువాని వెనుక తా నాడు సన్నమాటలు వినిపించునా?

బొల్లని భార్య యగు మంగిని గండ డెన్నడు చూచియుండ లేదు. గండనికి బొల్లనికి మల్లయుద్ధమున స్పర్ధ యేర్పడినది కాని వారికి ఎట్టి విరోధమును పూర్వము లేదు. [illegible] చిరకాలముగా మైత్రి కలదు. పూర్వము [illegible] వారుండునెడ వారి యిండ్లు మిక్కిలి దగ్గర అప్పుడా రెండు కుటుంబములకు సాహచర్య ముండెను బొల్లని తల్లియు గండని తల్లియు అక్కచెల్లెండ్రవలె మైత్రితో మెలగుచుండెడివారు గండడును బొల్లడునుగూడ మల్లయుద్ధము కర్రసాము ఒక జెట్టిగరిడీలో ననే నేర్చియుండిరి. విద్య నేర్చునప్పుడే వారిరువురకు స్పర్ధ యేర్పడెను గాని విరోధము లేదు ఇతరగరిడీవారితో పోరుటలో వారిద్దరు నొక్కటియే! మరియు మల్లయుద్ధమునను కర్రసాములో ననె గాని ఏ యితరవిషయమునను వారికి స్పర్ధకూడ నుండెడిది కాదు. అయితే వారికి వయస్సు ముదిరినకొలదియు ఒకరిపై నొకరికి గల ప్రేమానుబంధము తగ్గిపోయి స్పర్ధయే బలపడిపోవుచుండెను. అట్లయినను వారి కుటుంబముల మధ్య రాకపోకలు కట్టుపడలేదు

బొల్ల డెక్కువ మాటకారి కాడు. కారునలుపు. అతని దేహము వ్యాయామముచేసినకొలదియు కండలు పెరిగిపోసాగెను. పొట్టకూడ పెరిగిపోవుచున్నది దేహముతోపాటుగా అతని మాటలు కూడ మోటువారిపోసాగినవి. అతడు మాట్లాడుట చూచినవా రా మాటలు నోటినుండి వచ్చుచున్నట్లు కాక రొమ్ములోనుండియో కంఠమునుండియో సరాసరి బయటికి వెడలుచున్నట్లు తలంతురు

గండడు వ్యాయామముచేసినకొలది యాతని దేహము గట్టిపడుచు రాగిశలాకవలె మారజొచ్చెను అది సమముగా సమవిభక్తాంగముగా వర్ధిల్లుచున్నది అసలతనిది చామనచాయ. వయస్సు మీరుచున్నకొలది అతని దేహచ్ఛాయ మారుచు ఇతడు పచ్చనివాడా, ఎర్రనివాడా యను సందేహము కలిగించుచు మిసమిసలాడుచు శరీరము పెరుగుచుండెను. వారి వాడలలో నాతడెక్కువ యందగాడై యాకర్షకముగా నుండువాడు.

మరియు గండడు ప్రతివానితో మాటాడను మాటాడినప్పుడు ఇతరులను నొప్పింపని పరిహాస ముండును అతను మనసార నవ్వును అతడు నవ్వినప్పుడాతని తెల్లని పెద్ద పండ్లు బయట పడెను. ఇతరులను నవ్వించును వారి కులములలో స్త్రీలు పరపురుషునితో మాట్లా

డుటలో ఎట్టి శ్రోత్తయు చూపరు. స్త్రీపురుషులకు ఇతరకులములలో నన్న దూరము వారి కులములలో లేదు నలుగురలో నున్నప్పుడుగాని ఒంటరిగా నున్నప్పుడుగాని వారా భేదము పాటింపరు. అందును గండని కుటుంబమునకును బొల్లని కుటుంబమునకును చిరకాలమైత్రి కలదాయెను! గండడు స్వతంత్రముగా బొల్లని భార్యను పలుకరించును. దానితో పరియాచకము లాడును దాని కూతురు పాటియు గండనకు వచ్చిన నతనిపై నగ్రబాకి నెత్తి కెక్కును. గండనికి ఇంకను పిల్లలు పుట్టలేదు అందుచే పాటిచనువు అతనికి విశేషానందము కలిగించును

కాని శరన్నవరాత్రములలో తా మిద్దరు వీధిలో పోరాడు కొన్న తరువాత గండనికి బొల్లని యింటివైపుకు వెళ్ళుటకే ముఖము చెల్లలేదు ఆ పోట్లాటయంతయు నావేశములో జరిగిపోయినది కాని తర్వాత జరిగిన విషయములను బట్టి బొల్లడు రాజద్రోహులలో చేరినాడని స్పష్టమయ్యెను విద్రోహులు కాక అతని నా కారాగారమునుండి యంత చాకచక్యముగా తప్పించువా రెవరు? మంగు బొల్లడు చెఱలో పడుటకును ఇప్పుడు దేశములు పట్టుటకును కారకు డెవరు? తానే గదా! పాపము, మంగి ఎంత దిగులుపడుచున్నదో గదా! ఆపిల్ల పాటి అన్నపానములే మానివేసి యుండును వారి ముఖములు లానే మొగము పెట్టుకొని మాటగలడు!

ఇప్పుడా బైరాగి బొల్లని యింటియొద్ద నాగుటయు అప్పటికే మంగి సిగ్గుగా నుండి బయటికి వచ్చుటయు గండని కాశ్చర్యమయ్యెను అతని ప్రాణము లొకసారి యాగిపోయినట్లే యయ్యెను

ఒక పంచచాటున నుండి గండడు వారి చర్యలు చూచుచు మాటలు వినుచుండెను ధైర్యముచేసి యాతడు కొంచెము దగ్గరకే పోయెను.

పాటి బయటికి రాలేదు. మంగి తల దువ్వుకొనలేదు. అది కొంతకాలముగా తిండికూడ సరిగా తినుచున్నట్లు లేదు. దాని మాటలు నీరసమగు కంఠమునుండి దీనముగా వచ్చుచున్నట్లు వినిపించెను.

"బాబా, నిన్న ఇంటిలో మేము తిండి తినలేదు. పిల్ల జ్వరముతో ఉన్నది మీ కేమి పెట్టగలను, బాబా!"

గండని గుండె లొమ్మారుగ తరుగుకొనిపోయెను తన కిప్పుడు భత్యము వేతనము సెక్కవునవి పల్లలు లేవు ఈ ధనమంతయు దానేమి చేసికొనను! మరునాడు పోయి మంగిని చూచి కొంత ధన సహాయము చేయ నాలికు శ్చయించెను ఈ యాలోచన లోటలో సాగిపోయెను. మనోవేగము గదా! అంతలో బాబామాటలు వినబడెను

"పిల్లా, మీబోటివారి యిండ్లకు మేము దీవించుటకు వత్తుము గాని మాకు డబ్బుతో పనిలేదు. గాలి తినియే జీవింపగలము!"

"బాబా, మా కష్టము లెప్పటికి గట్టెక్కగలవు?"

మంగిప్రశ్నకు బైరాగి కొంతతడ వాలోచించెను. భగవంతుని నడుగుచున్నవానివలెనే ఆకాశమువంక తల యెత్తెను కొంతసేపటి కాతడిట్లనెను.

"నీవు నీ పెనిమిటిసంగతి యడుగుచున్నావు అతడిప్పుడు దూరమున గనబడుచున్నాడు సుఖముగా సంతోషముగా నున్నాడు అతని కిప్పుడే ఎన్నియో రత్నములు సువర్ణములు లభించినవి—

"మంగి నిట్టూర్పు విడచినది"

"అయ్యో, ఎంత సంపాదించి ఏమి లాభము? మే మిల్లు మాడుచున్నాము—మరి ఎవరికైనా ఇట్టుకొంగా, బాబా!"

"లేదు, లేదు!"

మరల బైరాగియే మాట్లాడెను "రోజూ అతడు భార్య కోసము పిల్లకోసము కలవరించును దిగులుతో సగమైనాడు ఇక్కడికి వచ్చెనో అతని ప్రాణములు దక్కవు!"

"అతడు చేసిన తప్పేమో నా కెవరూ చెప్పరు. కావలసిన వారుకూడ నాదగ్గరకు వచ్చుటకే వెనుకాడుచున్నారు ఏమి చేసినాడో మీ రైనను చెప్పరా, బాబా!"

"ఏమైన నేమి? నీ కష్టములు గట్టెక్కుటకు చాలాకాలము పట్టును."

"ఇన్నాళ్లూ బ్రదకవ మెట్లు, బాబా?"

మాకు దీనులకు సహాయము చేయుటే పని! భగవంతుడు మాకు కోరిన ద్రవ్య మిచ్చును!"

ఇట్లనుచు నా బైరాగి తన రెండుచేతులు పైకెత్తెను అతని దోసిలి నిండి బంగారు వెక్కినట్లయ్యెను. "భగవంతు డిచ్చినది నీకే!" నని యతడు మంగిని ఒడి పట్టుమని తన దోసిలి ఒడిలో కుమ్మరించెను

మంగి తెల్లవోయి చూచుచుండెను. గండనికి స్పష్టముగా ఇంటివాకిలినుండి వచ్చుచున్న దీపపు వెలుతురులో కనికిపడు దీపపు వెలుతురులో సువర్ణములే కన్నులకెదుట మెరసెను మరుసటిక్షణమున బైరాగి కనబడలేదు అతని ఇనుపపట్టెల శబ్దమును వినబడుటలేదు అతడెటు వోయెనో గండనికి కనబడలేదు.

గండనికి భక్తియు భయమును ఏకకాలమున నుదయించెను. ఈ బైరాగి ఎవరో సర్వజ్ఞుడు! తాను వెన్నాడుచున్న సంగతియే అట్టివా డెరుగకుండునా? అప్పుడే అతనికి మంగిఎదుట బడి పాటిజ్వరముసంగతి విచారింపవలె నని ఎంతేని కోరిక అతిశయించినది. కాని యది సర్వవిధముల ననుచితము. ఇట్టి యపరాత్రసమయమున అసలే పనికిరాదు!

ఇట్లా రాలోచించుచుండగనే దూరమున నా యిగప గజ్జెల చప్పుడును కిర్రుశబ్దమును వినవచ్చెను కలలోనుండి లేచిన వానివలె అతడా శబ్దమాలకించెను 'రా, చేతనైతే రా!' అని తన్నాశబ్దము ధిక్కరించి పిలుచుచున్నట్లే యాతని కది తోచెను అభ్యాసవశమున నాతడు లేచి ఆ శబ్దము వచ్చుచున్న మార్గమంటి పోయెను అది చిన్న రాతిగుట్టయొద్ద నున్న సైనవసతివైపునుండి వచ్చుచున్నదని యతడూహించెను గండ డటు వెళ్ళుచుండ మరల నది యాగిపోయెను.

ఎటు పోవలెనో పాలుపోక గండడు విచారించుచు ఆలకించుచు ఒకచో నిలుచుండెను. అంతలో నతనికి తన కుడిచెవి ప్రక్కగా దూసికొని యొక బాణము పోయిన ట్లయ్యెను ఏదైన రెక్కలపురుగా ఇది? అంతలో ఎడమచెవిప్రక్కగా మరల నట్టి

శబ్దమే యర్యెను! ఇక నిది యేమని యాలోచించుకొను తడవు లేదు. ఈమా రది తన తలమీదనే పడును! వెనుకనుండి వచ్చుచున్న ట్లున్నవి! వెనుక తనకు ఆచ్ఛాదన మేమియు లేదు!

వెంటనే చురుకుగా నాతడు వెనుదిరిగి కర్రత్రిప్పుటకు ఉద్యుక్తుడగుచుండెను. అంతలో నొక బాణము వచ్చి బలముగా నాతని రొమ్మున తాకెను. అదృష్టవశమున నాతి డాదినమున రొమ్ము తగడు వేసికొనియుండెను. లేనిచో నతని ప్రాణ మక్కడ ఆనాడు పోవలసినదే! అధికారుల యాజ్ఞలు చిన్నవిషయములలో కూడ పాలించుట ఎంత శ్రేయస్కరము!

ఇప్పు డేమి చేయవచ్చును! వెంటనే ఆతడు నేలపై పడి పోయినట్లె పడియుండి ప్రక్కకు పడిపోయిన బాణమును పట్టు కొనెను. కొంచెముతడ వట్లే యాగి పిమ్మట లేచి పారిపోవలె నని యాతని యాలోచన. ఆపైని బాణములు పడుట యాగిపోయినది. ఎవరో వచ్చుచున్న యలికిడి సమీపమున వినవచ్చెను.

చిత్రమైన భయ మాతని నావేశించెను. ఒక్కసారిగా నాతడు లేచి సందుగొందుల దూరి పరుగుతీసెను. ఆ చీకటిలో గురితప్పక మనుష్యమాత్రు లట్లు బాణప్రయోగము చేయగలరా? ఆ బాణ ములు వదలినదియు తన్ను పట్టవచ్చుచున్నదియు పిశాచము లనియే ఆతని నమ్మకము! మనుష్యు లని యనుకొన్న నంత భయపడువాడు కాడు!

అట్లు పరుగువారిన గండడు మేచయనాయకుని వ్యవహార శాలకు బోయిగాని వెనుదిరిగి చూడలేదు. అంతవరకు నతడు అరవ నైన అరవలేదు.

అత డక్కడికి చేరునప్పటికి ఇంకను తెల్లవారలేదు. ద్వార మున కాపున్న భటులు 'ఎవరు? ఎవరు?' అని అరచుచున్నను మారాడక గండడు పిచ్చికేక వేయుచు భవనములోనికి జొరబడుచుం డెను. కావలివారిలో నొకడు శూలమును రెండవవాడు ఖడ్గమును ఎత్తిరి. వా రవి యాతనిపై ప్రయోగించెడివారే కాని అంతలో గండని గుర్తించి దింపిరి.

ఆ పిచ్చికేక విని మేచయనాయకుడే ప్రక్కనున్న యాత్మ మందిరమునుండి బయటికి వచ్చెను.

గండని చేతిలో బాణ మట్లే యున్నది. ముందు మేచయ యాతని చేతిలోని బాణ మందుకొని పరీక్షించెను.

దానిపై సన్నగా స్పష్టముగా 'హ. హ.' యను నక్షరములు లిఖింపబడి యుండెను.



తెనాలి సంస్కృత కళాశాలను శ్రీ బి. యస్. బాలసుబ్రహ్మణ్య అయ్యర్ ఎం. ఏ. (ఇనస్పెక్టరు ఆఫ్ ఓరియంటల్ స్కూల్సు) గారు సందర్శించిన సందర్భంలో తీయబడిన చిత్రం.

రేడియో పోటీ

(10-పేజీ తరువాయి)

గులు, కోటసింహద్వారంలాంటి గుమ్మం. అప్పుడే మలుపుతిరిగి ఈ వీధిలో ప్రవేశించిన యిద్దరు యువకులు సూరయ్య కంటిలో పడ్డారు. 'ఎవరబ్బా! ఎప్పుడూ చూసిన మొహాలుకావే; ఎవరింటికో?' అని ఆశ్చర్యపోయి అలా ఆగిపోయాడు. ఆ యిద్దరూ సరిగ్గా వీరయ్యయింటిదగ్గరే ఆగి, తెరచివున్న సింహద్వారానికెదురుగా నిల్చున్నారు. సూరయ్యగుండెలో గుండ్రాయి పడ్డది. 'ఏదో వుందిరా రహస్య'మనుకుని రహస్యపరిశోధకుని పని పుచ్చుకోవాలని రకామని తలుపేసి మేడగదిలోకి వెళ్ళి, కిటికీలోంచి చాటుగా చూడటం మొదలు పెట్టాడు

ఆ మసకచీకటిలోనే సూరయ్య ఆ యిద్దరి వేషం సరిగా పరిశీలించాడు ఇద్దరూ చొక్కాలు లోపలికి వేశారు. కాళ్లకు బూట్లు మాసిన జేబురుమాళ్లు తలకు కట్టారు అల్లాగే మాసినవేషం వారెవరో అంతగా పసికట్టలేకు సూరయ్య వాళ్లల్లో ఒకడు లోపలికివెళ్ళాడు. మరు నిమిషానికి రెండోవాడూ వెళ్లాడు మొదట వెళ్లినవాడు తనకి కనిపించటంలేదు రెండోవాడు వరండాలోకి వెళ్లక, ఒక్క క్షణమాగి, యింటిమట్టూ అటూయిటూ తిరిగి, ఇంజనీరులా పరిశీలించాడు బహుశా వీరయ్య ఎవ్వరికీ తెలియకుండా వున్నట్లుండి మూడో అంతస్తు వేస్తే, వూళ్లోవాళ్లంతా నోరు తెరచుకుని ఆశ్చర్యపోతారనుకున్నాడు కాబోలు పాపం. లేకపోతే అంత దొంగచాటెందుకు? కాసేపటికి నిశ్చలంగా ఆ రెండోఅతనే గుమ్మానికెదురుగా, ఏదో అవతలమనిషి చెప్తూంటే తలూపినట్లుగా, కొద్దిగా తలను కదలిస్తున్నాడు ఇంకేం, వీరయ్యే తన ఆలోచనల్ను తెలియచేస్తున్నాడు అంతలోకి, రెండవఅతనుచేతుల్లోకి పాత రేడియోసెట్ ఒకటి వచ్చింది అది వీరయ్యది! మరుక్షణానికి మొదట అతనూ వచ్చాడు. ఇద్దరూ గుమ్మందాటి, ఒకసారి వెనక్కి తిరిగి, చిరునవ్వు నవ్వి, సెల్యూట్ చేసి తన యింటిమీదుగానే వస్తున్నారు. అమ్మయ్య! అసలు కథ కాస్తా యిప్పటికి బయటికి పడిపోయింది. తనలాంటి పరిశోధకుడికి బయటపడక ఎంతసేపు దాక్కుంటుంది?—వీరయ్యది పురాతనపు రేడియోసెట్. ఏదో తన మీదకు మాటమీదమాట పోటీకి వచ్చాడే గాని ఆయనికిమాత్రం తెలియదూ, తనది పాతరేడియో అని? ఇంకేం, మాట నిల్పుకోవటానికని, వసుదేవుడంతటివాడు గాడిదకాళ్లు పట్టంగా అర్ధరాత్రప్పుడు రిపేరర్లను పిలిపించితే తప్పేముంది? అదీ సంగతి! అని చిన్నగా వినిపించీ వినపించనట్లు నవ్వుకున్నాడు సూరయ్య. అయినా సంగతేమిటో తేల్చుకుందామని తలుపుతీసి వాళ్ల కెదురుగా వెళ్లాడు.

చీకటిలోంచి హఠాత్తుగా వెలువడ్డ సూరయ్యను చూసేసరికి రేడియో కాస్తా దభీమని కింద పడ్తుందేమో నన్నంతగా నిశ్చేష్టులయ్యారు.

కొంప మునిగినంత హడావుడిగా సూరయ్యే పల్కరించాడు. 'వీరయ్య పాత రేడియోకదండి, మీరు తీసుకెళ్లేది? ఏమన్నా చెడిపోయిందా ఏమిటి?' అని తన సంతోషాన్ని బలవంతాన దాచి టకటకా అడిగాడు.

రేడియో పట్టుకొనని మొదటాయన ఈ తుఫానునుంచి తేరుకుంటూ బదులు చెప్పాడు 'పాతదేఅనుకోండి! అయినా, అంతగా చెడిపోలేదు ఏదో కొద్దిపని. ఏ మాత్రం లోపం లేకుండా బాగా పని చేస్తుందో లేదో చూడమన్నారు వీరయ్యగారు.'

అదీ సంగతి! ఎంత దూరాలోచన, ఎంత ముందుచూపు! ఏమీ లోపంలేకుండా పాతరేడియో అద్భుతంగా వుండాలని వీరయ్యఆశ! తనది క్రొత్తదేఅనుకో, అయినా, కొని సంవత్సరమైనా ఇంతవరకూ మళ్లా దాని మోహంచూసిన పాపాన పోలేదు. అప్పుడప్పుడు పాతతడిక విరగ్గొట్టినట్లు శబ్దం వస్తుందనుకో. అయినా, వీరయ్య వుత్సవంరోజున పోటీకనే పంపిస్తాడని నమ్మకమేది? 'అయితే మళ్లా ఎప్పుడు తెస్తారు?' లాయరు క్రాస్ఎగ్జామినేషనులో ఆఖరుప్రశ్న వేశాడు సూరయ్య

'ఇరవైఐదులోపలే తెమ్మన్నారు ఇరవైఆరుతేదీన అర్జంటుపని వుందట' ఇంకేం తేలిపోయింది. వుత్సవంరోజు పోటీకే తనది కొత్తరేడియోఅయినా, ఈ రిపేరుచేసిన రేడియోముందు, పాతదేఅయినా తీసిపోవచ్చు ఎవరు చూశారు? అంతగా అతి ఆత్మవిశ్వాసం కూడదంటారు. అని నిశ్చయానికి వచ్చి సణుగుడుగా తన కోర్కెన బయటపెట్టాడు

'నాది కొత్తరేడియో అనుకోండి. అయినా పరీక్షించి ఏమన్నా చేయాల్సి వుంటే చేసిపంపిస్తారా. బహుశా మీ కిప్పుడు తీరదనుకుంటాను మీకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడే పట్టుకెళ్లచ్చు' అని ఆదుర్దాగా సమాధానంకోసం ఎదురుచూస్తూ హెచ్చరించాడు.

ఆయువకు లిద్దరూ ఒకరి మొహాల్లోకి ఒకరు చూసుకున్నారు. మొదటాయనే మాట్లాడాడు.

'అలా అంటే ఏమి చెప్తామండి! మీ రన్నట్లు మా కిప్పుడు చేతికిమించిన పని తగులుతున్నది అయినా మీవంటిపెద్దల మాట తోసెయ్యలేము. ఏమంటావోయ్!' తన సహచరుణ్ణి హెచ్చరించాడు

సూరయ్య ఆత్రుతగా ఆ సహచరుడికేసి చూశాడు.

'కష్టమో, గిష్టమో తీసుకెళ్దాంపదండి! పెద్దవారిమాట ఎలాకాదంటాం?' అన్నాడా రెండోఅతను.

ఇంట్లోంచి తన కొత్తరేడియో తీసుకొచ్చి మొదటి యువకుడి చేతులో పెట్టాడు. వాళ్లు నమస్కరించి వెళ్లిపోయారు.

'ఇప్పుడు చూస్కో నా తడాఖా! ఇహ పెంటకుప్పలో పారేయవలసిందే ఆ వీరయ్య పాతరేడియో! ఇలా అనకొనని విజయాన్ని తను సాధించటం తలపోస్తూంటే పది నిమిషాలు గడిచినై 'అరెరే! ఎంతపని జరిగింది! వాళ్లు ఒకవేళ సమయానికి తీసుకురాకపోతే, నేనన్నా వెళ్లి తెచ్చుకుందునుగదా,—వాళ్ల కంపెనీ ఎడ్రసు అడగకపోతినే!' అని నొచ్చుకున్నాడు కాసేపు. కాని సూరయ్య బుద్ధిగల బుఱ్ఱకు వెంటనే దానికి విరుగుడు ఆలోచన తట్టింది 'అం నే నడక్కపోతేమాత్రం, వీరయ్య ఎడ్రసుతీసుకోకుండా యిస్తాడా?' అని అనుకుని 'వాళ్లు ఇరవైఐదుకల్లా తీసుకురాకపోతే వీరయ్య నడిగితేసరి' అని తనను తాను సమాధానపరచుకున్నాడు; లోపల కొంత పేకులాటగా వున్నది వీరయ్య నుంచి గాల్సి వస్తుందని.

ఒకగంట గడిచిందో లేదో, వీరయ్య, ఆయన యింట్లోంచి బయటకు వచ్చి చకచకా నడుస్తున్నాడు. 'ఎక్కడికో?' అని సూరయ్య తనలో ప్రశ్నించుకుంటుంటే, వీరయ్య తన యింటిదగ్గరకే వచ్చి, తొందరగా తన తలుపు బాదటం మొదలుపెట్టాడు. వెదుకబోయిన తీగె కాళ్లకు తగిలిందట!

వేటకాడిచేతిలోంచి, వాడు గురి చూపదలచిన పిట్టే ఆశ్చర్యంగా ఆకాశంలోంచి పడ్డట్టు, వీరయ్యే తనదగ్గిరకి వచ్చాడు.

'కాసేపు అట్లాగే వాకిటదగ్గిర నిలబెట్టుదా' మనిపించి, తలగుడ్డ షోగ్గా చుట్టి, బుజ్జమీసం పైకి ఎగదోసి, చుట్ట వెలిగించి పట్టణంలో కొన్న చేతికఱ్ఱ పుచ్చుకుని, చాలా అర్జంటుపనికై బయలుదేరుతున్నట్లుగా క్రిందికి దిగివచ్చి తలుపు తీశాడు. కాని, ఎవరున్నారు? వీరయ్య కాస్తా మాయమయ్యాడు. పాపం సూరయ్యకు ముద్దుపెట్టుకుంటానని చెప్పి మూతి కొరికినట్లయ్యింది. గుప్పిటలో వున్నది 'తాయం, తాయం' అని చిన్నపిల్లాడికి మిఠాయి ఆశచూపి, గుప్పిట తెరచి గులకరాయి చూపినట్లయ్యింది.

ఏమిపనిమీద వచ్చాడో, తనతో ఏమవసరమొచ్చి ఏమడగదలచి వచ్చాడో అనే ఆదుర్దా నరాల తీపులా ఆయనలో బయలుదేరింది. ఇట్లాంటి అవసరమొచ్చినప్పుడు తను అడిగించుకోకపోతే, మళ్లా అవకాశమొస్తుందో రాదో అన్న దిగులూ పుట్టింది. అంచేత 'వేయనే వేశాను వేషం' అని అల్లాగే బయలుదేరి వీరయ్య యింటిముందుగా చిన్నగా నడక సాగించాడు. వీరయ్య యింటిలో ఎక్కడా జీవమున్నట్లు అనిపించలేదు. ఇప్పుడేగదా వీరయ్య తన తలుపు కొట్టిందికాబట్టి ఇంకా రోడ్లవెంటే తిరుగుతూవుంటాడని, తను కనిపిస్తే, పల్కరించి అవసరమేదో అడుగుతాడని; సూరయ్య రోడ్లవెంట తిరగటం ప్రారంభించాడు. కాని సూరయ్యకు కోపం ముంచుకు వస్తుందన్న భయమైనా లేకుండా, వీరయ్య కనిపించనే లేదు. ఈ చీకటిలో ఏపనీ లేకుండా తిరిగితే పెద్దమనిషిలక్షణం కాదని, ఎవరైనా అడిగితే ఏంపనిమీద తాను వెళ్తున్నానని చెపుదామా అని ఆలోచించాడు. ఆయనచురుకైన మెదడుకు క్షణంలోనే, తనకు గౌరవం గొప్పతనం కలిగించే ఆలోచనొకటి తట్టింది లైబ్రరీకి వెళ్తున్నట్లూ చాలాకాలంనుంచీ ఒక చేతినుంచీ మరొకచేతికి అనవరతం మారుస్తూ, ఎంతనో గ్రంథాలయానికి పునరాగమనం చేయని విశ్వనాథవారి "వేయిపడగలు" వచ్చిందేమోనని కనుక్కొని తెచ్చేందుకు వెళ్తున్నట్లు పని కల్పించింది ఆయనబుఱ్ఱ.

లైబ్రరీకి వెళ్లే దోవలోనే వుంది పోలీసు స్టేషను. పోలీసుస్టేషనుముందు ఆరాత్రివేళ సముద్రఘోషపెడుతూ అంతగా జనం మూగటం సూరయ్యను కలవరపెట్టింది. దానికిమించిన కలవరం కలగజేసింది ఆగుంపులోనే వీరయ్యదర్శనం. ఆ కంపనలో కూడా సూరయ్యకు నవ్వు వచ్చింది. పాపం, వీరయ్యకు, తనే ఆయనకోసం తిరుగుతున్నట్లు తెలియదు. పైగా, పిచ్చిమనిషి తనకోసం అక్కడా యిక్కడా తిరిగి తిరిగి, ఇక్కడకైనా తను వుంటానేమోనని, ఇక్కడికి తయారయ్యేడు. కాని, ఇప్పుడే వుంది నాటకాంతం. కథ కట్టెక్కేది యిప్పుడే. అంచేత తను వీరయ్యను చూడనట్లు నటిస్తే; తనకి పల్కరించే బాధ్యత తప్పిపోగా, ఆయనంతట ఆయన పల్కరిస్తాడు. ఆయన అవసరమేదో అడిగించుకొని తను, మాటల సందర్భంలో రిపేరర్ల ఎడ్రసూ కనుక్కోవచ్చు. ఇలా ఆలోచించి ఆ గుంపు ఎంచేత కూడిందో కనుక్కొనటానికి వచ్చినట్లుగా శ్రద్ధపుచ్చుకున్నాడు సూరయ్య.

పోలీసొకడు ఒక రైతుని అడుగుతున్నాడు. 'అయితే రోడ్డుమీద కారుఆపటం, అందులోంచి ఇద్దరు దిగటం నీవు చూశావన్నమాటేగా?'

సబ్ఇన్స్పెక్టరు అంటున్నాడు. ఇంకా ఏమిటి సందేహం? అవి తీసుకెళ్లి దాంట్లో, పెట్టి చల్లగా జారిపోయారు. ఇప్పటికి యాభైమైళ్లన్నా వెళ్లివుంటారు.' అని పెదవి విరచాడు.


'అయితే, లాభంలేదంటారా?' అని అడిగాడు వీరయ్య విచారంగా.

తను వీరయ్యప్రశ్న వినిపించుకోనట్లు నటించినప్పటికీ, సూరయ్యకు లోపలలోపల సంతోషమే కలిగింది, తన ప్రత్యర్థి వస్తువు ఏదో పోయినందుకు. సంతోషంతోపాటు, కారణం తెలియకుండానే ముళ్లకంప గుచ్చుకుంది సూరయ్య గుండెకు.

ఇహ నిలదొక్కుకోలేక 'ఏమిటండీ! అసలువిశేషం?' అని అడిగాడు మారిపోయిన బొంగురుగొంతుకతో, సూరయ్య.

'హుం! సరే, ఇంతకీ మీరు వినలేదన్నమాట! భలేబాగుంది! పైగా ఎదురెదురు యిళ్లు! సరిసరి. వీరయ్యగారింట్లోనండీ, దొంగలు జొరబడి ఆయన రేడియో కాస్తా పట్టుకెళ్లారు!'

[*Francis Harrison* రచించిన *Neighbours*' కథను దృష్టిలోనుంచుకుని.]



హాండ్లేపేజ్ కంపెనీ తాలూకు "మరాథన్" అనే విమానం. దీని సిబ్బందిలో మూడు బ్రిటిష్ అధీనదేశాలకు చెందిన వ్యక్తులు పనిచేస్తున్నారు. ఒకరు దక్షిణాఫ్రికావారూ, కెనడావారూ, మరొకరు ఆస్ట్రేలియావారు; మిగతాయిద్దరూ ఇంగ్లీషువారు. వ్యాపార ప్రచారంనిమిత్తం ఈ విమానం ప్రపంచాన్ని చుట్టి రావడానికి బయలుదేరుతున్నది.

కామరూప్ కొండజాతులు

(26 వ పేజీ తరువాయి)

కాని స్త్రీపురుషులు బలిష్ఠులు. వెడద రొమ్ముకలవారు. ఎంత కష్టమైన చేయగలవారు. మొత్తముమీద ఉత్తరహిందూస్థానపు ఆదివాసులందరికన్న అందగాండ్రు. కొందరు నిజంగా కామరూపులే.

ఆదివాసుల ప్రాంతాలు ఇంతవరకు పూర్తిగా సర్వే కాలేదు. మిస్మీలు అభోర్లు ఉండే బ్రహ్మపుత్ర ఉత్తరభాగములో ఇప్పటికీ ఏసర్కారూ లేదంటే అతిశయోక్తి కాదు. ఇచ్చట కాలు పెట్టిన పాపాన పోలేదు ఏప్రభుత్వోద్యోగి. ఇక్కడ శిస్తులు లేవు. అధికారాలు లేవు. చట్టాలు లేవు. చీటికి మాటికి ప్రజలను వేపించే "కోట్లు" లేవు. ఖూనీకేసులుకూడ కులపెద్దలే విచారిస్తారు. తలకు తల, కన్నుకు కన్ను - ఇదీ ఇచ్చటి పీనల్ కోడు.

ఖాసీలు అందరికన్న అందగాండ్లు. అందరికన్న త్రాగగలవారు. నాగాలు అందరికన్న పౌరుషవంతులు. మికీర్లు అందరికన్న సోమరులు. ఆదివాసులు పండించే పంటలు నాలుగు మాసాలకుకూడ చాలదు. ఆకలి బంధువుల యిండ్లకు బయలుదేరి వారి గ్రాసంకూడ త్వరలో ముగిస్తారు. అటుపిమ్మట కోయగడ్డలను, జీలుగుకల్లును విప్పసారాను



కచారిజాతి ఆటవికుడు.

త్రాగుతూ కాలక్షేపం చేస్తుంటారు. పండే బియ్యములో సగం సారాకాపుకే ఖర్చు పెడతారు. నిషా లేనిమనిషే ఉండడు. ఆస్తి అల్లుండ్లకే కాని కొడుకులకు కాదు.

అస్సాములో వర్షపాతము అత్యంతము. చిరపుంజిలో ఈ సంవత్సరము కురిసిన వర్షము 490 పదున్లు. ఇచ్చటి రామకృష్ణ మిషన్ స్వాములలో ఒకరు సేలంజిల్లా తెలుగువారు.


అస్సాములో భూమి అతిసారవంతము. నౌగాంగ్, శిబ్‌సాగర్ జిల్లాలలో వరిపంట విస్తారము. అడివిప్రాంతాలలోని తేయాకు తోటలలో జెలగలబాధ దుర్భరము. తేయాకు తోటలలో నిర్ణీతకాలము పనిచేసి విడుదలను పొంది ప్రభుత్వమిచ్చిన పొలాలను చేసుకుంటూ మాతృభాషనుకూడ మరిచిపోతుండే తెలుగుకూలీలు అక్కడక్కడ ఉన్నారు.

అస్సాముప్రభుత్వము ఈ ప్రాంతాలలో భూమిని వదలి ఇంటికి మూడురూపాయలవంతున ఏటేట పన్ను వసూలుచేస్తుంది. తన రాష్ట్రంలోతప్ప మరెచ్చటా లేని ఖడ్గమృగాలనుపట్టి పరాయిదేశాలకు పంపించి ధనము చేకూరుస్తుంది. అడివిజాతుల నాయకులను దువ్వి అల్లుండ్లవలె జాగ్రత్తగా పట్టుకొనివస్తూఉంటుంది. నిద్రించు జాగిలములను లేపకూడదనేపద్ధతి ననుసరిస్తుంది.

ఎన్నో ప్రాంతాలకు రస్తాలు లేవు. మంచినీటిబావులు మృగ్యము. బట్టలు సున్న. ఆసుపత్రులు ఎండమావులు. వరపతిసంఘాలు లేనేలేవు. మంత్రసానలు కనుపడనే కనుపడరు. అతిత్వరితముగ వ్యాపించుచున్న కుష్ఠువలన అడివిజాతులు పడే బాధలు వర్ణనాతీతములు.

ఇచ్చటి ఆదివాసుల భావన ప్రత్యేకము. వాని లిపికి లేదు. మూకబలము ఎక్కువే కాని పలుకుబడి లేదు. స్వరాజ్యమువచ్చిన సంగతి తెలుసుకొని కాంగ్రెసుమీద ప్రేమ లేదు. ఇతర ప్రాంతాలను చూడకోరరు. ఇతరులు తమ్ము చూచుటకు ఇష్టపడరు. ఫోటో యంత్రాన్ని తుపాకివలె కోరచూపులతో ఎదురుతిరిగి చూస్తారు.

పూర్వపు బ్రిటిషుప్రభువులు వారి తోడు నీడలైన మిషనరీలు వీరిలో వేరుభావాన్ని ఉగ్గుపాలతో పోసి పెంచారు. హిందూదేశాన్ని వదలిపోతూ వీరికి సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రసాదించామని చెప్పిపోయినారు.



మికిర్ జాతి వ్యక్తి.

ఈ భావాన్ని ఇంకను నిలిచియున్న మిషనరీలు ప్రోదిచేయుచున్నారు.

గౌహాతి నిదాటి వరిపొలాలగుండా కాందిశీకుల ఆక్రందనములగుండా, ఆకాశాన్ని భేదించు ఉరుములు మెరుములగుండా దుర్భేద్యమైన అడవులగుండా గౌహతి - సదియా మెయిలు మమ్ములను బ్రహ్మపుత్రా నది ఇండియాలో చొచ్చుకునే ప్రాంతానికి తీసుకొనిపోవుచున్నది. క్లిష్టపరిస్థితులలో తగుల్కొనుచున్న ఇండియాను జాలిగొల్పు క్రిందిచూపుతో చూచుచున్న భూటాను ఉన్నత పర్వతశ్రేణి కనుపడుచున్నది. నిన్ననే భ్రాతృరక్తపాతముతో జొటజొటమని తడియుచున్న సిల్‌హట్ (పాకిస్తాన్) జిల్లాను శిఖరాగ్రములనుండి చూడగలిగినాము. ఇటీవలనే ఉదయించిన భారతస్వతంత్ర భానుణ్ణి ఇంత త్వరలో కమ్ముకొనుచున్న అశాంతిమేఘములు ఎప్పుడు విడిపోవునో ఎవ్వరు చెప్పగలరు.

మట్లవారిమీద చాటువులు

(28 వ-పేజీ తరువాయి)

వారి చరిత్రలు వర్ణింపగా ఫణి
పతికి వాక్పతికి దత్పతికి వశమె
తాతతండ్రుల కీర్తి ధరణిపై వెలసెను
నిపుడు దేవరచర్య లెంతు వినుము
కలితగండరబాల కావేరివల్లభ
కటకపురీచూరకారబిరుద
రిపుగసింహకాశ్యపగోత్రపావన
మతివరానంత! కుమారనంత!

వంశక్రమము

ఏతద్వంశీయు డయిన మట్ల వెంకటరామ రాజు శా. శ ౧౬౧౫అగు నేటి రాక్షసనామ సంవత్సరమందు యెర్రా వెంకటనాయనివారి పాళె మయిన యర్రగుంట్లకు ప్రవేశించి క్రమేణకాయనివారి నాక్రమించి యర్రగుంట్ల తామే కట్టుకొనిరి అప్పుడు మట్ల వెంకట రామరాజు దేవచోడమహారాజులుంగారిని కవీశ్వరులు శ్లాఘనచేసిన క్రమము—

దురములో రావిళ్ల దొరలను దెగటార్చె
నవలీలగా మట్లనంతనృపతి
కందనోలను రాయకార్యంబు లీడేర్చె
విజయుడౌ మట్ల తిర్వేంగళుండు
తతతులాభారాదిదానసంధానుండు
అరయ మట్లకుమారనంతశౌరి
మార్కొన్నశూరుల మస్తకంబులు ద్రుంచె
మట్లరాజయ్య తా మహిమచేత
బరగ నందఱ మీఱి సౌభాగ్యములను
గరిమ మీఱంగ రాజుచే గరితురంగ
భూషణంబులు తగ నంది పొల్పు మీఱె
మట్ల వెంకటరామభూమండలుండు.

మట్ల వెంకటరామభూపాలుని మీద భట్రాజులు రచియించిన పయి పద్యము మట్లవారి వంశక్రమమును జేర్కొను చున్నది.

మట్ల యెల్లమరాజు

ఊటుకూరికడ కొండ్రాజు తిరుపతిరాజు గారికిని, మట్ల యెల్లమరాజుగారికిని గొప్ప సంగ్రామము జరిగినది. అపుడు యెల్లమరా జుగారి సన్నిధానవర్తులయిన* నట్లు శ్లాఘిం చిన వివరము—

చక్కగా వచ్చుకవా చొక్కనాథు డెఱుంగ
మీఱి నైగుల నెల్లనూరికాడ
కొట్టవా దామెనగొర్లగా పోటితో
రణభూమి పోతు గొండ్రాయనికిని
జెండవా పొత్తపినుండి పాఱగ బాఱ
జండివైరుల నీరుకొండ లెక్క
గొండూరిమలలమ్మకును ప్రీతిగ దఱిమి
కొట్టించవా తలల్ గుట్టలుగను
అహహ! సత్త్రాలు గొడుగులు నందలములు
విడిచి పాఱంగ దఱుమవా వెంట నంటి
సమరనిశ్శంక! మట్టిలి శాసనాంక!
భాగ్యములకొల్ల! కోనభూపాలు నెల్ల!
ఆ అక్కజ మొప్పగా భుజప
రాక్రమశక్తుల నెంచి చూచితే
దిక్కులలోన బోలిపలి
తిమ్మయబుక్కడు రాజు నాటికిన్
మక్కువ దోర్బలంబునను
మానవనాథులలోను నంతకు
నెక్కువ మట్ల కోనధర
ణీశ్వరు నెల్లమరాజు నేటికిన్

నంద్యాలకృష్ణమరాజుగారు మట్ల యెల్ల మరాజుగారి హామీమీద వెంకటపతిరాయల వారితో సంధి యయివచ్చి కలిసికొనిరి ఎల్లమరాజుగారి కుమారుడు మట్ల సిద్ధవటే శ్వరుని యాలయముచుట్టువార ప్రాకారము కట్టించిరి అందు శిలాశాసనములోని ¶సీస మాలికలో నిట్లున్నది

నంద్యాలకృష్ణమనరనాథభయదాన
దక్షదోర్దండవిచక్షణుండు
అఖిల కర్ణాటసింహాసనాధీశ్వర
దక్షిణబాహాభిధానధారి!

అతడు కొండ్రాజు తిరుపతిరాజుతో యుద్ధముచేసి సిద్ధవటములో తన కత్తిమొన తెచ్చుకొనినాడట! ఆ సిద్ధవటముచెలమ పట్టున మట్ల అనంతరాజు తమ తండ్రిపేర యెల్లమరాజుచెఱువు కట్టించినాడు. ఈ విషయము పయి సీసమాలికలో నిట్లున్నది —

'తమతండ్రి యెల్లభూరమణుండు కొండ్రాజు
తిరుపతిరాజుపై బెరిగి కొట్టి
తన కత్తిమొన దెచ్చుకొనిన సిద్ధవటంబు
చెలమవద్దను పెద్ద చెర్వు చేసె'

ఎల్లమరాజుమీది మఱియొక చాటు పద్యము—

ఎవ్వాడు రక్షించె నీ రాచకుల నెల్ల
సింహాసనము చెడి చేరినపుడు
ఎవ్వాడు సాధించె నెలమి సిద్ధవటంబు
శత్రుసంఘంబుల సంహరించి
యెవ్వాడు పోషించె నిల గురుజను బంధు
వరమంత్రి సత్కవీశ్వరుల ప్రేమ
నెవడు గాంచెను గుత్తి యెరతిమ్మభూపాల
వరు డిచ్చు మన్ననల్ వరుసతోడ
నతడు చెన్నొందు సూర్యవంశాబ్ధిపూర్ణ
చంద్రు డన మించి సత్కళాసాంద్రు డగు
మానఘను డైన కోనభూజానిసుతుడు[చు
భూరితేజుండు మట్లెల్ల భూభుజుండు.

* ఈ పద్యము చాటుపద్యమణిమంజరి ప్రథమభాగములో ప్రకటింపబడినది. చూ. 65 పుట.

¶ ఈ సీసమాలిక పూర్తిగా మట్ల అనంత రాజుగారిమీది చాటువులతో ప్రకటింప బడును. చూడుడు.

మట్ల అనంతభూపాలుడు

ఇతడు మట్ల యెల్లమరాజుగారి కుమా రుడు కకుత్స్థవిజయప్రబంధకర్త ఇతడు శా. శ. ౧౫౨౭లో సిద్ధవటములో సిద్ధవ టేశ్వరుని దేవాలయము చుట్టువార రాతి ప్రాకారము కట్టించినాడు ఆప్రాకారముపై వ్రాయించిన శిలాశాసనములో నిట్లున్నది.

శాకేశాంబకబాణభూపరిమితే
మానేన విశ్వావసౌ
పౌన్నత్యేన చిరాయుషా చ గుణభా
జాచంద్రతారం విభుం
యస్యానంతనృపేణ తేన జనకే
నైవూటుకూరీ రణే
ప్రాప్తే సిద్ధవటేయ ముజ్జ్వలశిలా
సాలో విశాలః కృతః

ఈ శ్లోకమునకు దిగువ వ్రాసియున్న సీస మాలిక యిది—

శాలివాహననామశకవర్షములు వేయి
నేనూటయిరువదియేడు చనిన
విశ్వావసు వనంగ వెలయు వత్సరమున
సకలహిందూరాజ్యసార్వభౌమ
వీరవెంకటరాయవిభుడు చంద్రగిరందు
సీమసామ్రాజ్యంబు సేయునపుడు
భానువంశాంభోజభాను డంభోరాశి
గంభీరుడై వరగండమూర్తి
బిరుదసామజసింహభీమకేతనభర్త
దేవచోడాన్వయభూవిభుండు
రణఘూబలీభూతరావెలి వెలిగండ
వెంకటాద్రివీరవరవిభుండు
జంబులమడక భూసంగ్రామజయశాలి
కటకపురీమారకాపహారి
నంద్యాలకృష్ణమనరనాథభయదాన
దక్షదోర్దండవిచక్షణుండు
అఖిలకర్ణాటసింహాసనాధీశ్వర
దక్షిణబాహాభిధానధారి
విదళితకొండ్రాజువెంకటాద్రివిభుండు
చెన్నూరులోన సంపన్నగృహుడు
విబుధస్తుతకకుత్స్థవిజయప్రబంధాది

కావ్యనిబంధస్థగ్రంథకర్త
శ్రీమదెల్లమరాజు చెరువుతటాకసం
ఘటనానుభావసంఘటితయశుడు
ద్రవిడభూమధు గాది... ....
బంరతుణక్షీణబాహుబలుడు
పెనుగొండసమరయావనపాండుపరగర్వ
ఖర్వీకరణచణఖర్వభుజుడు
రంగమాంబాకుమారవతంసరత్నంబు
పరభీమబిరుదుల భాయిబండి
విమతావనీశ్వర వేశ్యాభుజంగుండు
బల్లరగండాంక భాసురుండు
మన్నెహంవీరుండు మంగళదాయుండు
రాయబెబ్బులి పరరాజబెణుడు
మట్ల తిర్వెంగళమానవాధిపరత్న
రత్నాకరు డనంతరాజశౌరి
తమ తండ్రి యెల్లభూరమణుండు
[కొండ్రాజు
తిరుపతిరాజుపై బెరిగి కొట్టి
తన కత్తిమున దెచ్చుకొనిన సిద్ధవటంబు
చెలమపట్టున బెద్ద చెర్వు చేసి
హృదయ ముప్పొంగ సిద్ధవటేశ్వరునకు
నౌపచారికమైన శాలాంతరముగ
బురముచుట్టును వరణమై పరిణమింప
ధాత్రి గట్టించె నాచంద్రతారకముగ.

గుర్రముకొండదుర్గముమీద ప్రభుత్వము చేయు సరదారుడు రాయరావణునకు జెల్లు సీమమీద చర్చచేసినాడు. అపుడు వెంకటపతిరాయల పురస్సరమువలన అనంతరాజుగారు దండు కదలిపోయిరి గుర్రముకొండ లడాయిలో మట్ల అనంతరాజుగారు బురుజులు కూలద్రోయించినపుడు భట్లు పొగడిన పద్యము—

కార్చిచ్చుకరణి బెనాక్క లాకసమందు
మందుతిత్తులకును సందడిలక
ఘూర్ణిల్ల జిచ్చులు గ్రుమ్మరించు తుపాకి
డబ్బుడిబ్బునకు దబ్బిబ్బు గాక
జడిగొని పెనుచిత్తజల్లుగా భోరన
దుముకించు రాళ్లకు దొట్రుపడక
ప్రతిశబ్దముల్ దిశల్ వగులనార్భటి సేయ
బలుఫిరంగిగుండ్ల కళుకు లేక
యాహవము నేసి పాదుకొవోదు లెంచ
గూలద్రోయవె గుర్రముకొండబురుజు
మట్ల యెల్లధరాధిరాణ్మణి యనంత!
రాజదేవేంద్ర! విక్రమరాఘవేంద్ర!

గుర్రముకొండ సాధించి తిరుగ సిద్ధవటానకు ప్రవేశించి మహాసామ్రాజ్యపదవి యేలుచుండగా భట్లు శ్లాఘనచేసిన పద్యము—

వీపుగాయమువాని వెదకిన లేదుగా

మట్లనంతుని ధరామండలమున
నెఱయోధ గానట్టి నియ్యోగి లేదుగా
మట్లనంతుని హితపు మంత్రులందు
నజు ధిక్కరించలే నార్యుండు లేదుగా
మట్లనంతుని సభామంటపమున
భోగ మేమతియున్న పురుషుండు
[లేదుగా
మట్లనంతుని పురమధ్యమునను
ననుచు దిగ్దేశములవార లభినతింప
వార్త కెక్కితి వవు రౌర! కీర్తి మించి
యెల్లభూపాలుసత్పుత్ర! హితచరిత్ర!
అమితగుణసాంద్ర! మట్లనంతావనీంద్ర!

వెంకటపతిరాయలవారి యనుమతిని మట్ల అనంతరాజుగారు సైన్యముతోగూడ బోయి తురుష్కులు మొదలయిన రావిళ్లసైన్యమును గుర్రముకొండయొద్ద విఱుగబొడిచి విజయము పొందిరి. ఆయా కార్యములలో ననంతరాజుగారియొక్క ప్రతాపము—

ఉదయాద్రిమన్నీల మది మింక జేయవా
ఘోరాజిలో గముల కూరియొద్ద
రావిళ్ల మూకల రీవు లింకించవా
కొంచక గుర్రముకొండయొద్ద
బాణెంబు దియ్యక పచరించి నిల్వవా
కలుకుగా గోళాలకోటయొద్ద
జేకొన్న చిరకీర్తి జెలరేగి వించవా
చప్పన్న దేశాధి పభలయొద్ద
రాజదేవేంద్ర! పౌరుషరామచంద్ర!
దానరాధేయ! త్రిభువననాథరాయ!

కాంగ్రెసు-కమ్యూనిస్టులు

(౭-వ పేజీ తరువాయి)

వ్యతిరేకసభలు జరుపుతారని ప్రభుత్వానికి తెలుసు అయినా కమ్యూనిస్టులు నాడు ఊరేగింపులు జరిపి, ఉపన్యాసాలిస్తే, ఆ ప్రాంతంలో ఒక్క సి ఐ డి లేడు పోలీసు లేడు - కొన్ని గ్రామాల్లో సరిగా సహకరించలేదని పల్లెప్రజలపై పితూరీలు చేసేవారనవచ్చు - అలాంటప్పుడు ఊళ్లో ప్రజలే ఆ కమ్యూనిస్టులను పట్టుకొని, పోలీసులకు ఎందుకు ఒప్పచెప్పలేదు అని ఇలా అనటం తేలిక కాని రంగంలోకి దిగితే? కొట్లాటలు, దొమ్మీలు, ఖూనీలు, ఇంకా అత్యాచారాలు కొన్ని జరిగి, పల్లెల్లో పరిస్థితులు మరింత విషమిస్తయ్. ప్రజలు పోలీసులకు తోడ్పడటం వేరు ప్రజలే పోలీసులై ప్రవర్తించటం వేరు ఈ రెండో పరిస్థితిలో శాంతిభద్రతలు సుస్థిరం కాకపోవటమే కాక, ప్రభుత్వవ్యవస్థయొక్క కూకటివేరుకే దెబ్బ తగులుతుంది. ఊళ్లో ఎవరు కమ్యూనిస్టులో, ఏమి చేస్తున్నారో, ఎక్కడ ఉంటున్నారో, వగైరా ఆమాకీ ప్రజలు పోలీసులకు తెలియజేయగలను' అంతే కాని వారినే కమ్యూనిస్టులను వేటాడమంటే, గ్రామాల్లో రక్తపాతం తప్ప, శాంతిభద్రతలు ఏర్పడవు

కమ్యూనిస్టు లెవరో తెలియని పోలీసులకు మార్గమేమిటి? గ్రామాధికార్ల రిపోర్టులు ఆధారం పల్లెల్లోని ఈ గ్రామాధికార్ల చరిత్రను పరిశీలిస్తే, వారిలో చాలామంది సక్రమమైన న్యాయనిర్వహణకు తగిన వారు కారని బోధపడుతుంది ఎల్లి మీద మల్లి, మల్లి మీద ఎల్లి ఇదే ఎక్కువగా వారి సంప్రదాయం పూర్వి దెబ్బలాటల్లో కక్షల్లో వారు భాగస్వాములు అటువంటి పక్షంలో వారి కయిష్టులంతా కమ్యూనిస్టులే. ఇది ఇలా ఉండగా, కొన్ని గ్రామాల్లో గ్రామాధికార్లు కమ్యూనిస్టులకు అనుకూలంగా ప్రవర్తిస్తున్నట్టు కనబడుతుంది. పోలీసులకు వారివ్వవలసిన తోడ్పాటు ఇస్తున్నట్టు కనబడదు ఇంక, ప్రాంతీయ, తాలూకా, జిల్లా కాంగ్రెసునాయకులపై పోలీసులు ఆధారపడక తప్పదు కమ్యూనిస్టు లెవరో నిజానికి కాంగ్రెసువారికి తెలియకుండా ఉండదు ఈ అంతఃకలహాలు, స్పర్ధలు లేకుండా ఉంటే, కాంగ్రెస్‌వారు నిష్పాక్షికంగా పోలీసులకు కమ్యూనిస్టులను వేలెత్తి చూపెంచగలిగేవారు. అంతే కాదు, గ్రామాల్లో కమ్యూనిస్టు వ్యతిరేకఉద్యమాన్ని బలంగా, తీవ్రంగా సాగించి కమ్యూనిస్టుఅరాచకాన్ని అంతమొందించగలిగేవారు కాని అంతఃకలహాలు, స్పర్ధలు ఉండటంతో, కాంగ్రెసు కార్యరంగంలో ఎక్కడా కమ్యూనిస్టులను అణగార్చగలిగే శక్తి లేదు ఇక పోలీసులతో సహకారం. కాంగ్రెసులో ప్రతిచోట రెండు ముఠాలు ఒక ముఠా వారు ఒకరు కమ్యూనిస్టు అని అంటే, రెండో ముఠా వారు కాదంటారు కాంగ్రెసు వారినే కాంగ్రెసువారు కమ్యూనిస్టులని పితూరీలు చేస్తుంటున్నారు కూడా ఈ కాంగ్రెసువారి మధ్య, అమాయకులు, కమ్యూనిస్టులు కానివారు పోలీసుల దాడులకు, అత్యాచారాలకు గురై, ప్రభుత్వప్రతిష్ఠకు దెబ్బ తగులుతోంది

ఒక గ్రామంలో ఏవో మందుగుండు సామాను దొరికినయ్. ఆ కమ్యూనిస్టులు ప్రాంతీయ కాంగ్రెసునాయకుని సిఫారసుతో నిర్బంధం తప్పించుకున్నారని వదంతి ఈ సందర్భాల్లో డబ్బు ప్రమేయం కూడా లేకపోలేదంటారు. ఏమైతేం వూర్లో వాళ్లను చూసి ఆ కమ్యూనిస్టులు హేళన చేస్తూఉంటారు. ఇది ఒక రకం మరోరకం. ఊళ్లో కక్షలబట్టి అయిన వాళ్లనూ, కానివాళ్లనూ కమ్యూనిస్టులని చెప్పి, వాళ్లను చావకొట్టించి కసితీర్చుకోటం

ఇలాంటి పరిస్థితుల్లో ప్రజ లేవిధంగా ప్రభుత్వానికి తోడ్పడగలరు? ఇటు కమ్యూనిస్టు దాడులు, అటు పోలీసు దెబ్బలు క్రమంగా ప్రభుత్వంపై నిర్లిప్తత, విరక్తి వృద్ధి చెందుతున్నయ్.

కాబట్టి కమ్యూనిస్టుల అరాచకశక్తులను నిర్మూలించాలంటే, పోలీసుశాఖ బాగా పనిచేయటమే కాక, ముందుగా కాంగ్రెసువారు తమ ఇల్లును చక్కబెట్టుకోవాలి. ప్రజలు సహకరించాలి అని చెప్పే ముందు, కాంగ్రెసు వారందరూ సహకరించాలి అనే నిబంధనను అమలు జరపాలి. ప్రభుత్వాన్ని స్థాపించిన కాంగ్రెసువారే ప్రభుత్వంతో సహకరించకపోతే, ప్రజల సంగతి చెప్పవలసిందేముంది?

కాంగ్రెసువారు ఐక్యతతో పనిచేస్తే, కమ్యూనిస్టుల ఆమాకీ సరిగా తెలియటమే కాక, గ్రామాల్లో కమ్యూనిస్టువ్యతిరేక ఉద్యమం ఆరంభమై, విజృంభించటమే కాక, ప్రభుత్వానికి అప్రతిష్ఠ కల్గిస్తున్న పోలీసుల అత్యాచారాలకు అవకాశం ఉండదు ఇప్పటిలా అమాయకులు, కమ్యూనిస్టులు కానివారు పోలీసులకు గురి అవరు అప్పుడు ప్రభుత్వమంటే ప్రజలకు గౌరవం, నమ్మకం కలిగి సహకరిస్తారు తాము కాని వారంతా కమ్యూనిస్టులే అనే మూఢసిద్ధాంతం వీడి, ఇతర ప్రజాస్వామిక పక్షాలతో కలిసి కాంగ్రెసువారు శాంతిభద్రతలకు పూనుకోవాలి

ఇప్పటి సేనాశిబిరం స్థానే, ప్రతి గ్రామంలో పార్టీప్రమేయం లేకుండా ప్రజలరక్షకదళాలను స్థాపించి, కమ్యూనిస్టుల అరాచకాన్ని ప్రచారంద్వారా, ప్రబోధంద్వారా, శిక్షితప్రతిఘటనద్వారా, అరికట్టాలి

కమ్యూనిస్టు అంటే చాలు అమానుషంగా చావమోదటం జరుగుతోంది. ఇది ఘోరమూ, అవివేకమూ కమ్యూనిస్టుల దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ప్రతిఘటించటం వేరు. కనబడే వాడి నెవడినో పట్టుకొని, పార్టీపై కసితీర్చుకోటం వేరు. అవలంబించే దౌర్జన్యానికి కూడా క్రమమూ, పద్ధతీ ఉండాలి. ఇలా అమానుషంగా హింసించటంవల్ల రాజకీయవాతావరణం పోయి, వ్యక్తిస్పర్ధలు విషమిస్తయ్ శాసనంబట్టి, జడ్జితీర్పుబట్టి శిక్షపొందటం వేరు. ఊరులో ఇంట్లో ఉన్నవాడిని ఉన్నట్టు పట్టుకొని, గ్రామ

విమలగుణ! శూర! యెల్లభూవిభుకుమార!
మంచుకెక్కిన ఒలవంత! మట్లనంత!

అనంతరాజుమీదివి మఱి రెండు చాటువులు___

బసవనబోయడై బసవను
బసవనిపై నెక్కనట్టి భవుడవు నీవే
కసనైరి వెలము లందఱు
రసికాగ్రణి! మట్లనంత! రణహనుమంతా!

బసవన బోయడే వెలమల
గసిబిసిగా నఱికినట్టి కండలు నెరుకుల్
బిసబిస విడెపెను గ్రద్దలు
రసికాగ్రణి! మట్లనంత! రణహనుమంతా!

స్థలమధ్య నిలబెట్టి చావమోదటం వేరు. మొదటిసందర్భంలో వ్యక్తికి పగ ఉండదు. రెండవసందర్భంలో పరాభవం పగతీర్చుకోటంకోసం సమయంకై చూస్తూ ఉంటుంది. అంటే మళ్లీ ఘర్షణ కొట్లాటలు గ్రామాల్లో కక్షలు హెచ్చిపోతాయ్

కాబట్టి కాంగ్రెసువారిప్పటి ఈ లోపాలను దిద్దుకొని, సుశిక్షితంగా, ఐక్యతతో, న్యాయబుద్ధితో పనిచేస్తేనే, రాష్ట్రంలో శాంతిభద్రతలు సుస్థిరం కాగలవు.

ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుల చర్యలు గెరిల్లాయుద్ధముతో సమానముగా ఉన్నయని ప్రజలను ప్రభుత్వం రక్షించాలని రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడు రంగా ప్రకటన చేశాడు. కమ్యూనిస్టులకు ఇంతకన్న ఉపకరించే సందేశం ఇంకొకటి లేదు ప్రజలకింతకన్న నైరాశ్యం కల్గించే సానుభూతి ప్రకటన ఇంకొకటి లేదు. పట్టప్పుడు ఉత్తరకుమారప్రజ్ఞలు, సమయం వచ్చినప్పుడు కార్యరంగంలో కన్పించకుండా పెద్దపెద్ద మాటలతో ప్రకటనలు చేయటం, కమ్యూనిస్టుల చర్యలను చూసి 'హిస్టీరియా' పొందటం కాంగ్రెసువారిలో కొంతమందికి ప్రజ్ఞగా ఉంటోంది. రైతుకాంగ్రెసు, చేనేతకాంగ్రెస్, విద్యార్థికాంగ్రెస్, యువజనకాంగ్రెస్, వగైరా చిల్లరమల్లరసంస్థలెన్నో ఉన్నయ్. కాంగ్రెస్ సభ్యత్వం చూస్తే, 40 లక్షలమంది కాంగ్రెసువారున్నారు. కాని కమ్యూనిస్టులను ప్రతిఘటించాలంటే, దశకంఠునిలా ఉన్న రాష్ట్ర (లేక రంగా) కాంగ్రెసు కుంభకర్ణునిలా నిద్రపోతూ ఉంటుంది. ప్రజారాజ్యం, ప్రజారాజ్యంఅని పొలికేకలు వేయటమే తప్ప, మన రాష్ట్రకాంగ్రెసుఅధికార్లకు ప్రజలకు సంపర్కం లేదు ప్రతిగ్రామంలో కుగ్రామంలో కమ్యూనిస్టుపార్టీ బలం, బలగం కొద్దో, గొప్పో ఉన్నయ్. కాని కాంగ్రెసు చిహ్నాలు కన్పించవు. ఈ మూడేళ్లలో రాష్ట్రకాంగ్రెసువారు ఎన్ని గ్రామాల్లో కాంగ్రెసు సంఘాలను స్థాపించారు? ఎన్ని గ్రామాల్లో దైనందినకార్యక్రమం అమలు జరుపుతున్నారు? ప్రభుత్వం అది చేసిందా, ఇది చేసిందా అని అడిగినట్టే, రాష్ట్ర కాంగ్రెసు ప్రజల కుపయోగపడే పనలు ఏమి చేశారు అని అడిగితే సమాధానం ఏమి వస్తుంది?

ప్రతిగ్రామంలోనూ కాంగ్రెసు మళ్ళీ శక్తివంతమై, ప్రబోధం ద్వారానూ, అహింసాయుత, హింసాయుతప్రతిఘటనలద్వారానూ కమ్యూనిస్టువ్యతిరేకఉద్యమాన్ని ఆరంభించి, ఒఠియంగా సాగించనంతవరకు, కమ్యూనిస్టుఅరాచకాన్ని సమూలంగా, సక్రమంగా నిర్మూలించటం దుస్సాధ్యం కమ్యూనిస్టులపై పోలీసుల ఆధిక్యతకన్న ప్రజల ఆధిక్యత సిద్ధించటం ప్రజాస్వామ్యవ్యవస్థకు బలం. ఇందుకు ప్రజాస్వామికపక్షాలే బాధ్యత వహించాలి. కాంగ్రెసు ఈనాడు ఈ బాధ్యతని నిర్వహించగలదని అనుకోటానికి ఎక్కువ అవకాశాలు కన్పించటంలేదు.

తిరుగుబాటు

(22 వ-పేజీ తరువాయి)

న్నిచ్చి కాపాడ్డంకోసం ఆనందమయి ఇంటికి తిరిగి వస్తుంది.

ఇదీ కథ వేశ్యాలోలుడైన పతి, పతిభక్తిగల సతి, మొదట కష్టాలు తరవాత సుఖసమాగం. సర్వసామాన్యమైన ఇతివృత్తమే. అక్కడక్కడ సన్నివేశాల్లోనూ, మాటల్లోనూ కొత్తదనం తీసుకురావడానికి ప్రయత్నించారు అయితే ఈ కథను ఈ సన్నివేశాలన్నిటితోనూ కలిపి తియ్యడానికి 18500 అడుగులు అనవసరమనిపిస్తుంది మూడింట ఒకవంతు తగ్గించినా ఉన్న కథ పట్టు చెడదు. చిత్రంలో అక్కడక్కడ చేర్చబడిన జాక్ (భీమవరపునరసింహారావు) హాస్యం కొంత కొత్తదనం ఇస్తుంది న్యాయాధికారిపుత్రికలుగా లలిత, పద్మిని నటించారు. వీరు తరుచు మగవారి దుస్తుల్లో కనిపిస్తారు. వచ్చీరాని తెలుగు "ముద్దుపలుకుల్లో" మాట్లాడతారు వీరి ఆంగ్ల నృత్యానుకరణ రాణించలేదు

అక్కడక్కడ హృద్యమైన సన్నివేశాలతో కథ తాపీగా నడుస్తుంది. శాంతకుమారి నారాయణరావులు చక్కగా నటించారు కృష్ణవేణికి మేకప్ అందమీయక పోయినప్పటికీ స్వతంత్రప్రవృత్తి గల భార్యగా చక్కగానే నటించింది శబ్దగ్రహణం స్పష్టంగా లేదు. పాటల్లో మాటలు సరిగా వినిపించలేదు. పాటలు, మాటల్లో చురుకుపోంకం అడపాతడపా మాత్రం కానవస్తాయి సంగీతప్రతిభ ఇందులో అట్టే కనిపించలేదు. ఛాయాచిత్రగ్రహణంమాత్రం చాలా బాగుంది సన్నివేశాల్ని సరిగ్గా అర్థం చేసుకుని తదనుగుణ్యంగా కెమే నడిచినట్టుంది. మెత్తని కాంతుల్లో రంగనికవసరమైన నీడల్లో చిత్రాన్ని చూడ్డానికి చక్కగా తీశారు మొత్తానికి పాతకథాంశాన్ని కొత్త రంగుల్లో తీశారు.


సంగీతము

(24 పేజీ తరువాయి)

అనునది పూర్వాంగమనియు (*Lower Tetrochord*) "ప. ద. ని స" అను నాల్గుస్వరములు ఉత్తరాంగమనియును (*Upper Tetrochord*) పేర్కొనిరి ఈ పూర్వాంగమందలి రిషభ, గాంధారములవల్ల లభ్యమగు భేదములు ఆరున్నూ; ఉత్తరాంగమందుగల దైవత, నిషాదములవల్ల లభ్యమగు భేదములు ఆరున్నూ, కలుగుచున్నవి ఇటుల లభ్యమగు పూర్వాంగభేదములు 6 టినీ ఉత్తరాంగభేదములు 6 టినీ ఉత్తరాంగభేదములు 6 టచే ప్రస్తరించగా (6 × 6) = భేదములుగల మేళకర్తలు లభ్యమగుచున్నవి. ఇటుల శుద్ధమధ్యమమువలన 36 మేళములు వచ్చుచున్నవి తిరిగి ఇటులే తీవ్ర లేక ప్రతిమధ్యమమువలన మరియొక 36 మేళములు వచ్చుచున్నవి ఈవిధముగా రెండు విధములగు మధ్యమభేదములచే 72 మేళములు లభ్యమగుచున్నవి. ఇవియే మేళకర్తలు లేక "*Thats* థట్సు" అని చెప్పబడును.

ఈ 72 మేళకర్తల విభాగవిధానమంతయును "వేంకటమఖి"చే కనుగొనబడినట్టియొక గొప్ప విశేషవిజ్ఞానమని చెప్పదగును అంతకుపూర్వమున 19 మేళములు (మరియొక మతానుసారము 20 మేళములు) మాత్రమే అవసరమగు అన్నిజన్యరాగములకును సరిపెట్టియున్నారు. ఈ 72 మేళకర్తలవిధానము ఇటీవల కనుగొనబడిన నూతనవిధానమే యగును. వేంకటమఖి తన "చతుర్దండిప్రకాశిక"యందు ఈ విషయమును స్పష్టముగ నిరూపించియున్నాడు. (చతుర్దండిప్రకాశిక - మేళప్రకరణము - చూడుడు) 12 ఈ పైన చెప్పబడిన 72 మేళకర్తలయందును హిందూస్థాని గానవిధానమునకు ముఖ్యముగా ఎంచబడినవాటిని 10 పదింటని మాత్రమే స్వీకరించియుండిరి ఆ పదింటివల్లను వారి గాన అవసరములకు సరిపెట్టుకొనియుండిరి. [సశేషం]

లేఖలు



ఆంధ్రసారస్వత పరిషత్తు బొంబాయిశాఖ

ఆర్యా,

బొంబాయి(లో)న నెంబరులో 15 వీధులున్న పేట కామాఠీపుర మనుపేర వ్యవహరింపబడును. అందు నూటికి తొంభయి పాళ్లు ఆంధ్రులు. వీరిలో ముప్పాతికకు మించి తెలంగాణా వాస్తవ్యులే గోచరింతురు, నిజామాబాదు కరీంనగరు హైద్రాబాదు జిల్లాల వారు సకుటుంబముగా వసించుచు మిల్లులలో బీడీలఫ్యాక్టరీలలో కట్టుపనులలో నిమగ్నులై క్షణమైనను కాలము వృధాపోనీక యుందురు. కనీసము యాభయివత్సరాల నుండి కాపురము చేయుచున్న తెలుగువారు కొందరు గుజరాతి మహారాష్ట్రభాషలకు అలవాటుపడి తెలుగనిన యేమిటో తెలిసికొనలేనంతటి స్థితిలో తెలుగువారమని చెప్పకొనుచు జీవించే కుటుంబాల్లు పెక్కుగలవు ప్రతియేట వేలసంఖ్యలలో తెలంగాణానుండి బొంబాయిమిల్లులపనులకు పోవుచు వచ్చుటచే సంబంధ మేర్పడినది. కేవలము ఆంధ్రులు వసించుభాగములనే కామాఠీపుర మనియు వారిని కామాఠీలనియు పిలుతురు. అచ్చటివారి దృష్టిలో కామాఠీలు నీచముగా అగుపడుదురు. ఈ కామాఠీపద మేల సృజింపబడెనో తెలియదు. కేవలము కాయకష్టము చేసికొని బ్రతికే తెలంగాణావారికే ఇట్టిపేరు కట్టబడుట ఏదో రహస్య ముండితీరును.

పెక్కు కుటుంబాలు స్థిరనివాస మేర్పరచుకొని స్వంతవ్యవహారముల నడుపుకొనుచు కోర్టులో ప్లీడర్లు చేయు లక్షాధికార్లుసయితము కామాఠీ లనే పిలిపించుకొనుట ఒక సరదాయగును. ఆంగ్లవిద్య రానికారణముననో లేక నవీననాగరకత తెలియకనో ఆటపాటలు భోజనభాజనాలు పండుగలు వ్రతాలు వేషములు వచ్చీరాని తెలుగుమాటలతోనే, తెలుగుదనము మాపుకొందురు లోవరుపరేలు, దాదరుభాగాలలోకూడా తెలుగువారు అధికసంఖ్యాకులే వున్నారు. మొత్తముజనాభా యీ మూడుప్రాంతాలలో సుమారు వకటిన్నరలక్ష వుంటుం దని అంచనా.

వీరికి పౌరసత్వపు హక్కులు భాషవినా అన్ని సౌకర్యాలు కల్గింపబడుచున్నది. ప్రాతినిధ్యము వివరించే పెద్దలు ఆంధ్రులైనను గుజరాతి మహారాష్ట్రము నే అభ్యసించినవా రగుట, మాతృభాషకు ప్రాముఖ్యత నివ్వబడలేదు.

మున్నూర, పద్మసాల, రెడ్డిమహామేరు సంఘాలు నెల్పకొల్పబడియున్నను నామ మాత్రమే యగుపడును. ఆర్యసమాజమువారు మాత్ర మించుక శ్రద్ధ చూపుచున్నారు.


మునిసిపాలిటి హైస్కూలుపక్షమున తెలుగువారిపేరిట ప్రతియేటా యేడువందల విరాళాల స్వీకరించుచు మచ్చునకైన ఒక గ్రంథమో పత్రికయో ప్రదర్శనానికైనా అగుపడనీక తెలుగుదనాన్ని దిగమ్రింగి గుజరాతిమహారాష్ట్రల సేవలను చైకొని తృప్తి పడుచు తెలుగుగ్రంథాలయ మని గుజరాతీ భాషలో బోర్డు తగిలించుకొని అన్యుల పాల బడుచున్నది.

స్వచ్ఛమగు ఆంధ్రులై సంపాదనయే ముఖ్యావసరముగా యెంచుకొని అన్యులకు తలలొగ్గి తమ మాతృభాషదైన్యతను గుర్తింపక తిరుగుచున్న బొంబాయిఆంధ్రుల భవిష్యత్తు ఆలోచించి సుసమయమున పరిషచ్ఛాఖ స్థాపించి ప్రజలలో చైతన్యము కలిగించిన ఆంధ్రసారస్వతపరిషత్తు హైదరాబాదు వారి చరిత్రమును ముందు తెలుగుహృదయాలలో శాశ్వతముగా సువర్ణాక్షరముల లిఖింపబడగలదని గర్వపడవలసియుండును. ఈమార్చి నాల్గవ తేదీ సాయంత్రము ఈ పరిషత్తు శ్రీవి, అరతుల్లా, గారి అధ్యక్షతను సమావేశమైనది. (తుల్లా విశ్వనాథరావుగారు) వీరు నిజామాబాదుప్రాంతముల వీరి కుటుంబము యాభయి వత్సరాలనుండి బొంబాయిలో నివసించుచు గుజరాతీలో పాండిత్యము సంపాదించిన ఆంధ్రయువకులు. అధ్యక్షత వహించి మాతృభాషరానందులకు ఆవేదన వెలిబుచ్చుచు ఇక ముందు సారస్వతపరిషత్ శాఖకు మనస్ఫూర్తిగా తోడ్పడుదుననియు, ఒక కార్యాలయము, హైస్కూలులో పరిషత్ విద్యలకు సౌకర్యాలు కల్గించగల ననియు బహిరంగ సభలో వాగ్దానము ప్రతిజ్ఞ యొనర్చిరి తెలుగువారి సుస్నిగ్ధహృదయసీమలలో తెలుగు భాషాబీజములు మోసు లెత్తిన వని తలంచుట పొరపాటు గాదు. వివిధసంఘాల వారు కూడా పాల్గొని సభ కుత్సాహమును కల్పించి మాతృభాషావశ్యకతను ధృవపరచిరి రెడ్డిసంఘములు నడపబడుచున్న తెలుగు గ్రంథాలయము నికముందు సార్థకనామ మొనర్తు మని వెల్లడించిరి. తెలుగుపత్రికల లీస్టుపుస్తకములు వ్రాసికొనుటయే కాక తెలుగు చదువువారిసంఖ్య వృద్ధిపరచుటకు పవిత్రభావాలు వెల్లడించిరి.

అవిరళకృషితో, ఆంధ్రులను ఆంధ్రులనుగా సలుపుటకు దృఢనిశ్చయులై కృషి సలుపుచున్న శ్రీ నరశింహాశర్మ అధ్యక్షులు ధరాప్రకాశ్ ఉపాధ్యక్షులు అంబాద్రి కార్యదర్శి కే. రాములు, సహాయ కార్యదర్శి, కోశాధ్యక్షులు కృష్ణాజిగారలు ప్రశంసనీయులు

ఆంధ్రదేశము, తెలంగాణాలలోని సారస్వతపరిషత్తులవారు లక్షన్నర ఆంధ్రుల కాలవాలమగు సుప్రసిద్ధబొంబాయినగరమునకు కేవలము సందేశముల బంపుట కాక, ముఖ్యకార్యకర్తలు వారు అప్పుడప్పుడొకసారి వెళ్ళి మోసు లెత్తిన సారస్వతోద్యానమునకు సుధాసేచన మొనర్చినచో అచిరకాలముననే ఇచట తెలుగువారలకు అభ్యుదయము కలుగునని ఆశించుచున్నాను.

శ్రీ పులిజాల గోపాలరావు.



ప్లానింగ్ కమీషన్ ప్రథమసమావేశము పండిట్ నెహ్రూ అధ్యక్షతన మార్చి 28 వ తేదీన న్యూఢిల్లీలో జరిగింది.



మద్రాసు మంత్రి గా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు సారథివారి "అగ్నిపరీక్ష" చిత్రనిర్మాణప్రారంభోత్సవం జరిపినప్పటి ఛాయాచిత్రం. డిప్యూటీ స్పీకరు శ్రీమతి అమ్మన్నరాజాగారుకూడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

Regd No M 4479

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

ప్రథమ- ద్వితీయ సంపుటములు

ప్రథమసంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౮౦౦ పుటలు గలవు. ఇందు ‘అ’ నుండి “అధ్వర్యు” వరకును గలవిషయము గలదు. త్రివర్ణపటములు ౮ ఇతర పటములు ౧౨౫, వివిధ విషయములు ౪౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౮౦౦ లకు మించిన పుటలు కలవు. “అన్” మొదలుకొని “అశ్విని” వరకు గలవిషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీ స్తూపమునకును, ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు. ఇవిగాక మరి ౧ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీశిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయ మను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేలు వేలు హస్తములను సూచించు బొమ్మలు ౫౩ ను, ‘అనాహతము’ నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఈ మూ వ్యాసములకు చెందిన చిత్రములను మొత్తము మీద ౨౦౦ కు పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౪౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను, బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతి సంపుటమున ౮౦౦ పుటలుండును

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టు ఖర్చులు: రూ. ౧-౯-౦.

రైలు ద్వారా దగ్గర దోట్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వకార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు 1.

Edited, Printed & Published by S Sambhu Prasad, at the Andhra Patrika Press, 7 Thambu Chetty St., Madras.